
75 పైసలు


సౌందర్య పోషణకు


శ్రీ శంభు ఫిలింస్ వారి
సమర్పణ!
తెలుగు సంస్కృతికీ,
నాగరికతకూ నుడికారము
దిద్దిన తొలి తెలుగు చక్రవర్తి
శ్రీకాకుళ
ఆంధ్రమహావిష్ణు
కథ
నిర్మాత: దగ్గుబాటి లక్ష్మీనారాయణ చౌదరి
దర్శకత్వం: ఎ.కె. శేఖర్
పింగళి నాగేంద్రరావు. సంగీతం పెండ్యాల

జ్యోతి బుక్స్

సరికొత్త ప్రచురణలు

వేట

ముళ్ళపూడి వెంకటరమణ

వెల : రూపాయిన్నర

వంటొచ్చిన మొగాడు

భమిడిపాటి రామగోపాలం కథలు

(మొదటి సంపుటం)

వెల : మూడు రూపాయలు

క్షమాహతుడు

(అద్భుత రస ప్రధానమైనగాథ)

రచన : భూపతి

వెల : రెండు రూపాయలు

1966 లో మీ రాశిఫలం

(జన్మ, నామ నక్షత్రాలనుబట్టి స్త్రీ పురుషుల అదృష్టాలను తెలియజేసే ఉత్తమ గ్రంథం)

రచన : మహేష్

వెల : రూపాయి

ఇతర ప్రచురణలు

80 రోజులలో భూప్రదక్షిణం

మూలం : జూల్స్‌వెర్న్

అనువాదం : ముళ్ళపూడి వెంకటరమణ

సాదా ప్రతి : వెల : రు. 5—00

మేలు ప్రతి : వెల : రు. 6—00

బి. వి. రమణరావు రచనలు

కథలు వెల : రు. 2—50

నాటికలు వెల : రు. 1—50

నేనుచూసిన అమెరికా

రచన : ఎ. నాగేశ్వరరావు

సాదా ప్రతి వెల : రు. 2—50

లైబ్రరీ ఎడిషన్ వెల : రు. 3—50

కూనలమ్మ పదాలు

రచన : ఆరుద్ర

అదనపు పదాలతో—వెల: రు. 1—00

రసికజన మనోభిరామం

(హాస్యసంపుటి) వెల: రు. 1—00

ప్రతులకు :

జ్యోతి బుక్స్, విజయవాడ-2

తొలిమాట

తప్పు ఒకచోటు; శిక్ష మరొకచోటు. ఇది లోకంలో తరచుగా జరిగేదే. కాని, ఒక వ్యక్తి ఆ శిక్షను కోరికోరి స్వీకరిస్తే? ఆతరువాత అత్యాగానికి గడ్డిపోచ విలువైనా లేకుండా పోతే? ఆ వ్యక్తి హృదయవేదన ఎవరికర్థమవుతుంది? (25 వ పేజీ)

* * *

"పోలీ శాంతీ మియా వీరా" ఇదొక వ్యాధి పేరు. (రక్తంలో "శాంతి" కణాలు ఎక్కువైతే వచ్చే వ్యాధి); ఒక కథపేరు కూడా. ఇది మామూలు అబ్బాయి, అమ్మాయి కథ కాదు; ఒకబ్బాయి, ముగ్గురమ్మాయిల కథ. బోయ్ మీట్స్ త్రీ గర్ల్స్. అందుచేత బోలెడు డ్రామా. లేక డ్రీమా? ప్రేమా? (65 వ పేజీ)

ఒక చిన్న మనవి :

"జ్యోతి" ఎడిటర్‌కుగాని, మేనేజర్‌కు గాని ఉత్తరాలు వ్రాసేవారు ఈ క్రింది బిజినెస్ ఆఫీస్ చిరునామాకే వ్రాయగోరుతున్నాము.

ఎడిటర్, లేక మేనేజర్

"జ్యోతి" తెలుగు మంత్లీ,

18/50, ఆంధ్రరత్నరోడ్డు,

గాంధీనగరం పోస్టు,

విజయవాడ - 3.

జ్యోతి మేనేజింగ్ ఎడిటర్.

సచిత్ర మాసపత్రిక

బకింగ్‌హామ్‌పేట పోస్టు
విజయవాడ-2.

విడిప్రతి వెల
75 పైసలు

ఏడాది చందా
9 రూపాయలు

సంపుటి 4
మే 1966
సంచిక 5

మేనేజింగ్ ఎడిటర్
వి. వి. రాఘవయ్య

ఆర్ట్ ఎడిటర్
బాపు

సంపాదకవర్గం
నండూరి
రామమోహనరావు
ముళ్ళపూడి
వెంకట రమణ
వి. ఎ. కె. రంగారావు
రావికొండలరావు

ముఖచిత్రం :
ఆశా ఆర్ట్సు వారి
"చిలకా గోరింక"లో దృశ్యాలు

ఉత్తరాలు

ఏప్రిల్ నెల జ్యోతిలో ప్రచురితమైన "వానవెలిసింది" శ్రీ రఘునాథరావు కథానిక - చక్కని సంపెంగ పువ్వయితే, ఆకథ గురించి సంపాదకీయంలో మీరు వ్రాసిన మూడు మాటలూ, ఆ సంపంగి పువ్వుకుండే చక్కని సౌరభం. ఆయనకీ, మీకూ నా అభివందనములు.

తెన్నేటి రామారావ్,
రూర్కెలా (ఒరిస్సా)

ఈ నెల జ్యోతిలో (ఏప్రిల్) "తొలిమాట"లో వ్రాసినట్లు బీనా దేవిగారి "సిక్స్‌త్ సెన్స్" చాల సరళంగాను, సహజంగాను వుంది. "వాన వెలిసింది" కథ చాలా గంభీరంగాను, భావస్ఫోరకంగాను వుంది. తప్పు చేసినవాడి మానసిక సంఘర్షణ, తప్పు తెలిసికొన్న తరువాత దానిని సరిదిద్దుకొనే విధానం చాల నేర్పుగా, సూటిగా హృదయానికి హత్తుకునేలా చెప్పిన రచయిత అభినందనీయులు. ఏమైనా ఈ నెల పత్రిక స్థాయి మరింత బాగా పెంచినందుకు ముఖ్యంగా మీరు అభివందనీయులు.

ఎన్. లక్ష్మీరాజ్,
వాల్తేరు.

ఈ మాసం పత్రిక చదివినంతసేపూ ఇంకోమారు చదవాలనిపించింది. కథలన్నీ మళ్ళీ మళ్ళీ చదివినా తృప్తిలేదు. బీనా దేవిగారి "సిక్స్‌త్ సెన్స్" నన్నెంతో ఆకర్షించింది.

"గిరీశం" లెక్చర్లు కూడా ప్రచురించి వున్నట్లయితే మా (మీ) 'జ్యోతి' మరెంత ప్రకాశవంతంగా వెలిగేది!

సకినేల సత్యనారాయణ,
బళ్ళారి.

జ్యోతి "ఏప్రిల్" సంచిక "గెటప్" బాగుంది. అందులో "పాప్ మ్యూజిక్" సమీక్ష వ్రాస్తూ, సినిమాల విజయానికి సంగీతం ప్రధానం కాదన్నట్టు వ్రాసేరు. కాని ముఖ్యంగా సినిమాలలో "ఇంటరెస్టింగ్"గా వుండేది సంగీతమే కదా. అటువంటి సంగీతాన్ని మన సంగీత దర్శకులు "స్మగుల్" చేస్తే ఇక మనకు "ఒరిజినాలిటీ" లేనట్టే కదా. అందుచేత సంగీతాన్ని కాపీ కొట్టిన విషయాలన్నీ "అందేవ్"గారు చాలా విపులంగా తెలియ బర్చారు.

అయనకి మీ రన్నట్టు 'డాక్టర్ ఆఫ్ పాప్‌మూజిక్' డిగ్రీ ఇవ్వదగ్గవారే. నిజంగా 'అందేవ్'గారి కృషి అభి వందించ వలసినదే.

ఒక చిన్న సందేహం. ఒక పైసకి 'పాప్‌కార్న్' ఎక్కడైనా మీ రిప్పిస్తారాండీ.

'జ్యోతి'లో 'కార్టూన్'లు చాలా బాగున్నాయి.

కె. వి. రామారావు,
విశాఖపట్నం.

'ఏప్రిల్' నెల జ్యోతి మాతెలుగు క్లబ్‌కు ఈ నెల చాలా అలశ్యంగా చేరింది. దానికి మేము చాలా చింతిస్తున్నాము. స్వంత ప్రెస్ ఉన్న మీరే ఇలా అలస్యంగా 'జ్యోతి'ని హైదరాబాద్‌కు పంపడం చాలా అన్యాయం.

ఇహపోతే, 'ఇవ్‌ఫినిటీ' కథ చాలా బాగుంది. విద్యుత్ గణాంక యంత్రాలను కొన్ని కార్యాలయాలలో నెలకొల్పడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. సరిగ్గా సమయానికి సరిపోయి నటువంటి చక్కటి కథ వ్రాసినందుకు కృష్ణమూర్తిగారికి, ప్రథమ బహుమతి ఇచ్చి ప్రచురించిన మీకు చాలా థాంక్స్. ముందు ముందు కూడా ఇలాగే మంచి కథలను అందజేయ గలరని ఆశిస్తూ...

కె. యస్. సుబ్రమణ్యం,
జి. ఆర్. కృష్ణ, జి. వెంకటేశ్వర్లు,
యస్. వి. నాగేంద్రరాయు.
(జీవిత భీమా కార్యాలయ ఉద్యోగులు)
హైదరాబాద్.

ఏప్రిల్ నెలలో ప్రచురించిన కథలన్నీ బాగానే వున్నాయి. కాని కాలేజీ విద్యార్థులకు కేటాయించిన కథలలో విశిష్టతేమీ కనబడుటలేదు.

మాదాల రామచంద్రరావు,
ఏలూరు.

అచ్చ తెలుగు నటుడు 'గుమ్మడి' గురించి ప్రచురించినట్లు ప్రతి నెల ఒక్కొక్క నటుని గురించి అలా ప్రచురిస్తే బాగుంటుంది.

ఎస్. సంజీవరావు, ఖరగ్‌పూర్.

'ఏప్రిల్' జ్యోతిలో గుమ్మడిగారి గురించి వ్రాసినందుకు చాలా ఆనందంగా వుంది.

ఎస్. ఎస్. ప్రకాశ్,
హైదరాబాదు.

'వాన వెలిసింది' అనే కథ బాగా వుంది. చిన్న చిన్న కథల పోటీలో బహుమతి నొందిన 'ఇన్‌ఫినిటీ', 'డాక్టర్', 'మనస్సు' కథలు బాగున్నాయి. ఈ కథలను వ్రాసిన విద్యార్థి త్రయమునకు అభివందనములు.

ఎస్. ఇందిర, సీతారాంపురం మైన్స్

రాజకీయాలు

ఆహారోత్పత్తి లక్ష్యాలు

ఈ మధ్య ఢిల్లీలో వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఆహార మంత్రులు సమావేశమయ్యారు. ఆహార పరిస్థితిని, దాన్ని అభివృద్ధి చెయ్యడానికి మార్గాలను క్షుణ్ణంగా చర్చించి కొన్ని ముఖ్యమైన నిర్ణయాలు చేశారు. ఇటీవల దేశంలో జరిగిన మంచి పనులలో ఇదొకటి.

ఆహార సమస్యను చర్చించడం, దాని పరిష్కారానికి ప్రతిజ్ఞలు తీసుకోవడం, ఆకర్షణీయమైన పథకాలు తయారు చేయడం ఇదివరలో చాలా సార్లు జరిగిందే. అవన్నీ షెల్ఫులలో భద్రం చేయబడి, బూజుపడుతున్నాయి. ఇప్పటి వరకు జరిగిన నిర్ణయాలేవీ అమలుకాలేదు.

ఈసారి అలా జరగదనే ఆశాభావం కలుగుతున్నది. సమస్యను పరిష్కరించడానికి ముఖ్యమంత్రులు ఆచరణ సాధ్యమైన కొన్ని మంచి నిర్ణయాలు చేశారు. వీటిని అమలు చేయడానికి ఒక ఏడాది గడువు మాత్రమే పెట్టుకున్నారు. ఏడాది గడువు ఇట్టే తిరిగిపోతుంది కనుక, నిర్ణయాలను ఎంతవరకు అమలు చేసింది తేలికగా పరీక్షించి చూసుకోవచ్చు.

1966-67 సంవత్సరంలో 9 కోట్ల 70 లక్షల టన్నుల ఆహార ధాన్యాలను పండించాలని ఢిల్లీ సమావేశం నిర్ణయించింది. 1964-65 లో 8 కోట్ల 84 లక్షల టన్నుల ధాన్యం పండింది. ఇది ఇప్పటివరకు మనం సాధించిన గరిష్ఠ ఉత్పత్తి. అయితే 65-66 సంవత్సరంలో వర్షాలు కురవక, చాలా రాష్ట్రాలలో జలాధారాలు వట్టిపోయి, ఉత్పత్తి ఒక కోటి 25 లక్షల టన్నులు తగ్గిపోయింది. ఈ లోటును భర్తీ చేసుకోవడానికి రానున్న సంవత్సరంలో, పూర్వంకంటె రెట్టింపుకు పైగా అమెరికా మొదలైన దేశాల నుంచి దిగుమతి చేసుకోవలసి వుంది.

వచ్చే సంవత్సరంలో 9 కోట్ల 70 లక్షల టన్నుల ధాన్యం పండించడం మాటలతో అయ్యేవని కాదు. చాలా తీవ్రమైన కృషి చేయవలసి వుంది. దీనికి ఢిల్లీ సమావేశం కొన్ని మార్గాలను నిర్ణయించింది. కేంద్ర ఆహారమంత్రి శ్రీ సి. సుబ్రహ్మణ్యం

రూపొందించిన వ్యూహాన్ని అనుసరించి ఈ నిర్ణయాలు జరిగాయి.

ఎక్కువ పంటునిచ్చే విత్తనాలను వాడడం ఈ వ్యూహంలోని ముఖ్యమైన అంశం. గోధుమ, వరి, జొన్న మొదలైన పంటలను తీసుకుంటే ప్రస్తుతం మన దేశంలో ఎకరానికి లభించే ఉత్పత్తి చాలా తక్కువగా వుంటున్నది. దీనికి ప్రధానమైన కారణం సారంలేని విత్తనాలను ఉపయోగించడం. అలా కాకుండా స్వల్పకాలంలో బాగా దిగుబడినిచ్చే విత్తనాలను కనుక వాడినట్టయితే, ఉత్పత్తిని రెండింతలు, మూడింతలు కూడా చేయవచ్చు.

ఈ ఉద్దేశంతో గోధుమ, వరి మొదలైన పంటలకు మేలురకం విత్తనాలను ప్రవేశపెట్టాలని ముఖ్యమంత్రులు నిర్ణయించారు. 1966-67 లో 60 లక్షల ఎకరాలలో ఈ విత్తనాలను నాటుతారు. ఇందులో 26 లక్షల ఎకరాలలో మంచిరకం వరి వంగడాలను వాడుతారు. క్రమంగా, రానున్న సంవత్సరాలలో ఈ మేలురకం విత్తనాల వాడకాన్ని ఇంకా ఎక్కువ విస్తీర్ణం భూమికి విస్తరిస్తారు.

మేలు విత్తనాల వల్లనే పని జరగదు. వాటికి రసాయనికపు ఎరువులను కూడా ఎక్కువగా ఉపయోగించాలి. దేశంలో ఉత్పత్తి అవుతున్న ఎరువులు చాలవు కనుక, విదేశాల నుంచి బాగా దిగుమతి చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం నిశ్చయించింది. వీటిని ముఖ్యంగా కొత్తరకం విత్తనాల నుపయోగించే క్షేత్రాలకు పంపిణీ చేస్తారు. అంతేకాక, ఆ క్షేత్రాలలో పంటను తెగుళ్ళనుంచి రక్షించడానికి మందులను సప్లయి చేస్తారు. నీటి పారుదల సమృద్ధిగా జరిగేట్టు చేస్తారు. రైతులకు పరపతి సౌకర్యాలు బాగా కల్పిస్తారు. రైతుకు లాభసాటిగా, ప్రోత్సాహకరంగా వుండే ధరలు నిర్ణయిస్తారు.

ఇప్పటికీ మన దేశంలో వ్యవసాయంలో అధికభాగం పురాతన పద్ధతులలోనే సాగుతున్నది. ఈ పద్ధతులుపోయి అధునాతన పద్ధతులు వస్తేగాని అధికోత్పత్తి సాధ్యం కాదు. ఆహారంలో స్వయం సమృద్ధమైన దేశాలన్నీ పాత పద్ధతులను విడనాడి ఆధునిక పద్ధతులను అవలంబించడం ద్వారానే అభివృద్ధి చెందాయి. మన జనాభా ఎక్కువని, పంటభూమి తక్కువని, వర్షాలు సరిగ్గా కురవవని, మనది బీదదేశమని, రైతులు విద్యాగంధం లేనివారని ఏవేవో సాకులు చెప్పుకున్నంత మాత్రాన లాభంలేదు. అనతి కాలంలో మనం ఆహార విషయంలో స్వయం సమృద్ధిని సాధించాలి.

ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి అమెరికా వెళ్ళినప్పుడు ప్రెసిడెంట్ జాన్సన్ ఇండియాకు ఆహార ధాన్యాల విషయంలో తాము చేయగలిగినదంతా చేస్తామని వాగ్దానం చేశారు. అయితే, ఎల్లకాలానికి మనల్ని అమెరికా గాని, ఇతర దేశాలుగాని ఆదుకోలేవు. ఆహారం వంటి ముఖ్య విషయంలో మనం ఇతర దేశాలమీద ఆధారపడి వుండడం ఎన్న కోచనీయం లేదు. ఒకరకంగా ఇది భిక్షాటన చేయడం వంటిదే; ఆత్మగౌరవాన్ని చంపుకుని, చేతులు చాచి దేహీ అని యాచించడమే; ఇతరుల దయాదాక్షిణ్యాలమీద ఆధారపడడమే.

ఈ దుస్థితినుంచి మనం సాధ్యమైనంత త్వరలో బయటపడాలి. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత 18 ఏళ్ళకు కూడా మనం భిక్షాపాత్ర పుచ్చుకుని దేశాలు తిరగవలసి రావడం సిగ్గుచేటు. దీనికి త్వరలో పరిష్కారాన్ని సాధించాలి. ఈ మధ్య కేరళ, బెంగాల్ మొదలైనచోట్ల ఆహార సమస్యను పురస్కరించుకుని జరిగిన కల్లోలాన్ని గుర్తుకు తెచ్చుకుంటే దీని ప్రాధాన్యం బోధపడుతుంది. ఆహారం పుష్కలంగా లభ్యం కాకపోతే ఇంతకు మించిన ఆందోళన, దావానల విప్లవ స్థాయిలో జరిగే ప్రమాదం వున్నది. చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకుని లాభంలేదు.

ఇప్పటి వరకు అధికారంలో వున్న కాంగ్రెసు ప్రభుత్వాలు వాగ్దానాలు చేసినంతగా, వాటిని ఆచరణలో పెట్టలేక పోయాయి. పదవులపై, స్వీయ లాభాలపై చూపిస్తున్న శ్రద్ధలో నూరోవంతైనా ప్రజల సమస్యలను తీర్చడంపై చూపలేక పోయాయి. తమ వైఫల్యాలకు ఎవరిపైనో కారణాలు నెట్టివేయడమే తప్ప, తప్పు తమలోనె వున్నదని అవి గ్రహించలేక పోతున్నాయి.

ఈ పరిస్థితిని ప్రజలు ఎల్లకాలం సహించలేరు. కాంగ్రెసు వాదులు ఏవేవో వాగ్దానాలుచేసి, పదవులను నిలబెట్టుకోడానికే తప్ప దేశాన్ని అభివృద్ధి చేయడానికి ఉత్సాహం చూపడం లేదని ప్రజలు గ్రహించిన నాడు కాంగ్రెసు కిక భవిష్యత్తు వుండదు. దాని స్థానాన్ని ఆక్రమించ గలిగిన బలీయమైన ప్రతిపక్షం లేని మాట నిజమే. అంటే ఒక విధమైన అరాజకానికి పరిస్థితులు దారితీసే ప్రమాదం వున్నదన్నమాట. దీన్ని గుర్తించి తమపైవున్న గురుతర బాధ్యతను నెరవేర్చడానికి కాంగ్రెసు ప్రభుత్వాలు ప్రయత్నించాలి. 1966 లో అవి తమ వాగ్దానాలను ఎంతవరకు నెరవేర్చుకోగలిగాయి అనే దానిపైనే 1967 లో ఎన్నికల ఫలితాలు ఆధారపడి వుంటాయి.



ప్రధాని ఇందిరాగాంధి వాషింగ్టన్ సందర్శన సందర్భంలో —
శ్రీమతి జాన్సన్, బి. కె. నెహ్రూ, ఇందిరాగాంధి, ప్రెసిడెంట్ జాన్సన్,
శ్రీమతి హంఫ్రీ, వైస్ ప్రెసిడెంట్ హంఫ్రీ.

న్యూయార్క్‌లోని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యాలయంలో శ్రీమతి గాంధి, ఊథాంట్.





లండన్‌లో బ్రిటిష్ ప్రధాని విల్సన్‌ను ప్రధాని శ్రీమతి ఇందిర కలుసుకున్నప్పటి చిత్రం.

* * *

మాస్కో విమానాశ్రయంలో భారత ప్రధానికి స్వాగతమిస్తున్న
రష్యా ప్రధాని కోసిగిన్.



బియ్యం కథ కమామీషు

దేశంలో వరి పండిస్తున్న ముఖ్యమైన రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ఒకటి. కావలసిన దానికన్న ఎక్కువ పండించ గలగడంచేత, కొన్ని తరుగు రాష్ట్రాలకు ఆంధ్రప్రదేశ్ బియ్యాన్ని ఎగుమతి కూడా చేస్తున్నది.

మిగులు రాష్ట్రమైనప్పటికి మన రాష్ట్రంలో వరిసాగు క్రిందవున్న భూమితో పోల్చిచూస్తే పండే పంట చాలా తక్కువ. పంట బాగా పండిన 1964-65 సంవత్సరంలో కూడా 85 లక్షల 50 వేల ఎకరాల భూమిలో వరి వేయగా 48 లక్షల 14 వేల టన్నులు మాత్రమే బియ్యం ఉత్పత్తి అయింది. అంటే సరాసరి పంట ఎకరానికి అరటన్నుకంటే కొంచెమే ఎక్కువ.

• • •

ఇండియాలోనేకాదు, ఆసియా దేశాలన్నిటిలోను - ఒక్క జపానులో తప్పిస్తే - వరి ఎకరాలబడి చాలా తక్కువ. ఉదాహరణకు లావోస్‌లో వరిసాగు క్రిందవున్న భూమి ఆస్ట్రేలియాలో కంటే 30 రెట్లు ఎక్కువ. అయినా, పంట మాత్రం నాలుగు రెట్లే ఎక్కువ.

దీనికి ముఖ్య కారణం - వరిసాగు పద్ధతులలో పురాతన ఆచారాల ప్రభావం. కొన్ని శతాబ్దాల క్రిందట ఏ పరికరాలతో, ఏ పద్ధతులలో సాగు జరిగేదో, ఈనాటికీ అవే మాదిరి పరికరాలు, పద్ధతులు వున్నాయి. శాస్త్రీయ విజ్ఞాన పురోగతి ప్రభావం ఆసియాలో వరిసాగు మీద ఇంకా ప్రసరించలేదు. ఇది ఇప్పుడిప్పుడే ప్రారంభమవుతున్నది.

• • •

ఈ శతాబ్దం ఆఖరయ్యే సరికి ప్రపంచ జనాభా 600 కోట్లు కావచ్చు. వీరిలో హెచ్చు మంది బియ్యాన్ని వాడేవారే అయివుంటారు. అంటే జనాభా పెరుగుదల ఎక్కువగా ఆసియా దేశాలలోనే జరుగుతుందన్నమాట.

ఆసియా దేశాలలో నూటికి 90 మంది వరి అన్నం తినేవారు. నూటికి 80 మంది వరిసాగు చేసేవారు.

ఆసియా దేశాలు వరిపంట మీద ఇంతగా ఆధారపడి వున్నా, దాని అభివృద్ధిపట్ల అవి చూపిస్తున్న శ్రద్ధ దాదాపు మృగ్యం. దున్నడం, నాట్లు, ఊడ్పులు, కలుపు తీత, ఎరువులు, కోతలు, నూర్పిడి అన్నీ శతాబ్దాల నాటి పద్ధతుల్లో జరుగుతున్నాయి.

బియ్యం ప్రధానాహారం కాని ఆస్ట్రేలియా, స్పెయిన్, ఇటలీ, అమెరికావంటి దేశాలలో వరి సాగు శాస్త్రీయమైన పద్ధతులలో జరుగుతున్నది; మూడు నాలుగింతల దిగుబడి లభిస్తున్నది. బియ్యం ప్రధానాహారమైన ఇండియా, లావోస్, థాయ్‌లాండ్, ఫిలిప్పీన్స్, కంబోడియాలలో ఎకరాలబడి చాలా తక్కువ.

• • •

వరిలో పదివేల రకాలకు పైగా వున్నాయట. రంగు, పరిమాణం, ఆకారం, స్వభావం మొదలైన వాటిలో తేడాలవల్ల ఈ రకాలు ఏర్పడుతున్నాయి. నల్ల బియ్యం కూడా కొన్నిచోట్ల పండుతుందట. 73 దేశాలనుంచి తెప్పించిన పదివేల రకాల వరి వంగడాలపై ఫిలిప్పీన్స్‌లోని అంతర్జాతీయ పరిశోధన సంస్థ రకరకాల ప్రయోగాలు చేస్తున్నది.

• • •

ప్రపంచం మొత్తంమీద ఏడాదికి 25 కోట్ల టన్నుల బియ్యం వాడకం జరుగుతున్నది. ఇందులో 92 వంతులు ఆసియాలోనే ఉపయోగపడుతున్నది. ఆసియా దేశాలలో వరి సాగుక్రింద భూమి 25 కోట్ల ఎకరాలు.

• • •

బియ్యం అత్యుత్తమ ఆహారం కాదని శాస్త్రజ్ఞులు చెబుతారు. బియ్యంలో నూటికి 8 వంతులే మాంసకృత్తులు; 90 వంతులు పిండి పదార్థం; మిగతాది చెత్తా చెదారం. అందుకే ప్రపంచంలో 'బెరి బెరి' అనే వ్యాధి ఎక్కువగా వున్నది బియ్యం వాడే దేశాలలోనే.

బియ్యం పై పొట్టులో పోషక పదార్థాలున్నాయి. కాని తెల్లగా, బాగా పాలిష్ చేసిన బియ్యాన్నే ఎక్కువమంది ఉపయోగిస్తారు.

బియ్యం ఉత్తమ పోషకాహారం కాకపోయినా, అది ఇంతగా వ్యాపించడానికి కారణం — వరి ఎక్కడపడితే అక్కడ పండుతుంది; ఏ మాత్రం శ్రద్ధ తీసుకోనకపోయినా గోధుమకంటె ఎక్కువ పండుతుంది.

• • •

వరిపంట మొదటుగా ఇండోచైనాలో కనిపెట్టబడినట్టు, అయిదు వేల సంవత్సరాలకు ముందే అక్కడ వరిసాగు వున్నట్టు కొందరు పరిశోధకుల అభిప్రాయం. క్రీస్తుకు పూర్వం మూడు వేల సంవత్సరాల నాటికి చైనా వారికి కూడా వరి గురించి తెలుసు

నటు. ఇండియాలో క్రీస్తుకు పూర్వం వెయ్యి సంవత్సరాల నాటికే ఎన్నో వరి వంగడాలు సాగు చేయబడుతున్నాయి.

క్రీస్తుపూర్వం మొదటి శతాబ్దం నాటికి జపానునుంచి పర్షియా వరకు వరిసాగు ప్రచారంలోకి వచ్చింది.

వరిని బహుశా అరబ్బులు ఈజిప్టులో ప్రవేశ పెట్టినట్లు, అక్కడి నంచి ఆఫ్రికన్ దేశాలలోనికి అది ప్రాకినట్టు చరిత్రకారుల అభిప్రాయం. అరబ్బుల నుంచే స్పెయినుకు, అక్కడ నుంచి యూరపియన్ దేశాలకు, దక్షిణ అమెరికాకు కూడా వ్యాపించింది. ఉత్తర అమెరికాలో 17వ శతాబ్దం ఆఖరుకు గాని వరిసాగు ప్రవేశించలేదు.

□□□

For well-qualified and prompt insurance advice *and* service you will be on good terms with

The Vulcan Insurance Co., Ltd.

General Manager: V. C. SETALVAD
Underwriter: K. C. DESAI

Authorised Capital	...	Rs. 1,50,00,000
Subscribed Capital	...	Rs. 83,32,350
Called up Capital	...	Rs. 16,63,470
Total Assets	...	Rs. 1,16,23,289

Regd. Office:
73 Veeranariman Road,
Opp: Churchgate Station,
Fort, BOMBAY

Branch Office:
23/136 A, Eluru Road,
VIJAYAWADA-2.

C. VENKATARATNAM, B. A.
BRANCH MANAGER

ఆధునికం

"నన్ను చూడటానికి ఎవరైనా వస్తే వళ్ళు రాలగొడ్తాను" రుసరుసలాడ్తూ లోపలకు వచ్చింది - శారద.

హాల్లో కూర్చుని పేపరుచూస్తున్న ప్రభాకర్ తలెత్తి, పేపరు మడుస్తూ, "నిన్నిప్పుడు చూడటానికి ఎవరు వస్తున్నారమ్మా, శారదా!" విస్మయంగా అడిగాడు.

"ఏం జరిగిం దేమిటి?" నవ్వుతూ వచ్చిన లలిత అడిగింది, శారదను.

ప్రభాకర్ ప్రశ్నార్థకంగా చూశాడు భార్యకేసి. "ఏమయిందసలు?"

"జయను చూసుకోటానికి వచ్చారట. అక్కడకు వెళ్ళింది."

"ఓహో! అదా సంగతి!" అంటూ నవ్వేశాడు ప్రభాకర్.

"ఊఁ! మీకు నవ్వులాటగానే ఉంటుంది! సంతలో పశువును పరీక్షించినట్లు! ఎంత వరకు చదివావు? ఈ పుస్తకం చదువు. వంట వచ్చా? లేచి నడిచి చూపించు? పాటలు వచ్చునా? ఇంకా ... ఇంకా... ఛీ... ఛీ! బుద్ధుండదు. అంత చదువులు చదివినా, ఎదుటి మనస్సు బాధ పడ్తుందేమోనన్న జ్ఞానం ఉండదు! ఆ మహానుభావుడు నల్లగా ఉన్నా, అంద వికారంగా ఉన్నా, రాబోయే పెళ్ళాం మాత్రం అపర రంభలా ఉండాలి!..."

"ఇంతకూ నిన్ను చూడటానికి ఎవరూ రాలేదు కదా? ఎందుకీ కోపం?"

"అసలు నేను పెళ్ళే చేసుకోను."

మృదువుగా నవ్వి చెల్లెలువైపు ఆప్యాయంగా చూశాడు ప్రభాకర్.

• • •

మర్నాడు వీధి గుమ్మంలో ముగ్గు పెడుతోంది శారద.

ప్రథమ బహుమతి రూ. 50

డి. ఎస్. వి. సత్యనారాయణ మూర్తి
ఆంధ్ర వెటరినరీ కాలేజి,
తిరుపతి



'ప్రభాకర్ ఇల్లు ఇదేనాండి?'

శారద గిర్రున తిరిగి చూసింది. చేతిలో లెదరు కేసుతో సత్యనాథ్ నిల్చున్నాడు.

'రండి. లోపల ఉన్నాడు.' సోఫాలో కూర్చోబెట్టి లోపలకు వెళ్ళి ప్రభాకర్‌ను పిల్చింది.

'ఎవరు? శారదా?' అంటూ వచ్చిన ప్రభాకర్, సత్యనాథ్‌ను చూసి—'నీవట్రా? ఎవరో అనుకున్నాను' కౌగలించుకున్నంత పని చేశాడు.

'కాఫీ అన్నయ్యా!' ట్రే, టీపాయ్‌మీద వుంచి, అంది శారద.

'మా సిస్టర్ శారద. పి. యు. సి.' అని 'శారదా! వెటరినరి డాక్టర్ సత్యనాథ్ అని చెప్పేవాడిని కదూ? వీడే.'

నమస్కారాలయ్యాక, 'ముక్కుమీద కోపం ఉంటుందనే వాడివి ఈ శారదగారికేనా?' నవ్వుతూ అడిగాడు సత్యనాథ్.

'అవును' శారదను చూస్తూ నవ్వాడు.

శారద కోపంగా చూసింది. 'వదినను పిలు శారదా!' మాటలోనే వచ్చింది లలిత.

'నమస్తే సత్యనాథ్‌గారూ!'

'నమస్తే!'

'ఉత్తరం వ్రాస్తే, స్టేషన్‌కు వచ్చేవాడిని కదా?'

'ముందు అనుకోలేదసలు. ఇక్కడ స్టేషన్లో ట్రెయిన్ ఆగిన తర్వాత నువ్వు గుర్తువచ్చి, చూసి వెళ్దామని దిగాను. సాయంకాలం బండికి వెళ్తాను.'

'నో, నో, రేపు ఆదివారం. సరదాగా ఉంటుంది. మరో రెండు రోజులుండి వెళ్ళవచ్చు.'

'సెలవు లేదురా!' ఆదివారం ఉండి సోమవారం వెళ్ళేలా ఒప్పుకున్నాడు.

సాయంకాలం కాలేజీ నుండి, శారద వచ్చేటప్పటికి, కాంపౌండులో పూల మొక్కలమధ్య కుర్చీలు వేసుకుని కూర్చున్నారు.

'గుడ్ ఈవినింగ్ శారదాదేవిగారూ!' గుడ్ ఈవినింగ్ అంటూ లోపలకు వెళ్ళి పుస్తకాలు ఉంచి, వచ్చి వాళ్ళ దగ్గర కూర్చుంది.

'శ్రద్ధగా చదవండి శారదగారూ! క్లాసువస్తే మెడిసిన్‌కు వెళ్ళవచ్చు.'

'ఆఁ! ఏదో ఓపిక ఉన్నంతవరకూ చదువుతున్నాలెండి' అంది నవ్వుతూ.

'పట్టుదలతో చదివితే, రాక ఏమి చేస్తుంది.'

'థాంక్స్.'

'శారదా! నీళ్ళు పొయ్యలేదని, మా 'శకుంతల ఎక్కడకు వెళ్ళింది?' అని గోల పెడుతున్నాయి. వెళ్ళి పలకరించు పూలమొక్కల్ని' నవ్వుతూ అంది లలిత.

'ఏమిటి ఇవన్నీ ~~లలిత~~ శారదగారు పెంచినవే?!'

'అవును.'

'అంతేకాదు. మా శారద వీణ వాయిస్తుంది. నిజంగా ఆ శారదే ప్రత్యక్షమైనట్లుంటుంది.' ప్రభాకర్ అన్నాడు. శారద మాట్లాడలేదు. 'నిజం?' అని అడిగాడు. 'కరక్ట్' అంది లలిత. వదినవేపు కోపంగా చూసింది. 'ఒక్కసారి మా వీనుల విందు చేయగలరా, శారదగారూ?' తలెత్తి సత్యనాథ్‌ను చూసి, లోపలకువెళ్ళి వీణ తెచ్చి రెండు పాటలు పాడింది.

'ప్రభాకర్ అన్నదాంట్లో అతిశయోక్తి లేదు' అని మెచ్చుకున్నాడు సత్యనాథ్.

'థాంక్స్' అంది తల దించుకుని.

భోజనం చేస్తూ, 'వంట ఎవరు చేశారండి?' అని అడిగాడు సత్యనాథ్.

'ఏం బుద్ధి పుట్టిందో వంట తనే చేసింది వాళ' లలిత నవ్వుతూ అంది.

శారద ఆతృతగా చూసింది. 'నమ్మలేక పోతున్నాను' అన్నాడు సత్యనాథ్.

'హోటల్‌నుండి తెప్పించావనుకోండిపోనీ' చిన్నగా నవ్వుతూ అంది శారద.

'శారదాదేవికి చేతకానిపనంటూ లేదనుకుంటానురా ప్రభాకర్!'

'మగ పురుగులంటే పడదు.'

'ఓ! ఐ. సీ.'

• • •

ట్రెయిన్ కదిలింది. 'ప్రభాకర్! లలితగారూ! శారదాదేవీ!' చేయి ఊపాడు సత్యనాథ్ వెళ్తున్న ట్రెయిన్‌లోనుండి. ప్లాట్‌ఫారమ్ వదిలింది ట్రెయిన్.

'శారదా! పళ్ళు రాలగొట్టలేదేం?' నవ్వు నాపుకుంటూ, అడిగింది లలిత.

'ఎవర్ని?' పరధ్యానంగా అంది శారద. 'నిన్ను చూడటానికి వస్తే పళ్ళు రాలగొడతానన్నావుకదూ?'

'ఎవరు? ఆయన...సత్యనాథ్...'

'మీ ఆయనే!' నవ్వేసింది లలిత.

'అవునా అన్నయ్యా!' కోపంగా చూసింది ప్రభాకర్‌ను. ప్రభాకర్ చిన్నగా నవ్వాడు.

మీకు నవ్వులాటగానే ఉంటుంది, అని శారద, అనలేదు!

□□□

ఆటోమాటిక్ కెమేరా

మా స్నేహితుడు మూర్తి చాలా సరదా పురుషుడు. క్రొత్త వస్తువు ఏదైనా వస్తే అది మరునాడే తన ఇంటికి రావాలనే కోరిక, పట్టుదలా కలవాడు. సాధించనూ గలడు. ఈ మధ్య ఆటోమాటిక్ కెమేరా, ఒకటి పట్టుకొచ్చాడు. పేరు వినటం తప్ప దాన్ని చూచే భాగ్యం కలుగలేదు. కానీ దాని గొప్పదనం చాలా చోట్ల వినటం మటుకు జరిగింది రష్యాలో రోడ్ల మీద ఏర్పాటు చేయబడిన కెమేరాలు తప్పు దోవలో వెళ్తున్న కారు, లారీల బొమ్మల్ని ఠపీమని పట్టివేస్తుందిట. ఇలాగే దొంగల్నీ—

ఆ రోజు ఆదివారం అవటం చేత దాన్ని దర్శిద్దామనే ఉద్దేశంతో వాళ్ళింటికి వెళ్ళాను. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. 'ఇంట్లో, ఉన్నాడో! లేడో!' అనుకొంటూ లోపలికి వెళ్ళాను. ఎవరూ కనిపించ లేదు. తలుపులన్నీ తెరచే ఉన్నాయి. చూస్తే అంతా సినిమా సెట్టింగ్ లాగా ఉంది.

'మూర్తీ' అని పిలిచాను.

లోపలనుండి సన్నని గొంతు వినవచ్చింది.

'ఆ కుర్చీలో కూర్చోండి. బాత్ రూములోకి వెళ్లారు. వస్తారు.'

కుర్చీలో కూర్చున్నా.

రూములో నిశ్శబ్దం... నేనూ...

గడియారంలో నిమిషందాటింది.

మనిషి అచూకీ లేదు.

నా ముందు, కొంచెం ప్రక్కగా ఉన్న టీపాయిని చూచాను.

తళ తళ మెరుస్తూ, నా కేసి చూస్తూ ఉంగరం కనిపించింది.

'అరె! మూర్తికి ఎంత కేర్ లెస్ నెస్' అనుకొన్నా. బాత్ రూములోకి వెళ్తూ అక్కడ పెట్టి వెళ్ళాడేమో!

ఉంగరం బాగా మెరుస్తోంది.

నా చేతి ఉంగరం చూచుకొన్నాను. అది అంత బాగా మెరవటం లేదు.

ఆ ఉంగరం నా మనస్సులో బొంగరంలా తిరగటం మొదలు పెట్టింది

ఉంగరంలోని రాయి కాంతి ఎక్కువైపోతున్నట్లనిపించింది.

తీసి ఆ రాయిని చూద్దామనిపించింది. నేను తీస్తూండగా మూర్తి వచ్చి చూస్తే నన్ను దొంగగా భావించుకొంటాడేమో! అయినా అడుగుల చప్పుడు వినిపించటం లేదు.

మెల్లగా నాచేయి ఆ ఉంగరానికి 'షేక్ హేండ్' ఇచ్చింది.

మరుక్షణం ఆ ఉంగరం నా అర చేతిలో, అందంగా ఠీవిగా, నవ్వుతూ, వెలుగుతూ నా వైపు చూస్తూ, నన్ను వెక్కిరిస్తూ నిల్చున్నది.

ఇంతలో అడుగుల చప్పుడు వినవచ్చింది.

అటుకేసి చూచాను. మూర్తి రూములోకి వచ్చాడు.

'మూర్తీ! ఉంగరాన్ని యిలా పారేసి వెళ్ళావు. సొమ్ము అంటే అంత అజాగ్రత్త ఉండరాదు.' అంటూ ఆ ఉంగరాన్ని మూర్తికి యిచ్చాను.

మూర్తి నవ్వుతూ ఉంగరాన్ని వేలికి ధరించాడు.

మూర్తి 'కెమేరా' ని చూపిస్తావా... దాన్ని చూట్టానికేవచ్చా'

'ఓ! బసీ!' అంటూ అక్కడే తెరచిఉన్న ఓ అలమరలోంచి పుస్తకాల మధ్య నుంచి కెమేరా తీసుకొచ్చాడు.

దాన్ని చూచాను.

'ఎలా ఉంది?'

'బాగానే ఉంది. ఇది దానంతట అదే ఫొటో ఎలా తీస్తుంది.'

'ఫొటో తీయాల్సిన వస్తువుకీ, దీనికి మధ్య కొంత సంబంధం ఏర్పర చాలి. అంతే'

ఏమిటో నా కర్థం కాలేదు. ఇదే కాదు నాకు సైన్సులో ఏదీ నమ్మ తగినదిగా కనిపించదు.

ఇంకా కులాసాగా ఏవో కబుర్లు చెప్పుకొన్నాం చాలాసేపు. మూర్తి వద్ద సెలవు తీసుకొని ఇంటికి వచ్చాను.

• • •

రెండురోజులు గడిచాక ఓకవరు వచ్చింది. చించి చూచాను. ఓ తెల్లని కాగితం మీద నల్లనిసిరా పంక్తులు. ఓ ఫొటో!

ఫొటో చూచి ఆశ్చర్య పోయాను.

నా రెండు చేతులూ ఆ ఉంగరాన్ని తీస్తున్నాయి. నా వ్రేలి ఉంగరం... నా గడియారం... అద్దంలో ప్రతిబింబంలా ఫొటోలో బొమ్మ.

ఉత్తరం తీసి చూచాను.

'బ్రదర్!

ఈ ఫొటోలో చేతులు ఎవరివో తెలుసుకొనే ఉంటావు. ఆ చేతులు చేస్తున్నపనీ ఏమిటో గ్రహించే ఉంటావు. రెండు రోజులనుంచీ నా ఉంగరం కనిపించటంలేదు. ఈ ఫొటో నా ఉంగరం ఎవరు తీశారో చూపిస్తూనే ఉంది. కాబట్టి ఓ వారం రోజుల్లోగా నా ఉంగరం కానీ, డబ్బులుకానీ తిరిగి యిచ్చేయి. ఈ ఫొటో చించినా ఫర్వాలేదు. ఇలాంటి కాపీలు నా దగ్గర చాలా ఉన్నాయన్న సంగతి మరచి పోకు. దాంతోపాటు నా ఉంగరం సంగతి. మరి సెలవు.

మూర్తి.'

ఏం చేయాలో తోచక ఆలోచిస్తూ కూర్చున్నా.

□□□

ద్వితీయ బహుమతి రూ. 25

పి. వి. సీతారామ్,
ఎల్. యం. ఇ. రెండవ సంవత్సరం
యం. బి. టి. పాలిటెక్నిక్,
నల్లపాడు (వయా) గుంటూరు-5.

టెర్లిన్ చీర

విసుగ్గా పేనా కిందపెట్టి మెటికలు విరుచుకున్నాడు రాజు. ఓసారి రెండు చేతులూ పైకెత్తి గట్టిగా ఊపిరి పీల్చుకుని విడిచాడు. చుట్టూ చూశాడు. తోటి గుమాస్తా లందరూ యంత్రాల్లా తమ పని తాము చేసుకు పోతున్నారు. మళ్ళీ ఫైళ్ళలోకి తల దూర్చబోతూ, ఆగాడు అప్పుడే ప్రక్కకు చూసిన రాజు. అతని కళ్ళముందు భాస్కర్ వేసుకుని వున్న టెర్లిన్ షర్ట్ మిలమిలా మెరిసింది.

"భాస్కర్ చస్తే బావుణ్ణు" కసిగా అనుకున్నాడు. వాడుచస్తే రాజుకు ఒనగూడేదేమీ లేదని అతనికి

ద్వితీయ బహుమతి రూ. 25

ఎస్. ఐ. సుధాకరరావు

ఫస్ట్ బి. యస్ సి.
యస్. జి. వి. ఆర్ట్స్ కాలేజీ, తిరుపతి.



తెలుసు. కాని వాడు బతికుండి రాజును అసూయానలంలో భగ్గున మండిస్తున్నాడు. అందుకే వాడు చావాలి.

ఎప్పుడూ టెర్లిన్ షర్టులే. సిల్కు ప్యాంటులే. వాటన్నిటికీ డబ్బెక్కడి నుండి వస్తుందో అందరికీ తెలుసు. చాలా బాగా తెలుసు. వెధవ బతుకూ వాడూను. లంచాలు తింటాడు. నిజానికి అందరూ తింటారు. కాని తాను తినలేక పోతున్నాడు. నిజానికి తనదే వెధవ బతుకేమో!

అసలు వాడు అన్నిట్లోనూ అదృష్టవంతుడే. రంభలా వుంటుంది వాడి పెళ్ళాం. ఈర్ష్యగా పళ్ళు కొరుక్కున్నాడు రాజు. వాడిపెళ్ళాం శారద కళ్ళముందు కదిలింది ఎగతాళిగా నవ్వుతూ. నువ్వు చస్తే బావుణ్ను అనుకున్నాడు కసిగా.

వాడి పెళ్ళాంతోబాటు రాజు పెళ్ళాం కూడా కనిపించింది రాజుకు. కమల నవ్వుతూవుంది. పాపం అనిపించింది రాజుకు. కమల కూడా అందమైనదే. కాని ఏం లాభం అలంకరణ లేని అందం రాణించదుగా. తన కొచ్చే నూటిరవైలో తానూ భార్యా తల్లీ తండ్రీ నల్గురు బ్రతకాలి. ఇంకా నయం. తాను కాస్త జాగ్రత్తపడుతున్నాడు, లేకపోతే ఈ నాలుగేళ్ళలో కనీసం ఇద్దరు బిడ్డలయినా వుండేవాళ్ళు. మూలిగే నక్కపై తాటికాయ పడట్టయి వుండేది. మళ్ళీ యిటు చూశాడు రాజు. భాస్కరం బ్లూ టెర్లిన్ షర్టు వెక్కిరించింది. ఈసారి రాజు భాస్కరం పైన కోపగించుకోలేదు. తనపై తానే కోపగించుకున్నాడు. కమలదాదాపుసంవత్సరం నుండీ ఒక్కగానొక్క కోరిక కోరుతోంది టెర్లిన్ చీర కావాలని. ముప్పై రూపాయలట. కడుపు మండిపోయింది రాజుకు. తిట్టుకున్నాడు మెల్లగా.

కాకీ షర్టూ పాంటూ వేసుకున్న, పోస్టుమేన్ వచ్చి, టపా చేతి కిచ్చి వెళ్ళాడు. అప్పుడు వాడి చేతివైపు చూశాడు రాజు. వాడి చేతికి ఫేవర్లూబా వాచీ! ఉడుక్కున్నాడు రాజు.

ఆలోచనల నాపాడు.

కసిగా ఫైలు తెరిచి తన పని తాను చేసుకు పోతున్నాడు.

ఆఫీసర్ బూట్లు టకటక లాడించుకుంటూ హాల్లోకి వొచ్చాడు.

యంత్రాలేవీ తలెత్తలేదు. తమ పని తాము చేసుకు పోతున్నాయి.

"హియర్!" ఆఫీసర్ పిలుపు.

అందరూ లేచి నిల్చి తల లాతని వైపు తిప్పి, చెవులు విప్పారు.

"మన ప్రొప్రయిటర్ గారికి రేస్‌లో రెండు లక్ష లొచ్చింది. ఈ క్షణమే అందరికీ తలా ఒకనెల బోనసివ్వ మన్నారు. కమ్ టు మై రూమ్ వన్ బై వన్."

గంభీరంగా లోపలి కెళ్ళి పోయాడు ఆఫీసర్.

దానకర్ణుడు మన ప్రొప్రయిటర్ అనుకున్నారు.

ఆఫీస్ రూమ్‌లోంచి బయటికి వచ్చిన రాజు ఆలోచనలో పడ్డాడు.

ఏభై రూపాయలు అంగడి కిచ్చెయ్యాలి. ఇంకా... ఇంకా... ఎన్ని మేట్లు వేశారు.

కమలకి టెర్లిన్ చీర కొనాలి. సినిమా కెళ్ళాలి.

వచ్చి సీట్లో కూర్చున్నాడు.

ఆఫీసయి పోయింది.

బజార్న పడ్డాడు.

టెర్లిన్ చీర కొన్నాడు.

నడుస్తున్నాడు ఇంటికి.

ఓ కథ జ్ఞాపకం వొచ్చింది "ఎవరో యిలాగే భార్యకు కానుక కొనుక్కు వెళ్తూ దారిలో లారీ కిందపడి చచ్చాట్ట.

జాగ్రత్తగా నడుస్తున్నాడు.

ఇంకో కథ జ్ఞాపకం వొచ్చింది.

అలాగే యింకోడు భార్యకి బహుమతి తీసుకెళ్తే, ఇంటికెళ్ళేసరికి ఆమె చచ్చిపోయి వుందట.

'మే గాడ్ ఫర్‌బిడిట్' అనుకున్నాడు.

అతని మనసు అశుభమేదో శంకిస్తోంది.

మెల్లగా నడుస్తున్నాడు ప్యాకెట్ భద్రంగా పట్టుకుని.

సాయంత్రం అరయింది. బజారు రద్దీగా వుంది. రద్దీలో అందమైన ఆడపిల్లల్ని మింగేలా చూస్తూ నడిచే రాజు తలవంచుకుని జాగ్రత్తగా నడుస్తున్నాడు.

మెల్లగా ఇల్లు చేరాడు.

నేరుగా షెల్ఫువద్దకువెళ్ళి తెచ్చిన‌ది షెల్ఫ్‌లో పెట్టేశాడు. వొచ్చి చిన్న స్టూలుపై కూర్చున్నాడు.

ఎవరూ తన రాక చూళ్ళేదింకా.

అప్పుడే యింట్లోంచి వచ్చాడు రాజు నాన్న.

"కమలేది నాన్నా!"

"వాళ్ళత్తా, కమలా కలిసి గుడి కెళ్ళారు."

షర్టు వేసుకొని అలా రామయ్యింటి దాకా వెళ్ళొస్తానా' అని వెళ్ళిపోయా డాయన.

నిన్న సగం చదివి ఆపి వుంచిన జాడుగ నవలతీసి చదవసాగాడు రాజు.

• • •

పెద్దాళ్ళిద్దరూ హాల్లో గురక తీస్తున్నారు.

హాలు ప్రక్కనున్న చిన్న గదిలో పరుపుపై వెల్లకిలా పండుకొని కమలకి సంగతి ఏ విధంగా చెప్పి పండరై పోయేలా చెయ్యాలా? అనుకుంటూ ఆలోచిస్తున్నాడు రాజు.

కమల లోనికి వచ్చింది. రాజు ప్రక్క చోటు చేసుకుంది.

"కమలా! నీకో మంచి సంగతి చెప్పనా?"

"ఉండండి! నేనో సంగతి చెబుతా వింటారా?" అంది కమల గోముగా అతని వైపు చూస్తూ.

అయిసై పోయాడు రాజు!

"చెప్పు!" అన్నాడు ఆమెని దగ్గరికి లాక్కుంటూ.

"మరే, వాయిదాల పద్ధతిపై చీరలమ్మే వాడి దగ్గర ఓ టెర్లిన్ చీర కొన్నానండీ, ముప్పై అయిదుట, నెలనెలా అయిదిచ్చి తీర్చెయ్యాలి. మంచిదే కదండీ! మెల్లిగా తీర్చుకుందాం. సరేనా!" గోముగా అంటోంది కమల.

మనసులోనే నెత్తీ నోరూ కొట్టుకున్నాడు రాజు—ఇంకేమీ చెయ్యలేక.

□□□



"శారిక"

"బటానీలు! కాలక్షేపం బటానీలు! రైలు దిగేదాకా టైంపాస్ బటానీలు!"

"ఏంరా! సూరిగా దెక్కిందంట్రా? ఒరే! సూరిగా! ఎక్కరా యెదవా! బండి కదలి పోతంది!"

"ఏమిటయ్యా! కళ్ళు కనబడటంలా! కాళ్ళమీద పెడుతున్నావ్!"

"ఇక్కడ మావా డున్నాడండి. కిందికి దిగేడు మళ్ళీ వస్తాడు."

"సంచీ ఆ పెట్టెమీద పెట్రా! ఎంత సేపట్లా పట్టుకుంటావ్!"

"కొంచెం లోపల కుండండి దొరగోరు!"...కేర్‌మని చంటిపిల్లాడి ఏడుపు. 'ఉష్'మని ఓ వార్పు. చెవులు చిల్లులు పడేటట్లు రాక్షసి కూత! ఝుప్! ఝుప్!...ఝుప్! ఝుప్!

ఈ శబ్దాలాన్నీ చెవుల్లో దూరినా రావుగారి మెదడు చేరలేదు. రైలు బండి చక్రాలు గోదావరి స్టేషను వదలి గోదావరి బ్రిడ్జిమీదకు దొర్లి పోయాయ్.

సమాంతరమైన ఎలక్ట్రిక్ తీగల మధ్యనుంచి పోలికలు లేని వికృతమైన కదలికలతో విజృంభించిన ప్రకృతి శక్తిలా పరవళ్ళు తొక్కుతూ పరిగెడుతూంది గోదావరి. ప్రళయ సంగీతంలా ఘోషిస్తుంది గోదావరి బ్రిడ్జి అడ్డు వచ్చిందనే కోపావేశంలో. సుళ్ళు తిరుగుతూన్న కెరటాల మధ్య గిరగిరా తిరుగుతున్నాయి నురుగులు. ఆశలకూ అనుభవాలకూ మధ్య తిరుగుతున్న దైవోపహతుడి జీవిత గమనంలా నడువలేక నడువలేక నడుస్తూన్న నిండు బాలింతలా పరిగెడుతూంది బ్రిడ్జిమీద రైలు బండి. నాకేం లెక్కలేదన్నట్లు ఒక తీగె మీద నుంచి మరో దానిమీది కెగిరి క్షణకాలంలో నలుసులా దూరమైంది చిన్న పిచ్చుక.

తదేకంగా అటే చూస్తూంటే కళ్ళు తిరుగుతూన్నట్లనిపించి తలెత్తి కళ్ళజోడు తీసి ప్రక్కకు చూసేరు రావుగారు. కంట్లో బొగ్గునలుసు పడింది. ఖంగారులో చేతిలో కళ్ళజోడు గోదావరిలో పడినంత పనీ

అయింది. తల లోపలకు తీసుకున్నారు రావుగారు.

కాలి చీలమండకు గుచ్చుకున్న కావడిబద్ద ఈ ప్రపంచంలోకి తీసుకు వచ్చింది రావుగారిని. సీటు క్రింద కావడిబద్ద తోస్తున్నతను అది గుర్తించినట్లు లేదు. కాలు ప్రక్కకి తీసుకొని తిరిగి తల బయటకు తిప్పేరు రావుగారు.

దూరపు కొండలు నీలిమబ్బుల్లా ఉన్నాయి. రైలు వెనక్కాలే రావడానికన్నట్లు అవి రెండవ వైపుకు తిరుగుతున్నాయి.

'ఏ ఊరమ్మా మీది?' ఒక ముసలి కంఠం.

'కోటిపల్లండి!' ఓక స్త్రీ కంఠం

'ఆఁ! ఎక్కడో చూసినట్లుంటేను!'

'అమలాపురంలో చూసి ఉంటారు.'

'అయితే నువ్వు...'

'వెంకట్రామశాస్త్రి గారమ్మాయినండి.'

'అదీ! అలా చెప్పు! బాగున్నావా? మీ నాన్నగారు కులాసాయేనా?'

'ఆఁ! బాగానే ఉన్నారండి! ప్రకాశం! దా! నావళ్ళో కూర్చో! తాతగారక్కడ కూర్చుంటారు!'


'అక్కర్లేదమ్మా! ఇలా నుంచుంటాన్లే!'

'ఫరవాలేదు! కూర్చోండి!'

ప్రక్క కిటికీలోంచి సంభాషణ విన్న మరో నిముషం దాకా రావుగారి మెదడులోకి పోలేదా మాటలు. ఉన్నట్టుండి ఏదో మెరుపులా మెరసింది ఆయన మెదడులో. మనసంతా ఆశ్చర్యంతో నిండిపోయింది. 'ఆమేనా! అమలాపురం ... వెంకట్రామశాస్త్రిగారి అమ్మాయి... ఆమేనా! సీతా మహాలక్ష్మేనా!' తల ప్రక్కకు తిప్పి ప్రక్క కిటికీవైపు చూసేరు రావుగారు. గోరింటాకు పెట్టుకున్న చేయి కిటికీలోంచి కనబడుతూంది. గులాబీ రంగుతో మెరుస్తూన్న ఆ వేళ్ళలోనే ఎంతో అందం కనబడింది రావుగారికి. ప్రక్కకు తిరిగిన ఆ చేతి ఉంగరంలో నీలిరాయి కాంతివంతంగా మెరుస్తూంది. ఆమె ఇప్పుడెలా ఉందోనని ఆపుకోలేని ఆతృత చుట్టుముట్టింది రావుగారిని. ఒకసారి వెళ్ళి చూద్దామా అనే ఆలోచనతో వెనక్కు తిరిగేరు. పెట్టె జనంతో నిండిపోయి కదలడానికి వీల్లేకుండా ఉంది. చేసేది లేక తిరిగి ఆ చేతివైపు చూస్తూ అలాగే కూర్చుండి పోయారు.

'ఎందాకా ప్రయాణం!'

'హైదరాబాదండి!' మళ్ళీ అదే కంఠం.



'హైదరాబాదా? అక్కడెవరున్నారు?'

'మా పెద్దబ్బాయి అక్కడ ఇంజనీరుగా పని చేస్తున్నాడు! మా వారు కూడా అక్కడే ఉన్నారు! ఒకసారి రమ్మని ఉత్తరం వ్రాస్తే చూసొద్దామని వెడుతున్నాను.'

'మీ ఆయన కాకినాడలో ఏదో కంపెనీలో పని చేస్తున్నాడని విన్నాను. ఇప్పుడు...'

'అక్కడే పని చేస్తున్నారండి. ఏదో పనుంటే వారం రోజులక్రితం శలవుపెట్టి హైదరాబాదు వెళ్లారు.'

పిల్లలెందరు? వీడు మీ వాడేనా!'

'వీడు మా రెండోవాడు. వీళ్ళిద్దరికీ మధ్య ఓ అమ్మాయి ఉంది. అమలాపురంలోనే ఉంది. చదువు చెడుతుందని దాన్ని ఉంచేసేను.'

'చదువుతూందా? ఏం చదువుతూంది?...'

'స్కూలు ఫైనలు!'

మా పెద్దమ్మాయి ఏలూరులో ఉంది. పది రోజుల్నుంచి ఒకటే జ్వరముట. ఓసారి చూసొద్దామని వెళుతున్నాను.'

తరువాత రావుగారికేమీ వినబడలేదు. ఆమెను చూడాలనే ఆత్రుతతో ఆయన కూర్చోలేక పోతున్నారు. ఆ అందమైన చెయి ఆమెదేనా! ఆమె సీతామహలక్ష్మేనా! పాతికేళ్ళ తరువాత ఇప్పుడెలా ఉంది? ఎలా ఉంది?...

• • •

నీలిరంగు పరికిణీ, నీలిరంగు వోణీలో గులాబి రంగు జాకెట్టు తొడుక్కొని, తల్లి పొదివిపట్టి తీసుకొని వస్తూంటె సిగ్గుతో గోముగా నడుస్తూ వచ్చి నేలమాపులు చూస్తూ కూర్చుంది సీతామహలక్ష్మి. తాటాకు చాప గోరింటాకు వేళ్ళతో సన్నగా చీరుతోంటే 'నీ పేరేమిటమ్మా!' అన్నారు రాఘవయ్యగారు. 'సీతామహాలక్ష్మి!' అని ఓర కంటితో ఒకసారి ఆయన్ను చూసి తలదించేసింది.

అందరూ అందంగా ఉంటుందని చెప్పినా అంత అందంగా ఉంటుందని ఊహించలేనందుకు మనసుచిన్నబోతూంటే కంగ్రాచ్యులేట్ చేశాడు రామమోహనరావు తన మనస్సును. వికసిస్తూన్న గులాబి మొగ్గలా ఉన్న సీతామహాలక్ష్మి ఆ తాటాకు చాపలో కూర్చుంటూనే అతని హృదయ పీఠాన్నాక్రమించింది. ఆమె ముఖంలో సిగ్గు దొంతరలు దొర్లిపోతూంటే, సన్నగా కాటుక దిద్దిన కనురెప్పలు మిలమిల లాడుతూంటే. నలుగురూ విసిరే మాటలకు చిరునవ్వుతో సాగిపోతూన్న ఎర్రని పెదవులను మునిపంట్లతో నొక్కి పడుతూంటే, రామమోహనరావు మనస్సు ఆనందంతో మైమరచి పోయింది. పెద్దల పరీక్షలైన తరువాత ఆమె తిరిగి లేచి వెడుతూంటే, మెరపు తీగెలా కదులుతూన్న ఆమె సన్నని నడుము, పొడవైన జడగంటలు నాట్యం చేస్తూన్న పిరుదులు, మీ ఆయన్ని చూసేవా అని ఎవరో అంటే సిగ్గుతో కూడినకోపంతో పెట్టినబుంగమూతి ... ఆమె మచ్చలేని ఒక సౌందర్య రాసిలా, పసిడి బొమ్మలా కన్పించింది రామమోహనరావు కళ్ళకు. తండ్రి భుజంమీద చేయివేసే వరకూ రామమోహనరావు ఈ లోకంలోకి రాలేదు,

ఎంతో బలవంతంమీద పెళ్ళి చూపులకు వెళ్ళేడు రామమోహనరావు. ఒకవేళ తాను మొండిగా 'నేను రాననేస్తే!' ఏమై పోయేది. అమ్మో! సీతామహలక్ష్మి తనకు కాకుండా పోయేదా! ఆ ఆలోచనే భరించ రానిదిగా అనిపించిందతనికి.

రాత్రి తొందరగా భోజనంచేసి మడతమంచం వీధిలో వేసి పడుకున్నాడు రామమోహనరావు.

త్రయోదశి చంద్రుడు చెట్లమీదుగా పైకి లేచేడు. మేలి ముసుగుల్లా తెల్ల మబ్బులు చంద్రుడిమీదుగా పోతున్నాయి, గోదావరి మీదనుంచి వస్తున్న చల్లని గాలి వంటికి గంధం పూస్తున్నట్లుగా ఉంది. నిశ్శబ్దమైన రాత్రి ప్రకృతి కన్య ప్రశాంతమైన సుషుప్తిలా ఉంది.

రామమోహనరావు సీతతో తన భావి జీవితాన్ని ఊహించుకోసాగేడు. ఉదయం నుంచి సాయంత్రం దాకా తాను చేసే అన్ని నిత్యకృత్యాల్లోనూ ఆమెనూహించుకున్నాడు. సీత తనకు ఎన్నాళ్ళనుంచో తెలుసునేమోనని పించింది. 'ఆమె తోడు లేకుండగా ఇన్నాళ్ళు తన జీవితం ఎలా నడిచింది! ఇకపైన తన చిత్రకళకు ఆమె రూపం, ఆమె భంగిమలు అసాధారణ సుందర చిత్రాలు. ఆమె జీవిత కాలం తన సొత్తు. ఆమె చిరునవ్వులు, బెదురుచూపులు తన ఆరాధ్య దైవాలు. ఇన్నెందుకు? ఆమె భార్య. తను భర్త. వెన్నెల రాత్రులు. ఏకమయ్యే మనసులు. వెచ్చని కౌగిలులు. పెనుకునే మమతలు. విసలేని కలయికలు. ఎంత హాయి! ఎంత మధురం! దేవుడా నే నెంత అదృష్టవంతుణ్ణి!' తీయని ఆలోచనలతో ఇటూ అటూ దొర్లుతూంటేనే అతనికి తెలియకుండానే కను రెప్పలు మూసుకొన్నాయి.

రామమోహనరావు కళ్ళు విప్పి చూసేడు. కటికచీకటిలా కనబడింది. చంద్రుణ్ణి నల్ల మబ్బులు కప్పివేశాయి.

• • •

దాని తరువాత రావుగారికి ఆలోచించుకోడానికి కూడా భయమనిపించింది. ఆ రోజు తాను అర్ధ రాత్రి కండ్లుతెరవకపోతే! తెరవకపోతే ఏమిటి? తెరిచేడు జరగాల్సిందేదో జరిగిపోయింది. తన అనుభవాలు కాలగమనంలో శిలాక్షరాలుగా చెక్కబడి పోయాయి. భూతకాలంలోకి చొచ్చుకొని పోయే శక్తి మానవుడికి లేదు. భవిష్యత్తును ఒక్కక్షణం కూడా ఆపగల శక్తి కూడా లేదు. కాల చక్రాన్ని నిలపగల వాడెవ్వడు? అయినా తనభవిష్యత్తు ఎలాగడిస్తేమాత్రమేం! ఎలా గడిచినా ఫరవాలేదు

ఏదో స్టేషను వచ్చింది. బండి ఆగింది. కొంతమంది జనం దిగేరు. రావుగారు వెంటనే లేచి వచ్చి ప్రక్క వరుసలో ఉన్న ఆమెను

చూసేరు. ఆ చేయి ఆమెదే! ఎంత మార్పు! ఆమె సీతా మహాలక్ష్మి! సందేహంలేదు! సందేహంలేదు!... ఆమె ఎదురు సీటులో కూర్చున్నాయన పై నించి సామానులు దింపుకుంటున్నాడు. మళ్ళీ ఎవరైనా కూర్చుంటారేమో! రావుగారు మరుక్షణంలో తన సీటు దగ్గరకు వెళ్ళి సంచి తీసుకొని వెళ్ళి ఆమెకు ఎదురుగా ఉన్న సీటులో కూర్చున్నారు.



బండి కదిలింది. రావుగారు రెప్ప వాల్చకుండా ఆమెవైపే చూస్తున్నారు.

ఆమె కిటికీకి మోచేయి ఆన్చుకొని దూరంగా బయటకు చూస్తూంది. నీడలు దాటినప్పుడు ఆమె ముఖంమీద పడుతూన్న ఎర్రని నీరెండలు ఆమె బుగ్గలపై వింత రంగులు సృష్టిస్తున్నాయి. వయసు మీరినదైనా ఆమె ముఖంలో అంత వయసు కనబడటం లేదు. ఏదో లావణ్యం కొట్టవచ్చినట్లు కనబడుతూంది. ఏదో గుర్తుకు వచ్చిందేమో ఒక్కసారి ఆమె పెదవులపై చిన్న చిరునవ్వు వెలిగింది. సూర్యుడి పసిడి కిరణాలకు రెపరెప లాడుతూన్న కాటుక కళ్ళు నీటి అలల తాకిడికి పులకరిస్తూన్న విడుస్తూన్న నల్ల కలువల్లా ఉన్నాయి. గుండ్రంగా తీర్చిదిద్దిన ఆమె నుదుటి కుంకుమపై వినురు గాలికి చిరు వెంట్రుకలు నాట్యం చేస్తున్నాయి.

అప్రయత్నంగా రావుగారి దృష్టి క్రిందికి పోయింది. ఉన్నతమైన ఆమె హృదయానికి బిగువుగా చుట్టుకున్న ఆకుపచ్చ చీరె జరీ అంచులోంచి మాంగల్యం తొంగి చూస్తూంది—"పెద్ద మనిషీ! తల పక్కకు తిప్పవోయ్!" అంటూన్నట్లుగా.

"అతడెంత అదృష్ట వంతుడు ?" అనుకున్నారు రావుగారు ఆమె భర్త ఉనికి మనసులో మెదిలి.

"అమ్మా! నేలచూడవే ఎంత తొందరగా కదిలిపోతూందో!" అన్నాడు ఆమె ఒడిలోనుంచి నిల్చొని పిల్లవాడు క్రింది నేలను చూస్తూ.

"అలా చూడకు! కళ్ళు తిరుగుతాయి" అని ఆమె అతన్ని ఒడిలో కూర్చోపెట్టుకొంది.

ప్రతిమ కదిలింది. మాటాడింది. అందులో సౌందర్య తరంగాలు దొర్లిపోయాయి. రావుగారు తదేక దృష్టితో తనవైపు చూస్తూన్నట్లు గమనించి ఆమె పూర్తిగా పైటకప్పుకొని కొడుకు తల నిమురసాగింది. ఆమె పైట సర్దుకోవడం చూసి రావుగారు తడబడి సంచిలోంచి పేపరు తీసి పేపరులో తల దూర్చేరు. మరో నిముషానికిగాని ఆయన గమనించలేదు తన చేతిలో పేపరు తలక్రిందులుగా ఉన్నట్లు. ఎవరైనా చూస్తున్నారేమోనని ఇటూ అటూ చూసి పేపరు సరిగా తిప్పుకున్నారు రావుగారు.

ఇంత సౌందర్యరాసి తనకెందుకు దూరమయింది. ఎంత వద్దనుకున్నా ఆ గుర్తు తెచ్చుకోవద్దనుకున్న రాత్రి ... ఆ కారుమబ్బులు కమ్మిన రాత్రి... తన జీవితాన్నే పూర్తిగా చీకటిలో పూడ్చివేసిన రాత్రి ... కళ్ళముందు నిలుస్తూంది.

● ● ●

కటిక చీకటి. గోదావరిమీద నుంచి చల్లగా ఈదురు గాలి వీస్తూంది దూరంగా గోదావరిలో పడవవాళ్ళ కేకలు వినబడుతున్నాయి. ఏటిగట్టుమీద లాంతరు స్తంభంలో దీపం గిలగిల లాడుతూంది. అలాగే రోడ్డుమీద నీడలు కూడా మిలమిలా కొట్టుకుంటున్నాయి

ఉన్నట్లుండి లాంతరు స్తంభం క్రిందికి, ఒక నల్లటి ఆకారం వచ్చి క్షణకాలం ఉండి మాయమైంది. రామమోహనరావు కళ్లు నులుపుకు చూసేడు. ఆ ఆకారం తిరిగి కనబడ లేదు. కలా! భ్రమా! అక్కడి నాపరాతి మెట్లమీదకు ఎవరో వచ్చి దిగి ఉంటారు. ఎవరైయుంటారు ? ఎందుకు ? ఎందుకో అతని మనసులో ఏదో కుతూహలం తలెత్తింది.

వెంటనే లేచి పది అడుగుల్లో లాంతరు స్తంభం చేరుకున్నాడు. నిజమే! కలా కాదు. భ్రమా కాదు. ఎవరో మెట్లమీదనుంచి క్రిందికి దిగుతున్నారు. ఎందుకు ఇంత అర్ధరాత్రివేళ ? ఎవరు ?

పోటీదార్లకు మనవి

"జ్యోతి" మాసపత్రిక కళాశాలల, విశ్వవిద్యాలయాల విద్యార్థినీ, విద్యార్థుల నిమిత్తం "చిన్న చిన్న కథల పోటీ" నిర్వహిస్తున్నది. దీనిలో పాల్గొనేవారు ఈ క్రింది నిబంధనలు పాటించ గోరుతున్నాము.

1. కథలు "జ్యోతి"లో రెండు మూడు పేజీలకు మించరాదు.

2. స్వకపోల కల్పితమైన స్వతంత్ర రచనలే పంపించాలి.

3. తమ పూర్తిపేరు, చదువుతున్న తరగతి, కాలేజీ, లేక విశ్వవిద్యాలయం పేరుతో సహా పూర్తి చిరునామా జత పరచాలి.

4. ప్రతినెల 1వ తేదీ వరకు అందిన రచనలనే ఆ పైనెల సంచికలో పోటీకి పరిగణిస్తాము.

5. బహుమతి పొందిన రచనలు త్రిప్పి పంపబడవు. అందుచేత స్టాంపులు పంపించ నవసరంలేదు. రచనల విషయమై ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపబడవు.

6. కవరు మీద "జ్యోతి, చిన్న చిన్న కథల పోటీకి" అని స్పష్టంగా వ్రాయాలి.

7. రచనలను పంపవలసిన చిరునామా "ఎడిటర్," జ్యోతి, సచిత్ర మాసపత్రిక, విజయవాడ-2".

8. రూ. 50 లు ప్రథమ బహుమతి, రూ. 25 లు చొప్పున రెండు ద్వితీయ బహుమతులు.

ఆత్మహత్యకు కాదుగదా ? అతని గుండె ఝల్లుమంది. అతను కూడా త్వరత్వరగా మెట్లు దిగేడు. అతనింకా పదిమెట్లు పై నుండగానే ఆ ఆకారం ఆఖరి మెట్టుమీద నిలచింది.

'ఆగు!' ఒక్క కేకపెట్టి అతను గబగబా మెట్లు దిగిపోయాడు.

అనుకోని శబ్దం వినడం మూలాన్నేమో ఆ ఆకారం క్షణకాలం నిలిచి పోయింది. వెన్వెంటనే గోదావరిలోకి దూకబోయింది. రామమోహనరావు బలంగా చెయ్యి పట్టుకున్నాడు. టపటపా గాజులు పగిలేయి. ఆ యువతి గింజుకో సాగింది. అతను ఆమెను బలవంతంగా రెండుమెట్లు పైకి తీసుకొని వచ్చేడు. చీకట్లో ఆమె ముఖం స్పష్టంగా కనబడటంలేదు. ఆమె భోరుమంది.

'నన్ను వదలండి! నేను బ్రతకలేను! నన్ను చచ్చిపోనీయ్యండి. మీకు పుణ్యం ఉంటుంది!' ఆమె ఆర్తనాదం అతని హృదయాన్ని కలచి వేసింది. ఏదో పరిచితమైన కంఠంలా ఉంది.

'వదలను! మీరు పైకి రండి! మీతో మాట్లాడాలి!' అన్నాడతను.

ఆమె విపరీతంగా విలపించ సాగింది.

'చూడండి! ఎవరైనా వింటే ఇంకా అభాసవుతుంది. పైకి రండి. నేను చేతనైన సాయం చేస్తాను.' పైకి తీసుకొని వెళ్ళడానికి ప్రయత్నిస్తూ అన్నాడతను.

'నా కెవ్వరూ ఏమీ చెయ్యలేరు' ఎగువుల మధ్య నిస్పృహగా వచ్చేయి ఆమె నోట్లోంచి మాటలు.

పై మెట్లదాకా వచ్చి అక్కడ కూలబడి పోయిందామె. అతనామె ముఖానికి అడ్డుగా పెట్టుకుంటూన్న గుడ్డను ప్రక్కకు తీశాడు.

'అనసూయా! నువ్వా! ఏమిటిది ?' నివ్వెరపోయే డతను. ఆమె కన్నీరు ఏకధారగా కారుతూంది. రెండు చేతుల్లో ముఖం దాచుకుంది. ఆమె నోదార్చడం అతని సాధ్యం కాలేదు.

ఎన్ని విధాలుగా అడిగినా అతడామె ఆత్మహత్యా ప్రయత్నాని కారణం తెలుసుకోలేక పోయాడు. చివరకు అతడే సాహసించి ప్రశ్నించగా అవునన్నట్లుగా తలూపింది. దానికి కారణమైన వ్యక్తి పేరు వినగానే అతని కేదో ఆశాకిరణం పొడసూపింది. 'మధుసూదనం నాకు తెలుసనసూయా! ఈ విషయం అతనికి తెలిసి ఉండదు. నేను రేపు పోయి అతనితో మాట్లాడుతాను. మీ పెళ్ళికి అతను ఒప్పుకుంటాడనే నమ్మకం నాకుంది. ఈ భారం నా మీద వదిలెయ్ అనసూయా! మళ్ళీ నువ్వీ ప్రయత్నం చెయ్యకు.'

ఆ క్షణంలో అతడామెకు అందరికంటే ఆప్తుడుగా కనబడ్డాడు. అవధులు దాటిన కృతజ్ఞతతో ఆమె అతని పాదాలు తాకింది.

మధుసూదనం రామమోహనరావు క్లాసుమేటు రాజమండ్రిలో బి. ఏ. చదవేటప్పుడు. రామమోహనరావు మద్రాసులో తరువాత రెండేళ్ళు చదివి ఎం. ఏ. చేశాడు అప్పటికి మధుసూదనంకూడా అనసూయా వాళ్ళింట్లో అద్దెకు వుండి, బి.ఏ. కంపార్టుమెంటల్‌గా కంప్లీట్ చేశాడు.

మర్నాడు ఉదయం రామమోహనరావు మధుసూదనం వాళ్ళ ఊరికి వెళ్ళాడు. అనసూయ గర్భవతి అయిందన్న వార్త వినగానే భయపడి మార్గమేమిటని అడుగుతాడన్న ధైర్యంచెప్పి ఈ పెళ్ళి తప్పక జంగేలా చేయాలని అనుకున్నాడు రామమోహనరావు.

కాని మధుసూదనం అలా మాట్లాడుతాడని ఊహించ లేదు. ఎంతో ఉన్నత భావాలు ప్రదర్శించిన మధు ఈ రెండేళ్ళలో అలా మారుతాడని అతడు ఊహించలేక పోయాడు. అతడసలు తాను చేసిన తప్పే ఒప్పుకోలేదు. కనీసం అతని మాటలన్నీ వినగలిగేడు. కాని 'ఆమె

విషయంలో నీకింత ఆసక్తి ఏమిటి? ఆమె గర్భవతి అయితే నీకు అందోళన ఎందుకు? ఆమెకు నువ్వేమవుతావు? ఆమెకూ నీకూ సంబంధం ఏమిటి? దీనికి కారణం నువ్వే కావచ్చు! నీవు చేసిన నేరాన్ని, నా ఖర్మకాలి వాళ్ళయింట్లో రూమ్ తీసుకున్నాను కదా అని నా మీద అంటకట్టడానికి ప్రయత్నిస్తున్నావు!" అని మధు తననే అంటూంటే సహించలేక పోయాడు. మధుసూదనం అంతనీచుడని ఊహించలేక పోయేడు. అతని నోటిని అతనే నిగ్రహించుకో లేకపోయేడు. అతనేమన్నాడో అతనికే తెలీలేదు. ఫలితంగా రామమోహనరావు చెంప ఛెళ్ళుమంది. అతని కళ్ళలో నీళ్ళు తిరిగేయి.

"నువ్వు చేసిన తప్పు దిద్దుకోవడంలో సాయం చేద్దామని ప్రయత్నించేను మధూ! నేను నిన్ను తిరిగి కొట్టలేకపోవచ్చు! కాని నీ పాపం నీకు చెంపదెబ్బకొడుతుంది మధూ! అనసూయ రాల్చిన ప్రతి కన్నీటిబొట్టూ నీజీవితంలో రక్తపుచుక్కల్ని పిండుతుంది. నీ చెంపదెబ్బకిదే నా సవాలు." మధు ముఖం చూడకుండానే గిరుక్కున వెనక్కు తిరిగేడు రామమోహనరావు.

తీరిపోతుం దనుకున్న సమస్య వేయి పడగలతో ఎదురుగా నిల్చుంది. ఇప్పుడు దేనికి జీవించను? అని అనసూయ అడిగితే ఏమని జవాబు చెప్పాలి. అతని కేమీ పరిష్కారం తోచలేదు. బస్సు క్షణక్షణానికి అతని శరీరాన్ని అనసూయకు దగ్గరగా చేరుస్తూంది. ఉన్నట్టుండి అతని మనస్సులో ఒక్క ఆలోచన మెదలింది.

"తనే అనసూయను పెళ్లాడితే!" అతని గుండె కలుక్కుమంది.

"మరి సీతామహాలక్ష్మి? తన కలలన్నీ ఏమి కావాలి? అసంభవం. తన జీవిత సౌఖ్యాన్ని ఒక అమాయకురాలి పొరబాటుకు బలిచెయ్యలేడు. ఆమె కాటుక కళ్ళలోని సౌందర్యాన్ని చూడకుండా నడకలోనే నాట్యం చేసే ఆమె సన్నని నడుమును కౌగలించుకోకుండా... ఆమె లేక తను లేడు. ఆమె లేని తన భవిష్యత్తును ఊహించుకోనే లేడు...." రామమోహనరావు మనస్సులో అంతర్యుద్ధం మొదలైంది. "వేదికలెక్కి ఉపన్యాసా లివ్వడమే ఆదర్శమయితే అది అందరూ చేస్తారు. నీ కళ్ళముందు మధు కూడా గతంలో ఆదర్శ పాఠాలు వల్లించలేదూ! నీ పరోక్షంలో ఇప్పుడు వల్లించటం లేదూ! ఇంతెందుకు? రాత్రి ఆ దీనురాలి ముందు నువ్వన లేదూ మీ పెళ్ళి చేసే బాధ్యత నాదని? అదంతే! మధు ఆమెను



వంచించేడు. దాని ఫలితంగా ఆమె చావబోయింది. నీవు ఆమెలో చచ్చే శక్తిని చంపేసేవు. నువ్వూ ఆమెను వంచించేవు! ఫలితంగా ఆమె భయపడి పారిపోబోయిన... ఆ నరకం ... ఈ పైన అనుభవించవలసి రావచ్చు!..."

రామమోహనరావులో ఒక మారుమూల ఒక మంట లేచింది.

"నాకేమీ వద్దు! నేనే పాపం చేయలేదు. నాకే ఆదర్శంలేదు. నేనొక సామాన్య జీవిని. నా బ్రతుకు నన్ను బ్రతకనీ! ఇది నాకు చేతకాదు!"

"దిగండి సార్!" అని కండక్టరు గుర్తు చేస్తే ఖాళీ బస్సొకసారి పరికించి చూసి బస్సు దిగేడు రామమోహనరావు.

అతని కోసమే గుమ్మంలో నిలబడి ఎదురు చూస్తూన్న అనసూయ కళ్ళు, సిగ్గు అవమానం మరిచిపోయి ఆతృతతో వేయి ప్రశ్నలు వేశాయి. అతని ముఖమే ఆమెకు జవాబు చెప్పింది. నీరసంగా ఆమె తల ప్రక్కనున్న స్తంభానికి వాలింది ఒక్కసారి నిరాశతో, సిగ్గుతో అవమానంతో. దారం తెగిన పూసల్లా కన్నీటి బిందువులు చెక్కిళ్ళ మీదుగా జారిపోయాయి

రామమోహనరావు మానవ హృదయం పొంగిపోయింది. ఏదో పిచ్చి ఆవేశం అతనిలో పొర్లి వచ్చింది. అనసూయ శరీరం చితిలో కాలుతున్నట్లే కనిపించింది అతనికి.

'అనసూయా!' ఆమె తల తిప్పింది.

'నువ్వు భయపడకు అనసూయా! నిన్ను నేను పెళ్ళి చేసుకుంటాను. ఈ క్షణమే మా నాన్నగారితో చెప్పి వస్తాను.' అతను మెరుపులా వెళ్ళిపోయాడు. ఆమె చెవులు విన్నదానికి ఆమెకు చైతన్యం తప్పింది. అలాగే స్తంభం మొదట్లో కుప్పగా కూలబడి పోయింది.

'ఎందు కిష్టంలేదు నీకి పెళ్ళి?' అర్థంకాక అడిగేరు రాఘవయ్యగారు

'నే నిదివరకే ఒక పొరపాటు చేశాను నాన్నగారూ! అది దిద్దుకోవడం నా ధర్మం. ఆమెను పెళ్ళి చేసుకొనే అర్హత నాకులేదు.' నిబ్బరంగా చెప్పేడు రామమోహనరావు.

'రామం!' గర్జించేరాయన.

'నే నింకో యువతికి మాటిచ్చేను నాన్నగారూ!......మాట కాదు నే చేసిన పొరపాటు దిద్దుకోలేనిదిగా మారింది. నే నామెను పెళ్ళి చేసుకోవాలి నాన్నగారూ!'

'రామం!' రాఘవయ్యగారి కేకతో ఇల్లంతా ప్రతిధ్వనించింది. జడ్జిగా రిటైరైన రాఘవయ్యగారికి కొడుకు నేరస్థుడుగా కనబడ్డాడు. శిక్ష తనే నిర్ణయించుకున్నాడు. దానిని కాదనడం ఆయన కసాధ్యం. తల్లి లేని లోటు లేకుండా పిల్లవాణ్ణి ఆదర్శ ప్రాయంగా పెంచేనని గర్వపడుతున్న ఆయన హృదయం పగిలిపోయింది. అప్పటి వరకూ అన్ని ఆశలకూ కేంద్రీకృత మయిన కొడుకుపై ఆయనకు విపరీతమైన జుగుప్స కలిగింది.

'ఈ మాట పెళ్ళిచూపులముందెందుకు చెప్పలేదూ?' కటువుగా వచ్చింది ప్రశ్న.

'చెప్పలేకపోయాను.' 'ఈతుఫానుకు సిద్ధపడే ఉన్నాడు రామమోహనరావు.

'ఎవరా అమ్మాయి?'

'ప్రకాశం మేస్టారి అనసూయ' భరించలేనట్లుగా రాఘవయ్యగారు తల అడ్డంగా తిప్పేరు.

'ఈవేళ మొదటి సారిగా జీవితంలో మోసపోయాను రామం' రాఘవయ్యగారు బయటకు వెళ్ళిపోయారు. ఆయన నోట్లోంచి చెదిరి వచ్చిన మాటలు అతని గుండెల్లో శూలాల్లా దిగేయి. రామమోహనరావు కళ్ళనిండా నీళ్ళు నిండిపోయాయి.

అనసూయ అతని జీవితంలోకి వచ్చేసింది. సీతామహాలక్ష్మిలాంటి అపురూప సుందరికి ఇటువంటి నీచుడు తగడనిపించింది రాఘవయ్యగారి దృష్టిలో. తండ్రీ కొడుకుల మధ్య ఎన్నటికీ పూడని అగాధం ఏర్పడి పోయింది.

'మీ స్థితికి నేను తగిన దాన్ని కాను. కాని దేవుడిలాంటి మీ గొప్ప ఉదారబుద్ధి వలన మీవంటకు రాగలిగేను. సిగ్గుమాలిన పని చేసి నలుగురి మధ్య తలెత్తుకు బ్రతకలేక, దిక్కుమాలిన చావు చచ్చే నాకు పరువు నిలబెట్టి బ్రతకడానికి ఆశ్రయం కల్పించేరు. కన్న తల్లీ తండ్రీకూడా విని సహించలేని నేరాన్ని పల్లెత్తు మాటనకుండా ఇంత విశాల హృదయంతో చేరదీసిన మీకు మించిన దైవం నాకీ ప్రపంచంలో లేదు. నాకీ ఆశ్రయం దొరికింది. అది చాలు. నేను మీ సౌఖ్యానికి అడ్డురాను. నే నున్నానని దేనికీ సంకోచించకండి. మీ మనసు కేది సుఖం అనిపిస్తే అది చేయండి. మీ సుఖమే నా కానందం' అతని పాదాలను కన్నీళ్ళతో అభిషేకిస్తూ మొదటి రాత్రి అనసూయ చెప్పిన మాటలు అవి.

'జరిగింది మరచిపో అనసూయా! నువ్వు నా భార్యవు. నా అర్ధాంగివి. నా భార్యగా నీకు అన్ని హక్కులూ ఉన్నాయి. తమ నేరాల్ని కప్పిపుచ్చుకొని పైకి వెక్కిరించేవారి కల్పితానందంకంటె కడిగిన ముత్యంలాంటి మన వాస్తవికానందం ఎన్నోరెట్లు మేలు.' సజల నేత్రాలతో ఉన్న అనసూయలో ఏదో పరిపూర్ణత చూస్తూ అప్రయత్నంగా రామమోహనరావు అన్న మాటలు.

ఎవరికీ అనుమానం కలుగకుండా మద్రాసులో ఒక నర్సింగుహోమ్‌లో మగపిల్లవాణ్ణి ప్రసవించింది అనసూయ.

'ఇటు చూడు! ఇది ఏడవడానికి సమయం కాదనసూయా! నువ్వు చేసిన తప్పేమీ లేదు. నిన్ను నే నొక పరిపూర్ణ వ్యక్తిగా ప్రేమిస్తున్నాను. నేను బ్రతికుండగా వీడికేమీ లోటురాదు. నేనే వీడి తండ్రిని అనసూయా!' అవమానంతో రెండో ప్రక్కకు ముఖం

తిప్పుకున్న అనసూయ కళ్ళు తుడుస్తూ అన్నాడు రామమోహన రావు.

'మీరు నా కిస్తూన్న విలువ నన్ను పిచ్చిదాన్ని చేస్తూంది. కాని మీకు నే నిస్తున్న నా పాప ఫలాన్ని...' అనసూయ గొంతు పూడిపోయింది.

'వద్దు అనసూయా! ఆ మాటలు వద్దు!' ఫ్లాస్కులో కాఫీ గ్లాసులో పోసిచ్చేడతను.

'మీరుకూడా త్రాగండి!'

అతను కాఫీ త్రాగుతూంటే ఆమె అలాగే చూస్తూంది.

'ఏమిటలా చూస్తున్నావు?' ప్రశ్నించేడతను.

గట్లు తెగిన సంతృప్తితో సిగ్గు మరచిపోయిందామె.

'చూస్తున్నాను. ఇంత సుందర రూపాన్ని భగవంతుడెలా సృష్టించేడా అని. ఇంత విశాల హృదయాన్ని మీ చిన్న శరీరంలో ఎలా ఇమడ్చేడా అని చూస్తున్నాను. ఈ పిచురాలి జాతకంలో ఇంత నిధిని దేవుడు ఎలా దాచేడా అని చూస్తున్నాను.' చెంపలమీద నుంచి కళ్ళల్లో నిండిన నీరు జారిపోతూంటే అతని చేయి తన చేతుల్లోకి తీసుకొని మృదువుగా చుంబించిందామె.

'ఏమిటీ పిచ్చిపన్లు?' అతని హృదయం ఆర్ద్రమైంది.

'నాకీ రోజు పిచ్చే ఎక్కింది. ఈ పిచ్చి నాలో శాశ్వతంగా ఉండిపోతుంది. ఏమండీ! నేను మిమ్మల్ని



ఐటెక్స్

సౌందర్యానికి సహాయకారులు

* ఐటెక్స్ కాటుక
పసిపిల్లలకు కూడా చాలా మంచిది
* ఐటెక్స్ బిందీ
కంటికింపైన
రంగులలో
లభించును.
* ఐటెక్స్
కుంకుం పేస్టు.



అరవింద్ లేబొరేటరీస్,
పి. బి. 1415 – మద్రాసు–17.

నా ప్రాణంకంటే ఎక్కువగా ప్రేమిస్తున్నానంటే నమ్ముతారా?'

'నేను గుర్తించేను అనసూయా!'

'ఏమండీ! ఒక్కమాట అడుగుతాను చెప్తారా? మీరు పెళ్ళి ముందు ఒకమ్మాయిన్ని చూసొచ్చేరని విన్నాను. ఎంతో అందంగా ఉంటుందట. మీ కెప్పుడైనా గుర్తుకు వస్తుందా?' కొంచెం సేపు ఆగి ప్రశ్నించింది.

'అనసూయా! ఏమిటీ యక్ష ప్రశ్నలు? ఇంకో కేదైనా మాట్లాడు!' అతను మాట తప్పించబోయాడు.

'ఇది ఒక్కటీ చెప్పండి!' అతని ముఖం గంభీరంగా మారిపోయింది.

'భగవంతుడి సృష్టిలో సౌందర్యానికి అంతమే లేదు అనసూయా! అత్యాసతో మనం దాని వెనక పరుగు పెడుతూంటే ఒకదానికి మించిన దొకటి ఊరిస్తూనే ఉంటుంది. అన్ని సౌందర్యాలూ విశాలమైన ఈ సృష్టిలో ఒకే మనిషికి అనుభవించేందుకు హక్కు లేదు కూడా! అలా పేరాశతో దాహం తీర్చుకుందా మనుకొని పరిగెత్తే మనిషికి జీవితంలో అసంతృప్తే మిగులుతుంది.'

'నే నింటికి వచ్చేస్తానండీ!' అంది అనసూయ ఉన్నట్లుండి.

'అదేమిటీ? ఇప్పుడెలా వస్తావు అనసూయా!'

'నేను మిమ్మల్ని విడిచి ఉండలేను. ఒక్క క్షణం కూడా ఉండలేను. ఎప్పుడూ మీ ముఖంలోకి చూస్తూ ఏమిటేమిటో వింటూ అలాగే ఉండాలనిపిస్తూంది!' రెప్పవాల్చకుండా అతని ముఖంలోకి చూస్తూ అందామె.

'దానికేం భాగ్యం అనసూయా! నీ శరీర పరిస్థితికి ఇక్కడ ఉండడం అవసరం!' అని అతను నవ్వుతూ పిల్లవాడివైపు చూసేడు. ఆమె ఇంకా అతని ముఖంలోకే చూస్తూంది. నిష్కల్మషమైన, అచంచలమైన అతని సంతృప్తి అసూయా స్వార్థాలకు మించిన అతని చిరునవ్వు ఆమెకు అనంత సముద్రంలా కనిపించేయి.

కాల ప్రవాహంలో నాలుగేళ్ళు దొర్లిపోయాయి. ప్రవాహంలోని రెండు నీటి బుడగలు పగిలిపోయాయి. అనుకోని తండ్రి ఆకస్మిక మరణం రామమోహనరావును పూర్తిగా కృంగదీసింది. ఆ వియోగాన్నుంచి కోలుకోకుండానే ఒకరోజు అనసూయ మనసు విప్పి ఆలోచించలేని పరిస్థితిలో, కళ్ళు విప్పి చూడలేని పరిస్థితిలో, నోరు విప్పి మాటాడలేని పరిస్థితిలో ఆమె శరీరంలోని రక్తం స్తంభించి

పోయింది. కుళ్ళిపోయిన ఆమె శరీరం మశూచి వార్డులోంచి బయటకు తీసుకొని పోతూంటే శవచ్ఛవంలా, అచేతనంగా అనుసరించేడు రామమోహనరావు. ఆ దెబ్బతో అతను ఇంచుమించుగా పిచ్చివాడై పోయాడు. ఏ పాపం చేయని తనను చిత్రహింస చేసేదనే అర్థం లేని కసిలో, దేవుడికి సవాలు చేస్తూన్నట్లుగా అతడు మరో పెళ్ళి తలపెట్టలేదు.

అగమ్యంగా పరిగెడుతూన్న అతని జీవితంలో స్వాతంత్ర్య సమరం ఆప్యాయంగా ఆహ్వానించింది. ఉన్న స్వార్థం ఎప్పుడో చచ్చిపోయింది. ఆ ఆవేశంలో జైలు జీవితం చవిచూశాడు. అతని శరీరం ఖద్దరు దుస్తుల్లోకి మారింది. బిగపట్టిన కోరికలలో, తీరని కోరికల కలల్లో, అయ్యో ఇవి కలలేనా అనే నిట్టూర్పులతో దొర్లిపోయింది కాలచక్రం మరో ఇరవై సంవత్సరాల మేరకు. యాభై ఏళ్ళు నిండకుండానే ముగ్గు బుట్టయి పోయింది రామమోహనరావు ... కాదు ... రావుగారి తల. ఆస్తంతా దేశసేవలో కరిగిపోయింది. బి. ఎ. ఫస్టుక్లాసులో పాసయిన కొడుకు రఘు చదువు అక్కడే నిలచిపోయింది ఆర్థిక దుస్థితిలో. కళ్ళనీళ్ళు పెట్టుకున్న రావుగారిని చూసి అవకాశం ఉన్నప్పుడే చదువుకోవచ్చు నాన్నా! నువ్వేం బాధపడకు! నాకు చదవాలని కూడా లేదు' అన్నాడు రఘు. గత నాలుగేళ్లుగా రఘు హైదరాబాదులో ఎ. జీస్. ఆఫీసులో పై తరగతి గుమాస్తాగా ఉంటున్నాడు. ఎల్. ఎల్. బి, పూర్తి చేశాడు రాత్రి కాలేజీలో చదివి. ఎన్నో ఆహ్వానాల తరువాత ఈ రోజు వెడుతున్నారు రావుగారు కొడుకు రఘు దగ్గరకి.

• • •

బెజవాడ స్టేషను వచ్చింది. రావుగారికి కాళ్ళు తిమ్మిరెక్కినట్లయింది. ఒక్కసారి లేచి నుంచున్నారు. పైనచూస్తే బెర్తంతా ఖాళీగానే ఉంది. తొడతొక్కిడిగా జనం లోపలకు వస్తున్నారు. ఆయన చూస్తూండగానే బెర్తు మీదికి రెండు పెట్టెలొచ్చేయి. సంచీలోంచి ఒక దుప్పటి తీసి పైన పరచేరు మిగిలిన

పండిట్
డి. గోపాలాచార్యులవారి
జీవామృతం
దేహపుష్టికి, ఆరోగ్యమునకు
ఆయుర్వేదాశ్రమం
ప్రై. లిమిటెడ్
మదరాసు-17

చోటులో పైకెక్కి క్రిందికి చూస్తూ పడుకున్నారు.

సీతామహాలక్ష్మి సంచీలోంచి పొట్లాం తీసి విప్పింది. పూరీలున్నాయి అందులో. 'ఇంద! ఇవి తిను!' అని పూరీలు తుంచి పంచదారతో కొడుక్కి తినిపిస్తూంది. ఆమె ప్రతి కదలికలోనూ ఆయనకేదో అందం కనబడుతూంది. పిల్లవాడు తిన్న తరువాత మిగిలినవి ఆమె తిని మరచెంబులో మంచి నీళ్లు పిల్లవాడికి త్రాగించి తను త్రాగింది.

'అమ్మా! మనం హైదరాబాదులోనే ఉండి పోదామా!' పిల్లవాడడుగుతున్నాడు.

'ఓ నెలుండి మళ్ళీ వచ్చేద్దాం!' అందామె అతని ముఖంపైపడిన జుట్టు వెనక్కు తోస్తూ.

'తిరిగి వచ్చేటప్పుడు కొత్త కారులోనే వస్తామా!'

'ఏమో! అది వచ్చిందో లేదో! బొంబాయినుంచి రావాలి! వస్తే కారుమీదే వద్దాంలే!'

'మరి నాన్న కారు నడపడం ఎప్పుడు నేర్చుకొన్నాడే!'

'ఈ పైన నేర్చుకుంటారు. నువ్వు కూడా బాగా చదువుకుంటే అన్నయ్యలా, పెద్దయ్యేక కారు మీద తిరగొచ్చు.' అతని బుగ్గలు సంతోషంతో సాగేయి. బెజవాడలో బండి కదిలింది. కుదుపుకు మెల్లగా రావుగారి కళ్లు మూతలు పడ్డాయి.

రావుగారి భుజంమీద చేయి పడ్డట్లయింది. 'ఎవరు?' కళ్ళు తెరచి చూసేరు.

'ఉష్! గట్టిగా మాట్లాడకండి! అందరూ పడుకున్నారు. లేస్తారు.' అంది సీతా మహాలక్ష్మి మెల్లగా పక్కలో కూర్చుంటూ.

'సీతా!' రావుగారి కళ్లు ఆనందాశ్చర్యాలతో మెరిసేయి.

'ఆశ్చర్యంగా ఉంది కదూ! మీ మనస్సులో ఆలోచనలన్నీ నెమరు వేసుకున్నారు కానీ మిగిలిన వాళ్ళకూడా మనసు లుంటాయనీ, వాళ్లకూ ఆలోచన లుంటాయనీ తోచనే లేదా!' ఆమె నవ్వి ఆయనకు కన్నుల పండువ చేసింది.

'ఆనాటి నుంచి ఈనాటి వరకూ నన్ను గుర్తు పెట్టుకున్నావా సీతా!'

'నరనరాల్లోకి పాకిపోయిన పరిచయం ఏనాటి దైతేనేం! అది కాలంతో మాసిపోతుందా?'

'కాని కాలంతో నీ రూపం తప్ప మిగిలినవన్నీ మాసిపోయాయి సీతా నా జీవితంలో!' రావుగారి కళ్లు అశ్రుపూరితా లయ్యాయి.

'మీరు కంటతడి పెడితే నేను చూడలేను. గడచినవి మరచిపొండి. ఇప్పుడు నేను వచ్చేనుగా!' ఆమె

మీదికి వంగి రావుగారి కళ్లు ప్రైట కొంగుతో తుడిచింది.

"ఇక ఎప్పటికీ నన్ను విడువకుండా ఉంటావా సీతా!"

"ఎన్నటికీ విడువను. మిమ్మల్ని విడిచి నేను బ్రతుకగలనా! ఎన్నటికీ విడువను. ఎన్నటికీ విడువను."
రావుగారి నుదుటిమీది వెంట్రుకలు మృదువుగా వెనక్కు తోసి ఇంకా మీదకు వంగింది. ఆమె పెదవులు ఆయన పెదవులకు తగిలించింది. ఆమె ఉన్నతమైన హృదయం, వేడెక్కిన ఆయన రొమ్ముకు మెత్తగా అనుకుంది.

"సీతా!" పరవశంతో రావుగారు నరాలు తెగిపోయేంత బిగువుగా కౌగలించుకున్నారు.

పడిపోతూన్నట్లయి చేతి కందింది గట్టిగా పట్టుకున్నారు రావుగారు. కళ్ళు తెరచి చూసేరు. బెర్తుకి బిగించిన ఇనుప గొలుసు చేతిలో ఉంది. మళ్ళీ కళ్ళు నులువుకు చూశారు. ఏది సీత? ఏవి ఆమె పెదవులు! గొలుసును చుంబించిన పన్ను బాధగాలాగుతూంది.

"ఈ ఇనుప గొలుసేనా చేతుల్లో ఇమిడింది? సీత శరీరం కాదా! అంతా కలేనా సీతా?"
రావుగారి మనస్సు దుఃఖపు టగాధాల్లోకి తూలిపోయింది. ఆయన క్రిందకు చూడబోయారు.

"ఏమిటిదంతా? ఏమిటీ పాడు ఆలోచనలు? ఆమె పరపురుషుని భార్య! ఇదేనా నీ నీతి?" అంతరాత్మ హెచ్చరించింది రావుగారిని.

మనస్సు బాధగా మూలిగింది. "నేనామెతో మాటాడలేదు. ఆమెను నేను నాతో మాటాడమనలేదు. కళ్ళతో ఆసుందర దృశ్యాన్ని చూసేందుకు కూడా నాకధికారం లేదా? ఏళ్ళతరబడి ఎండిపోయిన నా బ్రతుకుపై ఆమె దర్శనం పన్నీటి జల్లు. కళ్లూ, చెవులూ మూసుకొని కూర్చోడమే నీతయితే నాకానీతి వద్దు! నేను అవినీతుడినే! నన్ను మాటాడించకు. ఆమె రూపాన్ని నా హృదయంలో ప్రతిష్టించుకోనీ! నా సౌందర్య దేవతను ఆరాధించనీ! వాస్తవ జీవితంలో పొందలేని ఆనందాన్ని కనీసం ... కనీసం... ఒక్క ఊహలోనైనా చవి చూడనీ!" దీనాతిదీనంగా ఆక్రోశించింది ఆమె మనస్సు. రావుగారు తెగువగా క్రిందికి చూసేరు మళ్ళీ.

పైబెర్తులో అందరూ నిద్ర పోతున్నారు. ఆమెకూడానిద్రపోతూంది. కిటికీకి తల నాన్చుకొని, పరవశించి మైమరచిన ప్రణయ దేవతలా. పైట క్రిందికి జారిపోయింది, విశాలమైన తెల్లని కనురెప్పలు సుకుమార దళాల్లాగున్నాయి. చిన్న తీరైన ముక్కు. చిన్నిగడ్డం క్రింద తెల్లని మెడ నల్లని రైకలోంచి కాంతి



వంతంగా వెలుగుతూంది. ఇరుకైన రైక మధ్య నుంచి తెల్లగా ఆమె హృదయ శిఖర పీఠాలు ఉచ్ఛ్వాస నిశ్వాసాలకు ఉబుకుతున్నాయి. నల్లని రైక క్రింద మృదువైన పొట్ట......

రావుగారి మనస్సు సలసలా కాగుతూంది. ఏళ్ళ తరబడి బిగపెట్టిన కోరికలేవో విజృంభించి కాల్చేస్తున్నాయి.

"ఈ సౌందర్యాన్ని అనుదినం అనుభవిస్తూన్న ఆ అదృష్టవంతుడెవరు? బంగారు పుస్తె మెడలో కట్టి ఇది నాది అని ముద్రవేసుకున్న అతడెవరు? ఇరవై నాలుగేళ్ళ జీవితంలో అతడు పొందిన ఆనందానికి కొలతలున్నాయా?"
అప్రయత్నంగా రావుగారి మన

న్సులో ఏదో అసూయ లాంటిది తలెత్తుతూంది.

"తనకూ ఆమెకూ మధ్య దూర మేమిటి? మూడడుగులు. ఒక్క సారి ఆ కనురెప్పలను పెదవులతో స్పృశిస్తే! ఒక్కసారి ఆ పెదవులను పెదవులతో కలిపితే! ఒక్క సారి ఆమె హృదయంలో ముఖాన్ని దాచుకుంటే!" రావుగారు పట్టరాని ఉద్రేకంతో అసహాయంగా తల గోలునుకేసి కొట్టుకున్నారు. "అబ్బా!" అలసిపోయిన ఆయన మనస్సుపై ఆయనకే అసహ్యం వేసింది. బలవంతాన రెండోవేపు తిరిగేరు. 'లెస్ లగేజ్ మోర్ కంఫర్ట్! మేక్ ట్రావెల్ ఎ ప్లెజర్!' ముద్రించిన అక్షరాలను చదువుతూ ఆమెమీది దృష్టి మరల్చడానికి ప్రయత్నించేరు. కాని సాధ్యం కాలేదు. బెర్తుదిగి ఆమె కెదురుగా కూర్చున్నారు ఆమెనే చూస్తూ. ఎన్నో గంటలు దొర్లిపోయాయి ఆ మూగ ఆరాధనలో కొన్ని క్షణాల్లా.

వచ్చేది సికిందరాబాదు స్టేషనే అంటున్నారు ఎవరో. ఇంకొంచెం సేపుంటే ఆమె కనబడదా! ఒక్క సారి మాటాడ కూడదూ తనతో! కనీసం తనవైపు చూడనైనా చూడదేం! తాను ఆమెను దేవతకంటే ఎక్కువగా ఆరాధించటం లేదూ! అవును ఆమె ఎందుకు మాటాడాలి? ఎందుకు గుర్తుంచుకోవాలి? ఆమె అపురూప సౌందర్యవతి. అందుకనే తాను గుర్తు పెట్టుకున్నాడు. కాని తనలో ఏముంది. తన జీవితంలో అన్నీ నెత్తురు కార్చే శూలం పోటులాంటి అనుభవాలు. ఆమెకేం! ఆప్యాయంగా చూసుకొనే భర్త! ముచ్చటగా ముగ్గురు సంతానం! అందులో పెద్ద కొడుక్కు అప్పుడే ఆఫీసరు హోదా! భర్తకు కొత్తకారు కొనుక్కునే ఆర్థిక స్థితి.


మాటి మాటికి రేగిన పుండులా బాధించే అనుభవాలు తనవి. తీరని ఆశలు ఆరని జ్యోతుల్లా దహించి వేస్తూన్న జీవితం తనది. కోరిక పుట్టకుండానే తీరి ఆనందిస్తూన్న అదృష్ట జాతకం ఆమెది. ఆమెకు తానెందుకు గుర్తుండాలి?


సికిందరాబాదు స్టేషన్‌లో బండి ఆగింది. ఆమె పెట్టె, రెండు సంచులు, సర్దుకొని దిగటానికి సిద్ధంగా పెట్టుకొని కూర్చుంది. రావుగారు దుప్పటి మడచి సంచీలో పెట్టుకున్నారు. మళ్ళీ బండి కదిలింది కాని తరువాత పదిహేను నిమిషాలూ మరో నిమిషంలో దొర్లిపోయాయ్. నాంపల్లి స్టేషనులో బండి నిలచిపోయింది.

"ప్రకాశం! నాన్నగారు కనబడతారేమో చూడు!" అంటూ హుంగా రుగా లేచిందామె. గాలికి ఎగిరిన పైటకొంగు రావుగారి ముఖాన్ని కప్పివేసింది. ఆయనకు ఆమెను ఆలింగనం చేసుకున్నట్లనిపించింది. ఆ పైట కొంగు స్పర్శలోనే ఆయన పరవశించిపోయారు. ఆమె కొంగు రెండోప్రక్కకు తిప్పి దోపుకుంది. ఆమె సిగలోంచి ఒడిలిపోయిన రెండు మల్లెపూవులు రావుగారి ఒడిలో పడ్డాయి. ఆయన హృదయం ఆనందంతో పొంగిపోయింది. గట్టిగా చేతిలోకి తీసుకొని ఆ ఎండిన పూలలో పారిజాత పరిమళాల్ని ఆఘ్రాణించే రాయన.

"నాన్నా!" అంటూ రఘు పెట్టెలోకి వచ్చేడు రావుగార్ని చూసి. రావుగారి దగ్గరకు రాబోతూంటే ఆమె రఘును ప్రక్కగా చూసి "కృష్ణా! నాన్న కూడా వచ్చేరా!" అంటూ అతని ముఖం తనవైపు తిప్పుకొని అలాగే తెల్లబోయి చూస్తూ నిల్చుండిపోయింది. రఘూ, రావుగారూ కూడా అర్థంకాక చేష్టలు దక్కి చూస్తున్నారు.

"అమ్మ ఇక్కడ థర్డుక్లాసు పెట్టెలో ఉంది నాన్నా!" అని బయటనుంచి కేకవిని అందరూ అటు చూసేరు. "అన్నయ్యా!" అంటూ ఆమె కొడుకు ప్రకాశం పరిగెత్తు కెళ్ళాడు కిటికీ దగ్గరకు. ఆమె భర్తను చూడాలనే కుతూ





హాలంతో ముందుకొచ్చేరు రావుగారు.

'మొత్తానికి నీ గుణం పోగొట్టుకున్నావు కాదు! సెకండు క్లాసులో రమ్మంటే ఇందులో వచ్చావేమే!' లోపలకు వచ్చేడు ఆమె భర్త.

ఎవరతను? ఎక్కడో చూసినట్టుంది! అదే నవ్వు! అదే మాట! రావుగారి గుండె చీల్చినట్లయింది. 'మధూ! నువ్వా చివరకు నా సౌందర్య దేవతను చేపట్టింది. దురదృష్టాన్ని నాకిచ్చినట్లే నా అదృష్టాన్ని కూడా తన్నుకుపోయేవా?' మబ్బురంగు వులెన్‌సూటులో ఇంకా మధు యవ్వనాన్ని కోల్పోయినట్లు లేదు. అతని చేయి ఆసరాగా చేసుకొని ఆమె రైలు దిగింది.

'దిగు నాన్నా!' అన్నాడు రఘు, రావుగారి సంచీ తీసుకుని.

'ఆ పిల్లవాణ్ణి చూసి నువ్వనుకున్నానురా కృష్ణా! సరిగ్గా చూడు నీలా లేడూ?' అంటుందామె కొడుకుతో.

రావుగారికి జరిగిన దృశ్యం చటుక్కున గుర్తుకు వచ్చింది. చూస్తే రఘుకూ, కృష్ణకూ చాలా పోలికలున్నాయి. 'ఆనాడు నేనంటే తోసిపుచ్చేవ్ మధూ! ఈనాడు కన్నతల్లి కూడా భ్రమపడేంతగా రఘులో ఉన్న నీ పోలికల నేమనగలవ్ మధూ!' అనుకున్నారు రావుగారు. దెబ్బతిన్న పిచ్చుకలా పెట్టె దిగేరు.

మధు కూలీని పిలుస్తూ ప్రక్కనుంచి వెడుతూంటే అతని చేయి తగిలి రావుగారి చేతిలో ఎందుమల్లెలు క్రిందపడిపోయాయ్. వంగి తీసుకోబోయే లోపల అవి బరువుగా అడుగులు వేస్తూన్న మధు ఎంబాసడర్ బూట్లకు అతుక్కుపోయాయి. రావుగారి గుండె పిండినట్లయింది. కళ్ళనిండా నీళ్లు నిండేయి. కన్నీటి తెరల్లోంచి ఏమీ కనబడక కళ్ళజోడు తీసి కళ్లు తుడుచుకుంటూంటే 'ఏమిటి నాన్నా!' అన్నాడు రఘు ఆయన ప్రవర్తనకు ఆశ్చర్యపోతూ. కంట్లో బొగ్గు పడిందన్నారు రావుగారు. ఆయన చూస్తూండగానే మధుసూదనం కొత్త కారు కదిలిపోయింది మెత్తగా. మలుపు తిరుగుతూన్న కారు వెనుక అద్దంలోంచి తెల్లని సూర్య కిరణాలు రావుగారి కళ్ళల్లో పొడిచేయి నువ్వు వాళ్లను చూడటానికి అర్హుడవు కాదన్నట్లుగా.

'నా జీవిత సౌఖ్యాన్ని ధారపోసి ఒక అబలను కాపాడబోయాను. ఫలితంగా కన్నతండ్రికి దూరమయ్యాను. కనీసం ఆమెనైనా దక్కించుకోలేక పోయాను. కాని ఆ కామాంధుడి పాప ఫలాన్ని నేను పెంచాల్సి వచ్చింది. శరీర సుఖానికి ఒక జీవితాన్నే బలి చేయడానికి వెనుతీయలేదు వాడు! ఐనా, నా సౌందర్య దేవతను స్వంతం చేసుకొని చెప్పలేని సుఖాన్ని పొందుతున్నాడు. ఈ అరని మంటలను నేనెలా భరించను? నేను చేసిన ఏ తప్పుకు నాకీ శిక్ష భగవాన్!' ఆయన హృదయంలో అణగని తుఫాను లేచింది. రఘుకు ఏమీ అర్థంకాక తండ్రి కళ్ళల్లో నీళ్ళు చూసి బెదిరిపోయాడు. 'అదేమిటి నాన్నా?' అన్నాడు ఆందోళనతో ముందుకొచ్చి. దుఃఖంతో పూడిపోయిన గొంతులోంచి మాట రాక, సానుభూతి లభించక ఆవేదనతో గుటకలు మింగేరు రావుగారు. ఆ ఆదర్శవ్యక్తి ... ఆ దేశభక్తుడు— కాదు—ఆ దైవోపహతుడి కళ్ళనుండి రెండు నులి వేడి కన్నీటి చుక్కలు ఆయన ముతక ఖద్దరు లాల్చీపై పడి ఇంకిపోయాయి, విధి చేతి వ్రాలులో ఇంకిపోయిన ఆయన ఆదర్శాలు లాగే.

□□□

(గత సంచిక తరువాయి)

చదువుకున్న కమల

ముప్పాళ్ళ రంగనాయకమ్మ

"ఇంకా ఆకలి తీరలేదే పసి వెధవకి. అడ్డం వేసుకో. తాగనియ్యి' అంటూ ముసలాయన నెమ్మదిగా గదిలోంచి కదులుతాడు. అసహ్యం—కోపం మిశ్రితమై వుక్రోషంగా మారి — కళ్ళమ్మట నీళ్ళు బొటబొటా కార్చేస్తుంది కమల. లేకి మనిషిలా భావించి తన్ని అవమానం చెయ్యటం కాదూ? తను గంభీర్యంగా — మర్యాదగా మసలటం ముసలాయనకి అర్థం కావటం లేదూ? తనలో తను భరించలేని స్థితిలో మాటల మధ్య ఆ ముక్క కాస్తా మధుమూర్తితో చెప్పేసింది— మూర్తి తెల్లబోయాడు — 'అమ్మతో చెప్పలేక పోయావా?' అన్నాడు.

'అదీ అయింది. 'అయ్యో! ఆయనకి పసివాడి ధ్యాస తప్పితే మరేవీ తెలీదే! అంతపాటి బుర్ర వుందని నువ్వు బాధపడ్డావా?' అంటూ బుగ్గలు నొక్కుకున్నారేగానీ — ఆయనకి మాత్రం చెప్పలేదు. నాలుగు రోజుల్నుంచీ నేను గది తలుపులు వేసుకునే కూర్చుంటున్నాను. అయినా బైటనుంచి— 'ఏడుస్తున్నాడు. అడ్డం వేసుకో.' అంటూ సలహా లివ్వటం మానరు.'

మూర్తి చిరాగ్గా నుదురు రాసుకున్నాడు 'మన ఖర్మ! భరించాలి. అంతే.'


'రామం పేరుపెట్టి తెచ్చుకున్న ఆపద యిది.' అనుకొంది కమల.

రామానికి మూడో ఏడు జరుగుతోంటే మరో ఆపద వచ్చి పడింది.

కమల పండులాంటి ఆడపిల్లని కంది.

'ఇంకేం? చిన్న శేషమ్మ పుట్టింది. పిన్నిగారి కెంత సంబరమో!' అంటూ ప్రభావతి — వనజాక్షీ వాళ్ళు హాస్యాలాడుతుంటే శేషమ్మ తెగమురిసి పోయింది— 'మా శేషు వస్తేగానీ యింటికి కళ లేదు. బారసాల కెళ్ళి కోడల్ని వెంటబెట్టుకు వచ్చేస్తాను. శేషమ్మ ఎలా వుందో చూడాలి వేగిరం.' అని చాలాసార్లు తల్లి అనటం విన్నాడు మధుమూర్తి.

కమలదగ్గిరికి వెళ్ళాం తర్వాత— 'పాపకి తన పేరు పెట్టుకోవాలని



అమ్మ సరదా పడుతోంది కమలా!' అంటూ పాత సమస్య తెచ్చి పెట్టాడు.

కమల విస్తుబోయింది—'శేషమ్మ అనా?'

'అదే. ఏదో శేషారత్నం - శేషమణీ ...'

'రత్నాలూ - మణులూ కన్నా శేషమ్మే బావుండిగా?' కోపం అణుచుకొంది కమల.

'అవును కదూ? శేషమ్మే సింపుల్‌గా వుంది.'

'మీకేం మతి చలించలేదు గదా? సాధ్యమైనంత చిరాకు వెళ్ళడించింది కమల—' మొగపిల్లలకి ఆయన పేరు - ఆడపిల్లలకి ఆవిడ పేరూ పెట్టుకుంటూ పోవాలన్న మాట. కన్న పిల్లకి ఒక నచ్చిన పేరు పెట్టగలిగే స్వంత

అభిప్రాయం లేని మనం పిల్లని కన్నందుకు సిగ్గుపడాలి.'

మధుమూర్తికి జవాబు చెప్పే సాహసం లేదు. కూతురికి శేషమ్మ పేరు పెట్టటానికి కమల ఎందుకు తిరస్కరిస్తోందో అతనికి తెలుసు.

కాలంతోపాటు అభిరుచులు మారుతున్నాయి. చదువు సంధ్యలతోపాటు నాగరికత పెరుగుతోంది. నచ్చని పాతను విస్మరించి—నచ్చే కొత్తని ఆహ్వానించటం—పెద్ద విశేషమూ కాదు. సాహసమూ కాదు. కమల నూటికి తొంభైపాళ్ళు అభ్యుదయవాది — ఆ సంగతి బాగా తెలును మూర్తికి.

ఖచ్చితంగా తేల్చి చెప్పేసింది కమల—'నా మనస్సునీ – నా ఆశనీ చంపుకుని యితర్ల మెప్పుకోసం—నటించే శక్తి నాకు లేదు. పాపకి శేషమ్మ పేరు పెట్టటం నా కిష్టం లేదు.'

మధుమూర్తి కొంచెం నవ్వుతూ అన్నాడు—'నాకు బాగా యిష్టం వుంది. మా అమ్మ పేరే పెట్టుకుంటాను నా కూతురికి.'

కమల చురుగ్గా చూసింది—'మీ కూతురి విషయంలో నా కెలాంటి జోక్యమూ వుండకూడదని మీ రనేస్తే—సరే! నేను కలగ జేసుకోను.'

'కమలా? ఎందుకంత కోపం తెచ్చేసుకుంటావు?— గిత్రని ఇరవై ఏళ్ళు తిరిగి నీకో మనవరాలు పుట్టి – దానికి 'కమల' అని పేరు పెడితే నీకు సంతోషంగా వుండదూ?' ఆశ్చర్యంగా చూసింది కమల—' ఇదేనా మీరు నన్ను అర్థం చేసుకున్నది? ప్రపంచం పుట్టేక కమల పేరు కొన్నికోట్ల మందికి పెట్టివుంటారు. ఇకమీదట కోట్లాది మందికి పెడుతూవుంటారు. ఆ పేరు నా ఒక్కదానికీ స్వంతం కాదని తెలుసుకోనేపాటి వివేకం లేదా నాకు? రెండు తరాల తర్వాత పసిముండకి కమల పేరు పెడితే మురిసిపోతానా?' అంది.

మధుమూర్తి పూర్తిగా ఓడిపోయాడు.

'సరే! నీ యిష్టం కమలా! నీకు నచ్చిన పేరు ఆలోచించిపెట్టు.'

'మీ అంగీకారం అక్కర్లేదా?'

'నీకే నచ్చితే నాకు నచ్చి తీరుతుంది. ఆ భయం నాకేం లేదు' మనస్ఫూర్తిగానే ఒప్పుకున్నాడు మధుమూర్తి.

బారసాల అంటూ క్లుప్తంగా చేయించిన తతంగంలో—'ప్రేమ' అంటూ కూతురికి పేరు నిర్ణయించింది కమల.

శేషమ్మ ముందు తెల్లబోయింది. తర్వాత తేళ్ళూ జెర్రులూ పాకుతోన్న దానిలా చిరమర లాడింది—'ఏమిట్రా మూర్తీ ఈ అఘాయిత్యం?' అంది గుడ్లనీరు కుక్కుకుంటూ.

మూర్తి పేపర్లో తల దూర్చుకున్నాడు—'ఏమో! వాళ్ళమ్మ పాత పేర్లు బావుండవని—కొత్త పేరు పెట్టుకుంటానంది.'

'అది అంతే నువ్వు వూరుకున్నావా? అంతేనా? ఇక పెద్దా చిన్నా లేదూ? ముద్దూ ముచ్చటా లేదూ?' అంటూ ఏకరువు పెట్టింది శేషమ్మ.

'ఇంతకీ ముద్దూ ముచ్చటా జరగాల్సింది మీకా? మీ మనవరాలికా?' అనేద్దా మనుకుంటూనే నిగ్రహించుకుంది కమల.

నెలలోపునే పిల్లని ఎత్తుకుని భర్త వెంట అత్తారింటికి వచ్చేసింది కమల.

పిల్లని చూడ్డానికి వచ్చిన అమ్మలక్కలు—ముఖ్యంగా శేషమ్మ శ్రేయోభిలాషులు—

'అదేవిటీ? మనవరాలికి పేరు పెట్టుకో లేదేం పిన్నిగారూ?'

'అయ్యో! ఇంటపుట్టిన పిల్లకి పెద్దవాళ్ళ పేర్లు పెట్టుకోరూ?'

'ఇకేం పూర్వంనుంచి వస్తోన్న ఆచారమా? ఏమన్నానా' అంటూ ఒక్కుమ్మడిగా సానుభూతి కురిపించేసి అసలే కుళ్ళిపోతోన్న శేషమ్మని కల్లుతాగిన కోతిలా చేసేశారు.

అంతా సద్దుమణిగాక శేషమ్మ పొయ్యిముందు కూర్చుని ముక్కు ఎగబీలుస్తూ—'నా మురిపెం ముక్కలైంది. పదిమందిలోనూ ఎంత తలవొంపూ. అయినా ఇంతోటి శేషమ్మ పేరు ఎలా పనికి వస్తుంది! శేషమ్మకేం నగలున్నాయా? నాణ్యాలున్నాయా? ఆస్తులున్నాయా? పాస్తులున్నాయా? కట్టుకున్న మొగుడు నన్ను గొప్ప చేశాడా? కన్నకొడుకు నన్ను గొప్ప చేశాడా?' అంటూ ఎక్కడో మొదలుపెట్టి — ఎక్కడెక్కడికో మెలికలు తిప్పి—ఎక్కడికో అంతం చేసి — నీరస పడిపోయి వూరుకొంది—రాత్రి పదిగంటల వేళ వరకూ మధుమూర్తి ఇంటికిరాలేదు.

రోజులు గడుస్తోన్నకొద్దీ అత్తగారి ప్రవర్తనలో మార్పు బాగా కనిపెట్టగలిగింది కమల.

కోడలు ఏదైనా పనిలో వున్నప్పుడు చంటిది ఎంత ఏడ్చినా ఆవిడ కన్నెత్తి కూడా చూడదు. ఎప్పుడూ ఎత్తుకోదు. అంటీ అంటనట్టు మసులుతుంది.

పేరు పెట్టనంత మాత్రాన మనవరాల్ని వెగటు చేసుకున్న అత్తగారి ధోరణి చూస్తోంటే కమలకి ఆశ్చర్యం ముంచుకు వస్తుంది.

ఓ ఏడాదిపాటు ప్రేమ పెద్ద వాళ్ళ నీడకూడా పడకుండా తల్లి ఒళ్ళోనే పెరిగింది. మధుమూర్తి చంటిపిల్లల విషయంలో కొంచెం దూరంగానే వుంటాడు. అప్పటికి రామాన్ని మాత్రం కాస్త చేరిక చేసుకొంటున్నాడు.

ఏడాదిన్నర దాటకుండానే ప్రేమకి తమ్ముడు పుట్టాడు.

చంటివాడు నూటికి నూరు పాళ్లూ తండ్రి పోలిక. చామన ఛాయ. పొడుగు చేతులూ—పొడుగు కాళ్లూ. వుంగరాల జుత్తు – ఒత్తుగా కనుబొమ్మలూ—

మధుమూర్తిలో నిద్రాణమైవున్న పితృ హృదయం చంటివాణ్ణి చూసి నప్పుడు మాత్రమే చలించి గంతు లేసింది.

'కమలా! వీడు నా కొడుకు.' అన్నాడు ఆనందంగా ముద్దు పెట్టు కొంటూ. 'కుమార్!' అంటూ పిల్చాడు ప్రేమగా.

ఆ పేరే వాడికి ఖాయమైంది.

మూడో పురిటితో కమల కొంచెం అస్వస్థురాలైంది. చంటి వాడికి పాలు చాలని పరిస్థితిలో పోతపాలు ప్రారంభించింది.

చంటి వెధవ కూడా పెద్ద పిల్లలా ఆరోగ్యంగా పెరగలేదు. ఎప్పుడూ విరోచనాలో—జ్వరమో — కుమ పులో—క్షణం తీరిక లేకుండా వాడితో సతమత మవ్వసాగింది కమల. ఎడపిల్ల విషయంలో అత్త గారు బొత్తిగా కలిసిరాదు.

కమల కొంచెం ఆలోచించి ఓసారి పుట్టింటికి ప్రయాణం పెట్టుకు వెళ్ళి 'ప్రేమ'ని తల్లి దగ్గిర వదిలి వచ్చింది.

తెగుళ్ళతోనూ – అస్వస్థతల తోనూ—కుమార్ తండ్రికి బాగా చేరువయ్యాడు.

ఓ రోజు కమల చంటివాడికి పౌడర్ అద్ది జుబ్బావేసి ముద్దుపెట్టు కొంటూ భర్తకేసి కొంటెగా చూస్తూ అంది — 'ఇక మీరు డాక్టర్ దగ్గిరికి పరిగెత్తండి.'

'ఎందుకూ?' చంటివాడి కేమైందోనని కంగారు పడ్డాడు మూర్తి.

'మనకి పిల్లలు చాలు' నవ్వింది కమల

'చంపేశావ్. గట్టిగా అనకు. మాఅమ్మ వింటుంది.'

'ఏం? వింటే?...' రెట్టించింది కమల—'ఈ విషయంలో కూడా మీ అమ్మ సలహా, అంగీకారం కావాలా మీకు?' నుదురు చిట్లిస్తూ అడిగింది.

'అబ్బే అదికాదు...'

'ఏదికాదు? ఇది నూటికి నూరు పాళ్ళూ మన యిద్దరికే సంబంధించిన విషయం. ఇందులో మరొకరి జోక్యం అనవసరం.'

'నిజమే. కానీ ... వేసక్టమీ అయితే...—ఏవో కంప్లయింట్స్ వస్తున్నాయని అనుకుంటున్నారే...'

'అవన్నీ డాక్టర్ని—స్పెషలిస్ట్ని అడగండి. మంచి మంచి పుస్తకాలు చదవండి. బాగా ఆలోచించుకున్న మీదటే ఓ నిర్ణయానికి వద్దాం. అంతేగానీ...' దేశంలో దారిద్ర్యం గురించీ, కుటుంబ నియంత్రణం గురించీ—పిల్లల భవిష్యత్తు గురించీ పెద్ద ఉపన్యాసం ప్రారంభించ బోతోన్న కమల నోరు మూసేశాడు మూర్తి—తల్లి అడుగుల చప్పుడు విని.

• • •

పిల్లలు కాస్త ఎదిగాక కొత్త చికాకులు వచ్చి పడ్డాయి కమలకి.

కమల ఎన్నో పుస్తకాలు చదు వుతూ వుంటుంది. ఉత్త చదవటం కాదు. స్టడీ చేస్తుంది. పుస్తకాల నుంచి ఎన్నో విషయాలు తెలుసు కుంటుంది. పుస్తకాల విజ్ఞానాన్ని జీవితానికి అన్వయించుకోవాలని ప్రయత్నిస్తుంది. అలాంటి ప్రయ త్నాలలో ఒకటి – పిల్లల పెంపకం కూడా.

పిల్లల్ని క్రమశిక్షణతోనూ, మంచి అలవాట్లతోనూ పెంచాలన్నది కమల తపన.

స్వతహాగా పిల్లలు తల్లిదండ్రుల్ని విశ్వసిస్తారు. గౌరవిస్తారు, ఏం చెప్పినా వింటారు. కాస్త శిక్షణతో చెప్తే భయంతోనైనా వింటారు. కానీ అలాంటి భయా లతో – ఆజ్ఞలతో లొంగదీసే అవ సరం రానివ్వనే కూడదు.

కమల నిరంకుశత్వం పాటించ కుండా సామరస్యంగా ఆ యింట్లో ఏదీ జరగదు. వీధిలోకి ఏ చిరు తిళ్ళేనా అమ్మొస్తే బియ్యంపోసి కొంటుంది శేషమ్మ— 'పిల్లాడి చేతిలో కొంచెం కొసరు పెట్ట వయ్యా!' అంటూ వాడితో నానా హైరానాపడి – నాలుగు మరమ రాలో – సెనగబద్దలో కొసర్లు పెట్టి స్తుంది. నాయనమ్మ ఓ వైపు బేరం చేస్తోండగా – రామం అమ్మకునే వాడి బుట్టమీదికి ఎగబడ్డం చాలా సార్లు మూసిందికమల. ఆవిషయంలో కొడుకునీ అత్తగార్నికూడా అనేక సార్లు హెచ్చరించిందికూడాను.

వెయ్యిళ్ళ పూజారిలాగా ఇళ్ళ ట్టుకు తిరిగే శేషమ్మ – తనొక్కతీ తిరిగి రాక అప్పుడప్పుడు మనవణ్ణి వెంటేసుకు పోతుంది. తిరిగి తిరిగి వచ్చి తెగ విసుక్కొంటుంది—' బుద్ధిగడ్డితిని తీసుకు వెళ్ళాను. కోతి వెధవ! వాళ్ళ కుర్చీలూ మంచాలూ తొక్కటం – రేడియో తిప్పటం – పెన్నుతీసి బరకటం – పుస్తకాలు చించటం – ఎన్ని చెయ్యాలో అన్నీ చేశాడు.'

కొత్త చీటీలు

10000
నెలకి రూ 200
50 నెలలు

1000
నెలకి రూ 20
50 నెలలు

5000
నెలకి రూ 100
50 నెలలు

1250
నెలకి రూ 50
25 నెలలు

2500
నెలకి రూ 50
50 నెలలు

750
నెలకి రూ 30
25 నెలలు

1500
నెలకి రూ 30
50 నెలలు

500
నెలకి రూ 20
25 నెలలు

మార్గదర్శి
చిట్ ఫండ్ ప్రయివేట్ లిమిటెడ్
అబిడ్ సెంటర్ హైదరాబాద్
ఫోన్: 46225.

నిజానికి ఎప్పుడేనా రామం తల్లితో వెళ్తే గిసినగీటు దాటకుండా వింటుంటాడు. నాయనమ్మతో వెళ్లినప్పుడే భాగోతం చేస్తాడు. ఓసారి రామం ఇంటికి వస్తూ ఎవరిదో చందనంబొమ్మ తీసుకు వచ్చాడు.

కమల అడగకుండానే శేషమ్మ సంజాయిషీ చెప్పింది— "అది పట్టుకువదలనని పేచీ పెట్టాడే! పోనీలే తర్వాత పంపిస్తానని చెప్పి తెచ్చుకోమన్నాను."

కమలకి పుట్టెడు కోపంవచ్చింది.

"నిజంగా నా పిల్లాణ్ణి చూసుకుని నేను సిగ్గుతో చితికి పోవాలి. నా ఆలోచనలన్నీ బొత్తిగా అధ్వాన్నం అయిపోతున్నాయి.

పిల్లలు ఎదటి వాళ్ళని బట్టే ప్రవర్తిస్తూ వుంటారు. వాడిని అదలించగలిగే శక్తిలేదు మీకు. ఎక్కడికి తీసికెళ్ళొద్దని లక్షసార్లు చెప్పాను అయినా నేను మాత్రం వాడివెంట వెంట తిరగ్గలనా? ఎక్కడ వున్నా— ఎవరి దగ్గర వున్నా — లక్షణంగా వుండాలి పిల్లలు. అందుకే నేనంటాను. పిల్లలకి మంచి అలవాట్లు రావాలీ అంటే యింట్లో పెద్ద వాళ్ళంతా ఒక్క మాటమీద వుండాలని." అంటూ కొడుకు చేతిలో బొమ్మ వూడలాక్కుంది— "పరాయివాళ్ళ యింటికి వెళ్ళినప్పుడు వాళ్ళ వస్తువులు ముట్టుకోవటం ఏమిటి? ఇంటికి తీసుకు రావటం ఏమిటి?" అంటూ కొడుక్కేసి కళ్ళెర్రజేసి చూసింది.

"నాయనమ్మ తెచ్చుకోమంది" అన్నాడు రామం.

"ఓరి కోతి వెధవా! నువ్వే చేత్తో పట్టుకు గునుస్తోంటే తెచ్చుకోమన్నాను." శేషమ్మ విరుచుకు పడింది.

"ఏ పని చెయ్యాలో — ఏ పని చెయ్యకూడదో తెలిసే వయస్సు కాదు వాడికి. తెలిసిన వాళ్ళం మనం ఖచ్చితంగా చెప్పాలి. ఆ బొమ్మ తేవటానికి వీల్లేదని మీరంటే వాడెలా తేగలడు?"

"చివరికి తప్పంతా నామీదికేగా తోస్తావు?" అంటూ జగడానికి దిగింది శేషమ్మ.

నువ్వీసారి ఆవిడతో ఇళ్ళట్టుకు తిరిగినట్టు నాకు తెలిస్తే వూరుకోను." అంటూ వార్నింగు యిచ్చి భయపెట్టింది కమల,

ముసలాయన కాఫీ తాగినా, మజ్జిగ తాగినా, ఆఖరికి మంచినీళ్ళు తాగినా, గ్లాసులో కాసిన్ని మిగిల్చి- "ఒరే! రావుడూ! ఇంద." అంటూ మనవడికి అందిస్తూంటాడు. ఖంగు ఖంగున దగ్గుకొన్నప్పుడు కూడా ఆ యివ్వటం మానడు.

"చిన్నపిల్లాడప్పుడేదో అయింది. పిల్లలు పెద్దవాళ్ళవుతోన్న కొద్దీ ఎంగిళ్ళు తినటం మాన్పించెయ్యాలి." అందోసారి కమల.

శేషమ్మ బుగ్గలు నొక్కుకుంది—తాతకి మనవడికి ఎంగిలేమిటే చోద్యం? గిట్టక పోతే ఎన్నయినా అంటావు' అంది.

అత్తగారి నిష్ఠూరాలకేం జడియ లేదు కమల. చాటుచాటుగా రామానికి చాలా విధాల చెప్పి చూసింది. తల్లి చెప్పిన గుణపాఠమంతా మర్చిపోయి తీరా తాతగారు అందించే ఎంగిలి కాఫీ చుక్కలకోసం ఎగబడే కొడుకుని చూస్తే మాత్రం అంతులేని కోపం వచ్చేది. అంతా ఒక్క మాటమీద వుంది—'నువ్వు ఎంగిలి తాగకూడదు బాబూ!' అని తాతగారు కూడా అంటే రామం ఏనాడో ఆ మంచి అలవాటు ఒంటపట్టించుకునేవాడు.

ఓ రోజు వాడు. హఠాత్తుగా తాతగారు అందించిన ఎంగిలి మజ్జిగ వాకిట్లో పారబోసి నవ్వటం మొదలు పెట్టాడు'—ఎంగిలి తాగితే జబ్బు చేస్తుందిట. మా మేష్టారు చెప్పారు తాతయ్యా! నువ్వు దగ్గుతూ తాగి నాకు ఎంగిలి యిచ్చావు కదూ? ఛీ!' అంటూ మొహం చిట్లించుకున్నాడు.

కమల సంభ్రమంగా చూసింది. తను చెప్పి నమ్మించలేని విషయం—బళ్ళో మాష్టారు చెప్తే గాఢంగా నమ్మి ఆచరించాడు రామం.

'చూశావా? ఎలాగో వాడికి నూరిపోసింది. లేకపోతే చిన్న వెధవకి ఎంగిలీ సంగిలీ ఏం తెలుస్తాయ్?' అంటోన్న మామగారి మాటలు విని కూడా పట్టించుకోకుండా గబగబా రామం మాష్టారికో చీటీ రాసింది — 'మా రామం మీ శిక్షణవల్ల చాలా మంచి అలవాట్లు నేర్చుకున్నాడు మాష్టారూ! మా వాడికి మీరు గురువుగా వున్నారన్న ధైర్యంతో ఇక నేను వాడి విషయంలో నిశ్చింతగా వుండచ్చనుకుంటున్నాను.' అంటూ తన కృతజ్ఞతలు వెల్లడించింది.

చీటికి మాటికీ మనవడికి చిల్లర డబ్బు లిస్తూంటాడు ముసలాయన. అలా ఇవ్వకూడదని కోడలు చెప్పింది కాబట్టే ఆయన యివ్వటం మానడు. ఎన్నోసార్లు రామం డబ్బులు పెట్టి నానాగడ్డీ కొనుక్కు తిన్న వుదంతాలు కమలకి తెలియనే తెలియవు. మనవడు తల్లి మాట విని తల్లికి చేరికై పోతాడేమో నన్నదే ముసలాయన బెంగ.

ఓ రోజు మధ్యాన్నంవేళ అనసూయ రెండేళ్ళ కూతుర్ని వెంటబెట్టుకొని వచ్చింది కాలక్షేపానికి. మాటల మధ్య శేషమ్మ మనవడికి అనసూయ కూతుర్ని చూపిస్తూ—'దాన్ని పెళ్ళి చేసుకుంటావుట్రా? ఎంచక్కా బొద్దుగా తెల్లగా వుంది' అంటూ అడగటం మొదలెట్టింది.


రామం పెళ్ళంటే ఏమిటో తెలిసిపోయిన వాడిలాగా సిగ్గుతో మెలికలు తిరిగిపోయాడు.

ఎవరింటికి తీసికెళ్ళినా — ఏ ఆడపిల్ల కనిపించినా, ఆఖరికి సినిమా బొమ్మల్ని చూపించి కూడా—'దీన్ని పెళ్ళాడతావుట్రా? దాన్ని పెళ్ళాడతావుట్రా?' అని నాయనమ్మ అడగటం—రామం సిగ్గు పడిపోవటం పరిపాటే.

'ఎందుకురా అలా సిగ్గు పడిపోతావు? నీ పెళ్ళాం ఏ సిగ్గూ లేకుండా ఎలా కూర్చుందో చూడు. ఎంచక్కా మీ అత్తగారు పదివేల రూపాయలు కట్నం యిస్తుంది. మోటారు సైకిలు కొనిపెడుతుంది, వాచీ, రేడియో — సరే సరి! ఎక్కడో అక్కడ మంచి వుద్యోగం కూడా యిప్పిస్తుంది మీ మావగారు అన్నీ తెలిసిన వాడులే' అంటూ శేషమ్మ సాగిస్తోన్న ధోరణికి అనసూయ నవ్వటం—కమలకి చెడ్డ అసహ్యం కల్గించింది.

'రామం! ఇటురా!' అంటూ కొడుకుని తన దగ్గిరికి పిల్చింది.

'ఆ పాప నీకు చెల్లెలవుతుంది తెలుసా? పెళ్ళాం అనకూడదు. పెట్టు! చెల్లీ అని పిలు. చక్కగా ఆడుకోండి' అంటూ అనునయంగా చెప్పింది.



అడపిల్ల తల్లి అనసూయకి మహా అవమానం జరిగిపోయింది. మొహం ముడుచుకుని, వచ్చీ రానీ నవ్వు నవ్వుతూ—'నీ కంటి అయిష్టం ఎందుకులే కమలా! పిన్నిగారేదో హాస్యానికి అన్నారు. అప్పుడే నీ కొడుక్కి నా కూతుర్ని అంటగట్టబోయానా? అది బతికి బట్టకట్టాలి గానీ ఆ మాత్రం మొగుడు రాకపోడు.' అనేసింది హాస్యధోరణితోనే.

కమల తెల్లబోయింది-'అదేమిటి అనసూయా? నువ్వంత కష్టం పెట్టుకుని మాట్లాడుతున్నావేమిటి?

అత్తయ్య అస్తమానూ మా వాడికి పెళ్ళిళ్ళ కబుర్లూ — పెళ్ళాం కబుర్లూ చెప్తూ వుంటారు. పెళ్ళాం పెళ్ళి అక్కర్లేకుండా వుండిపోతాడని నే ననటంలేదు. పెళ్ళంటే ఒక పవిత్రమైన భావానికి బదులు చౌకబారు ఆలోచనలు రేగేలాగా మనం చేయవచ్చునా? ఈ వయసులో వాడికి తన తోటి పిల్లల్ని చూస్తే సోదర ప్రేమ కల్గాలిగానీ, ఆడపిల్ల కంట పడేసరికి అది పెళ్ళి చేసుకోటానికి పనికి వస్తుందని అనిపించ వచ్చునా?

కట్నాలూ కానుకలూ — పెట్టుబడాలూ—వుద్యోగాలూ అంటూ ఇంత పసిడితనం నుంచీ వాళ్ళ బుర్రల కెక్కిస్తే వాళ్ళ కిక నీతి నిజాయితీ లెలా అలవడతాయి? అయాచితంగా ఎవరైనా ఇస్తే వాటిని పోగుచేసుకోవాలన్న మనస్తత్వం పెంచుకుంటారు. కష్టపడి సంపాదించుకో గలనన్న ఆత్మవిశ్వాసం వుండనే వుండదు — ఈ మాటలన్నీ మా అత్తయ్యతో అంటూనే వుంటాను. కావాలంటే అడిగి చూడు. అంతేగాని నీ కూతుర్ని నా కొడుక్కి చేసుకోటానికి నా యిష్టం ఏమిటి మధ్య? వాళ్ళకా వయస్సులు రావాలి. దానికి నచ్చాలి—వాడికి నచ్చాలి. ఇప్పుడు మనం వాళ్ళ పెళ్ళి గురించి దెబ్బలాడుకోవటం ఏమిటి?' అంటూ నవ్వింది కమల.

ఆ మాటలన్నీ అనసూయకి మాత్రం నమ్మ దగ్గవిగా తోచలేదు-'మనవాళ్ళు చిన్నప్పుడు ఎన్నెన్నో అనుకునేవాళ్ళు. మనం పాడై పోయామా?' అంటూ రాగం తీసింది — మహా బాగుపడిపోయిన దానిలా.

కమల వూరుకుంది — మాటలు పెంచలేదు.

సాయంత్రం అన్నాలవేళ రాముడు పేచీ పెట్టాడు—అప్పడం కావాలని.

'ఇంట్లో అప్పడాలు లేవురా!' అంది కమల.

'ఊహూ! నాకు అప్పడం కావాలి లేకపోతే అన్నం తినను.'

కమలకి నవ్వొచ్చింది—'బావుంది

నీ పేచీ! మేమంతా తింటాంకదా? నువ్వూ అలా తినాలిగానీ — లేని వస్తువు తెమ్మంటే ఇప్పటి కిప్పుడెలా వస్తుంది?'

'పోనీ నే నలా శెట్టి దుకాణం మీదికి వెళ్ళి తెస్తాను. వేయించి యిద్దుగాని. వాడి కప్పుడే భోజనం పెట్టకు.' అంటూ లేచాడు తాత గారు.

కమల వారించింది—'మీ వరస యింకా బావుంది. వాడెంత అంటే అంతేనా? ఇవ్వాళ అప్పడం అడిగాడు. రేపు అర్ధరాత్రి లేచి కూర్చుని మరేదో అడుగుతాడు. కాలమంతా వాడికి అనుకూలంగా నడుస్తుందా? ఎంత చిన్న వాళ్ళకైనా కాస్త కష్టం సుఖం తెలియాలి. అయిష్టమైనా కొంచెం సమర్థించుకోవాలి. ఉన్నంతలో సంతృప్తి పడటం అలవాటు చేసుకోవాలి. అవి అర్థమయ్యేలా వాడికి చెప్పాలిగానీ...'


'ఏదో చంటి వెధవ! అడిగాడు...' గొణుక్కున్నాడు తాత గారు.

కమల రామానికి నచ్చజెప్పి అప్పడంలేని పప్పుచారుతో అన్నం తినిపించింది.

• • •

ప్రేమ రెండేళ్ళపాటు అమ్మమ్మ గారింట్లోనే వుండిపోయింది.

కమల తల్లిదండ్రులు స్వంత



బిడ్డల విషయంలో ఎన్ని పద్ధతులు పాటించి పెంచినా మనవరాలి విషయం వచ్చేసరికి మాత్రం ఏనిబంధనలూ విధించలేని పరిస్థితికి వచ్చారు.

ప్రేమ ఆడింది ఆటా! పాడింది పాటా! అమ్మమ్మ దగ్గరా—తాతయ్య దగ్గరా ముద్దు ఎక్కువైంది. గారం ఎక్కువైంది. నాలుగు సంవత్సరాల పిల్లకి అలవడాల్సిన శిక్షణ ప్రేమకి అలవడలేదు. ఆ సస్తమానం మారాం పెట్టి ఏడవటం – చెప్పినమాట వినక పోవటం... కూతురి లక్షణాలు కమలకి నచ్చలేదు.

పుట్టింటికి వెళ్ళిన కమల—పరిస్థితి అంతా అర్థం చేసుకుని — తల్లిదండ్రులు చేస్తోన్న గారానికి విసుక్కుని కూతుర్ని తనతో తీసుకు వచ్చేసింది

ప్రేమ రాక ఇంట్లో కొత్త చికాకులు తెచ్చిపెట్టింది. అమ్మమ్మ దగ్గర బాగా అలవాటు పడిన ప్రేమ చాలాసార్లు బిక్క మొహంతో నాయనమ్మ దగ్గిరికి వెళ్ళబోయింది.

శేషమ్మ చిన్నపిల్లని దగ్గిరికైనా తియ్యకుండా — 'ఏవుందమ్మా మా దగ్గిర? నగలా? నాణ్యాలా? ఈ శేషమ్మ దగ్గర ఏవుందని వచ్చావూ?' అనటం సాగించింది.

చంటిపిల్ల నగలకోసం—నాణ్యాల కోసం వస్తుందా? ఆ మాటలు దాన్ని వుద్దేశించి అన్నవేనా?

బిక్కమొహంతో నించున్న పిల్లని తాతగారైనా దగ్గిరికి పిలవటం చూడలేదు కమల. ఆయన అభిమానమంతా ఒక్క రాముం మీదనే 'ఒరే రావుడూ! నువ్విలా నా దగ్గిర కూర్చో! ఓ కబురు చెప్తాను' అంటూ వాణ్ణి పిల్చి కూర్చోబెట్టుకుంటాడు.

ప్రేమ పిలవని పేరంటంలాగా వాళ్ళ దగ్గిరికి వెళ్ళి— 'తాతయ్యా! నన్నూ మంచం ఎక్కించవా?' అంటే—'నువ్వెందుకే ఇక్కడ? వెళ్ళు. మీ అమ్మదగ్గిరికి వెళ్ళు' అని కసిరేస్తాడు ముసలాయన. ప్రేమ వెక్కి వెక్కి ఏడుస్తూ తల్లి దగ్గిరికి వచ్చేస్తుంది— 'అమ్మా! ...నన్ను... తాతయ్య ...తిట్టాడే' అని బావురుమంటుంది.

'ఛీ! నిన్ను తిట్టడం ఏమిటి? ఊరుకో. నే నడుగుతాలే' అంటూ వూరుకోబెడుతుంది కమల.

ప్రేమకి తండ్రిదగ్గిర కూడా బొత్తిగా చనువులేదు. తండ్రి ఎప్పుడైనా కూతుర్ని ఎత్తుకుంటే చంటివెధవ వూరుకోడు. కాళ్ళు చుట్టుకు పోయి కిందపడి దొర్లి ఏడుస్తాడు. వాడేడిస్తే మధుమూర్తి సహించలేడు. అక్కడితో ప్రేమని దించేసి చంటివాణ్ణి ఎత్తుకుంటాడు.

తండ్రి చేతుల్లోంచి దిగిపోయిన ప్రేమ సామ్రాజ్యాన్ని కోల్పోయినట్టు బిక్కమొహం వేసుకుని ఓ మూల కూర్చుంటుంది.

'అది చూడండి. ఎంత దీనంగా కూర్చుందో!'

'మరేం చెయ్యను? చంటివెధవ ఏడుస్తోంటే?'

'వాణ్ణి నేను ఎత్తుకునేవాన్నిగా? వూహా తెలిసిన పిల్లల్ని-అలా నిరసన చేసి–వాళ్ళ కళ్ళెదుటే మరొకళ్ళని గొప్పచేస్తే ఆ అవమానం వాళ్ళు భరించలేరు. ప్రేమని కూడా దగ్గిరికి పిల్చి బుజ్జగించండి.'

'పెద్ద సైకాలజిస్టులా మాట్లాడుతావు' అంటాడు మూర్తి హాస్యంగా.

కమల ఎంత ప్రయత్నించినా ప్రేమని ఇంట్లో అందరితోటీ కలివిడిగా కలపాలన్న ఆలోచన వ్యర్థమై పోసాగింది.

ఓసారి ఆఫీసునుంచి యింటికి వస్తూ మిఠాయిపొట్లాం తెచ్చాడు మూర్తి. ఎదురు వచ్చిన రాము చేతిలో పెట్టాడు.

'నాన్నా! నాకూ యియ్యవ్?' అంది ప్రేమ

'ఒరే రామూ! దానికి పెట్టు, ఒక్కడివే తినెయ్యకసుమీ!' అనేసి బట్టలు మార్చుకోటానికి గదిలోకి వెళ్ళబోయాడు

'ఒరే మూర్తీ!' పిల్చింది శేషమ్మ నవ్వుతూ.

'ఎందుకమ్మా?'

'చంటివెధవ మధ్యాహ్నం ఎన్ని కబుర్లు చెప్పాడనుకున్నావ్?— 'నాన్నేలీ? నాన్నేలీ?' అంటూ వాళ్ళవ్వ ప్రాణాలు తోడేశాడనుకో. కాస్సేపు కూనిరాగాలు తీశాడు. కాస్సేపు గంతులేస్తూ డాన్స్ చేశాడు. నవ్వలేక చచ్చాం' అంటూ సంబరంగా సమాచారమంతా కొడుకు చెవిన వేసేసింది - మెప్పుకోసం.

ముద్దుల కొడుకు చేష్టలు ముచ్చటగా భర్తతో చెప్దామనుకొంది కమల.

ఇక వాణ్ణి గురించి ముచ్చటించుకోటానికి తల్లిదండ్రులకేం విశేషాలు మిగిలాయీ?

ఆలోచనలోపడి అలాగే నించుంది కమల. రాము తండ్రి యిచ్చిన మిఠాయి పొట్లాం అంతా తన చేతిలో వుంచుకుని రెండు పలుకులు మాత్రం ప్రేమ చేతిలో పెట్టాడు. అది కోపం వచ్చి వాటిని విసిరేసి ఘొల్లుమంటూ రాగం మొదలు పెట్టింది.




కమల గబగబా వెళ్ళి సంగతంతా తెలుసుకొంది. మామగారి పక్కలో కెళ్ళి కూర్చున్న కొడుకుని — 'ఒరేయ్! ఇలారా! అదంతా నీ కొక్కడికే అనుకున్నావా?' అంటూ కోపంగా పిల్చింది.

ముసలాయన కలగ జేసుకుని— 'దానికి పెట్టాడు కదుటే? వాడితో దానికి పంతా ఏమిటి?' అన్నాడు.

కమల ఆయనకేసి చూడనైనా చూడకుండా కొడుకు చేతిలో పొట్లాం వూడలాక్కుని — రెండు కాయితాల్లో పోసి పిల్ల లిద్దరికీ యిచ్చింది—'నాన్న ఏం తెచ్చినా మీ రిద్దరూ కలిసి తీసుకోవాలి. ప్రేమ ఎవరో కాదు. నీ చెల్లెలే. తెలిసిందా? చెల్లి నువ్వూ ప్రేమగా వుండాలి.' అంటూ అనునయంగా చెప్పింది కొడుక్కి.

చెల్లెలు రాకముందు యింట్లో ఏకచ్ఛత్రాధిపత్యం చేసే వాడు రామం. ముఖ్యంగా చెల్లెలికి తిండిలో వాటా పెట్టటం వాడి కేమంత నచ్చలేదు. కాని తల్లి భయంతో కిక్కురు మనకుండా వూరుకోవటం తప్ప చేయగలిగిం దేమీ లేదు.

పిల్లలు స్వతహాగా ధర్మ బుద్ధి



తోటీ—విశాల గుణంతోటీ వుండరు. ఎవళ్ళకి అందింది వాళ్ళే అనెయ్యాలన్న కోరికా—మంచివన్నీ తమకే కావాలన్న స్వార్థం అతిగా వుంటాయి. వాళ్ళ వయస్సు కది అపరాధం కాదు. ఏది మంచో ఏది చెడో తెలుసుకో గలిగే శక్తి వాళ్ళకి వుండదు. అయితే అన్నీ ఆలోచించ గలిగే పెద్దవాళ్ళు నెయానో భయానో చెప్పి పిల్లల్లో వుండే చెడ్డ తనాన్ని క్రమంగా తగ్గిస్తూ వుండాలి.

ఆ యింట్లో పెద్దవాళ్ళకి ఆ ఆలోచనే వున్నట్టు తోచదు—కమలకి.

రామాయణంలో పిడకల వేట లాగా శేషమ్మ ఓన్న తగువు తెచ్చి పెట్టింది — 'మామగారి పేరు పెట్టి పిల్లాణ్ణి అరే ఒరే అని పిలుస్తావేం? అలా కూడదని నేను చెప్తున్నాను కానూ? అంత మాత్రం మన్ననలేని భాగ్యానికి పెద్దాయన పేరు పెట్టుకొటందేనికి?' అంటూ పాత పాయింటే ఎత్తింది. శేషమ్మ చాలా సార్లు ఆ విషయంలో కోడల్ని విమర్శిస్తూ గొణుక్కుంటూనే వుంటుంది. అత్తగారు ఇలా నిలదీసి అడిగే సరికి కమల వూరుకోలేదు—'పేరు పెట్టడానికి పిలవడానికి సంబంధం ఏమిటి? నా కన్నబిడ్డని నేను మన్నించుకోవాల్సిన ఖర్మ వింటి? పరాయి అమ్మ కన్నదాన్నే మీరంతా అనే - ఒసే అంటోంటే లేని తప్పు నా పిల్లాణ్ణి నేను పిల్చుకుంటేనేనా మీకు దొరికింది? అయినా వాడిపేరు మీ భర్తగారి పేరేగా? ఏ మాత్రం మన్నిస్తున్నారో నాకు తెలీదూ?'—నాలుగు ముక్కలూ అడిగేసింది కమల.

మధుమూర్తి తనకేం పట్టనట్టు పేపర్లో మొహం దూర్చేసుకున్నాడు. కమల చెప్పిన జవాబుకి నిజంగా లోలోపల నవ్వుకున్నాడు కూడాను!

• • •

ఓసారి — రామం బళ్ళోంచి వస్తూ మూడు చక్రాల సైకిల్ మీద ప్రేమ కూర్చుని వుండటం చూసి చేతిలో పలకా వస్తా విసిరేసి - సైకిల్ మీదను చే ప్రేమని తోసేసి- దాన్ని తన స్వాధీనం చేసుకున్నాడు. కింద పడ్డ ప్రేమ బావురుమని ఏడుస్తూ లేచి నించుంది.

కమల గబగబా వచ్చింది. రామం దురుసు తనానికి కోపం వచ్చినా అణుచుకొంటూ—

"ఎందుకురా దాన్నలా తోశేశావు?" అంది.

రామం తొణకలేదు— "నా సైకిల్ మీద ఎందుకెక్కిందేమిటి?" అన్నాడు.

(సశేషం)

పోరీ శాంతిమియా వీరా?

"వివేకమ్"

ఎవరన్నారో, ఎందుకన్నారో తెలీదుగానీ, ఇలా నోరు నెప్పి జేసి దవళు, వాచేలా — అనగా అనగా ఒకరాజు; అప్పుడే నాయంత్రాన్ని సాగనంపేసిన ఒకరోజు ప్రశాంతాన్ని చల్లగాను ప్రేమికుల్ని వేడిగానూ పరిపాలించడం ప్రారంభించేరు. ఆ రాజుగారి చూపులు విస్తృతంగా విస్తరించి, విశాలంగా విలాసంగా వున్నాయి అది విశాఖపట్నంలో 'లాసన్సు బే' తీరంలో వున్న శాంతి ఆశ్రమంలోకి కూడా చొచ్చుకుని, అక్కడ ఏపుగా పెరిగిన సరుగుడు చెట్లని వొరుసుకుంటూ వచ్చి నేలమీదికి జారేయి అప్పుడా చెట్లమధ్య ఓ చెట్టు నానుకుని ఠీవిగా రాజాలా కూర్చున్న సారధి కూడా ఆ రాజులాగే ఎంతో అందంగా వున్నాడు.

ఆ రాజు నెలరాజు.

ఆ రోజు పున్నమిరోజు.

ఆ చూపులు వెన్నెల తూపులు.

ఆ సారధి మెడికల్ కాలేజీలో ట్యూటరు.

ప్రస్తుతం శాంతి ఆశ్రమంలో సరుగుడు చెట్టుక్రింద కూర్చున్న సారధి చేతుల్లో ఒక అందమైన మాసపత్రిక వుంది.

శ్రద్ధగా అందులో సీరియల్ చదువుకుందామని సాయంత్రం అయిదింటికల్లా సారధి ఇక్కడికి వచ్చేడు. కాని సీరియల్ సగం చదివేసరికి సారధికి ఎంత ప్రయత్నించినా ఒక్క అక్షరం కూడా ముందుకి సాగలేదు కారణం ఆ పేజీలో హఠాత్తుగా హీరోయిన్ బొమ్మ మరణించింది. సారధికి వెంటనే తన బొమ్మ గుర్తుకొచ్చింది. చేతిలో పుస్తకం మూసి, గతంలోకి జరిగి సారధి తన బొమ్మ గురించి చాలా సేపు ఆలోచించేడు. సంధ్య గడిచేవరకూ ఆలోచించేడు. కాస్సేపు సారధి కంటిముందు బొమ్మ బింబం తొణికిసలాడింది. చుట్టూరా వెన్నెల బొమ్మ ధరించే తెల్ల పట్టుబట్టలా కనబడింది. తలెత్తి చూస్తే చందమామలో బొమ్మ— పూజచేసుకొచ్చి పూజ్యగాంధీలా నవ్వుతూ నిలబడింది. ఆకాశంలో

నక్షత్రాలు బొమ్మ చేసుకునే వత్తుల్లా మెరిసేయి. ఒక్కసారి కళ్ళు చెమర్చిన సారధి తనకు తనే బరువుగా బాధగా 'బొమ్మా!' అనుకున్నాడు. 'భగవాన్!' ఎంతలో ఎంత మార్పు జరిగెను! కాల చక్రము కారు చక్రమువలె తిరిగెను కదా!' అని కూడా అనుకున్నాడు.

నాలుగేళ్ళ క్రితం వరకూ బొమ్మ చేతుల్లో పెరిగిన సారధి మనస్సు చాలా పొదుపుగా పని చేసి, అతన్ని చాలా అదుపులో వుంచింది. అందుచేత అతనెక్కడా పరీక్ష ఫేలవకుండా, ఎంచక్కా ఏ రోజు పాఠం ఆ రోజు చదువుకుని, ఏ రోజు గడ్డం ఆ రోజు గీసుకుని చకచకా డాక్టరయ్యేడు. అలా బొమ్మ హయాంలో ప్రపంచానికి పాతికేళ్ళు పాతబడిన పార్థసారధి చాలా మందికి మడిగట్టుకున్న వడి సారథిలా కనిపించేవాడు. సారధి బొమ్మ అతన్నెంతో క్రమశిక్షణలో పెంచింది. రోజూ పొద్దున్నే చద్దన్నం తినిపించి అతన్ని మెడికల్ కాలేజీకి పంపేది. సాయంత్రం అతని రాకకి గంటముందే వీధి గుమ్మంలో కూర్చుని, వొత్తులు చేసుకుని అవి కళ్ళల్లో వేసుకుని ఎదురుచూసేది. కాని యిదంతా నాలుగేళ్ళ క్రితం వరకే సాగింది. ఆ తర్వాత సారధి వొంటరివాడై పోయాడు అతనికిప్పుడు బొమ్మ లేదు. సరిగ్గా నాలుగేళ్ళ క్రితం తనూ, బొమ్మా వొకేసారి ప్యాసై పోయేరు — తను యం. బి. బి. యస్సూ, బొమ్మ జీవితమూ. సారధిలో ఆ క్షణం నుంచీ గుర్తించదగ్గ మార్పులెన్నో వచ్చేయి. మడి సారధి మడి ఆనాడే మబ్బులా విడిపోయింది. క్రమశిక్షణ పోయింది. అతని మనస్సు పరిధులు దాటి పరిపరి విధాల పోయింది. ఎన్నో పరదాలకేసి పోయింది. ఎన్నో కోరికలకేసి పోయింది. అవును మరి— బొమ్మ పోయింది.

ఆ తకాలం కాల్టెక్స్ కంపెనీలో వుద్యోగం చేసినట్టున్న సారధికి కలెక్టరాఫీసులో కొత్త వుద్యోగం దొరికినట్టయింది బొమ్మ ఆసరాగా వున్నంతకాలం అతనికి ఏ వెలితి కనిపించలేదు. కాని బొమ్మతో ఆసరాలన్నీ పోయినట్టయి, సారధికి జీవితంలో వెలితి అంటే ఏమిటో తెలిసింది. ఎవరేనా మంచి నేస్తం, తన జీవితంలో కాలు మోపి, అంత వరకూ ఆసరాగా నిలిస్తే బావుణ్ణనిపించిందతనికి. అప్పట్నుంచే అతనిలో క్రమంగా మార్పు వచ్చింది. నాలుగేళ్ళలో పార్థసారధి ఎంతగానో మారేడు. అతని మార్పు చెడ్డదనీ చెప్పలేం — మంచిదనీ చెప్పలేం. అదొక చిత్రమైన మార్పు. ఎప్పుడూ క్లాసు పుస్తకాలు తప్ప మరే యితర పుస్తకం ఎరుగని

సారధి గొప్ప ఆధునిక తెలుగు సాహిత్య పిపాసిగా మారేడు. ఇప్పుడతను చదవని తెలుగు నవల గాని, కథగానీ ఏదీ లేదు. చంద్రుడి కోసం చాతక పక్షిలా నెలనెలా, వారం వారం పత్రికలకోసం ఎదురు చూసి చదివిన సారధికి కొన్ని సీరియల్ నవలలు కంఠోపాఠంగా వచ్చు.

ఇటీవలే సారధికి తను ఎంతగానో యిష్టపడిన ఒక సీరియల్ నవల్లో హీరోలా తయారవాలనే కోరిక కలిగింది. అందుచేత అతనీ మధ్య ప్రతిరోజూ కొంతసేపు చిత్రలేఖనం ప్రాక్టీసు చెయ్యడానికీ, కొంతసేపు ఫిడేలు వాయించటానికీ, కొంతసేపు గొంతెత్తి పాడటానికి కేటాయించుకొని దీక్షగా సాధన చేస్తున్నాడు. ఏదో వొకనాడు తన సాధన ఫలించి సాధనాలాంటి అమ్మా యెవరైనా తన్ను వలచి వరించక పోతుందా అని సారధి ఉద్దేశం.


సరుగుడు తోపుకి దూరంగా యిసుకలో నడుస్తూ జాలరి వాడెవడో కూనిరాగం తీసుకుంటూ పోతున్నాడు. వాణ్ని చూసేసరికి చల్లగాలీ, సముద్రమూ - సమయమూ అన్నీ కలిసి 'పాడ' మని తన్ను ఆదేపనిగా బలవంతం చేస్తున్నట్టు ఫీలయ్యేడు. ఒక్కసారి చుట్టూ చూసేడు. పాట పాడేందుకు ఇంతకంటే మంచి వాతావరణమూ, మంచి అవకాశమూ ఏం కావాలి గనుక? వినేందుకు నలుగురూ లేక పోయినా, వున్నారనుకునే పాడాలనుకున్నాడు సారధి. గొంతు సరి చేసుకుని ప్రేమగీతం ఒకటి గట్టిగా ఎత్తుకున్నాడు. రెండు చరణాలు పాడగానే అతనికి సరుగుడు చెట్ల మధ్య, పారుతున్న సెలయేటి గలగల వినిపించి, దాహం వేసింది. వెంటనే పాట అపుచేసి లేచి నిలబడ్డాడు. ఎడారిలో సోడాలు దొరికినట్టు ఎంచేతనో యీ శాంతి ఆశ్రమంలో సెలయేరు పుట్టింది. బహుశా తన గాన మాధుర్యానికిక్కడ నాపరాళ్ళు కరిగి వుంటాయి అనుకుంటూ చెట్ల మధ్యకి నడిచేడు. కాని శబ్దాన్ని సమీపించేక సారధికి ఆశ్చర్యం ఎదురైంది. తన పాటు వినేందుకు నలుగురూ లేరనుకున్న సారధికి వెన్నెల నీడలో వేడుకగా నవ్వుతూ ముగ్గురు వ్యక్తులు మసగ్గా కనిపించేరు. సారధికి కోపం వచ్చింది. లేచి నిలబడ్డాడు. వేగంగా అడుగులు వేస్తూ వాళ్ళ దగ్గరికి నడిచేడు. తీరా చూస్తే వాళ్ళెవరో కాదు. తన లేడీ స్టూడెంట్సు— శాంతిప్రియ, శాంతిలత, శాంతిసిరి— వెన్నెల నీడలో కలువరేకుల్లాగున్నారు. సారధి తత్తరపడ్డాడు.

అంతలో శాంతిప్రియ నవ్విన పెదాలు మాట్లాడేయి — 'నిలబడి పోయారేం సార్! కూర్చోండి!'

మళ్ళా ముగ్గురూ గలగలా కిలకిలా సెలయేర్లై నవ్వేరు. సారధి యాంత్రికంగా కూర్చున్నాడు.

'మీరు పాడతారని మా కింత వరకూ తెలియదు సుమండీ?'— శాంతిలత మాట్లాడింది. వాళ్ళు మళ్ళా నవ్వులు విసిరేరు. ఈ మారు సారధి కూడా ఒక వెర్రినవ్వు నవ్వి అడిగాడు—'మీరు విన్నారా?'

మిగిలిన నవ్వుని పెదాల వెనుక



దిగ్తొక్కుకుంటూ ముగ్గురూ అవునన్నట్టు తలలూపేరు.

'బాగా పాడేనా?' సారధి భావంలో అమాయకత కనబడింది.

శాంతి త్రయం మళ్ళీ అవునన్నట్టు తలలు పంకించేరు.

'మరెందుకూ నవ్వేరు?'

ఈ ప్రశ్నకి వాళ్ళ నవ్వులు ద్రుతిమించేయి. ఆ శమమంతా ఆక్రమించేయి.

సారధికి కష్టం తోచింది ఎందుకిలా నవ్వుతారు వీళ్ళు? నవ్వితేనే కెందుకిలా బాధనిపిస్తోంది? అందమైన అమ్మాయిల నవ్వులు కూడా బాధ కలిగిస్తాయా? ఏమిటో — వెన్నెల నీడలా నవ్వుల బాధ! అయినా తనెందుకు బాధపడాలి? వాళ్ళేం



తప్పు చేసేరు?–నవ్వేరంతే. అవును. నవ్వడం, పిల్లల్ని కనడం ఆడవాళ్ళ జన్మహక్కు. వాళ్ళ హక్కుల్ని వాళ్ళు కాపాడుకుంటున్నారంతే. ఈ మాత్రానికి తనెందుకూ బాధ పడటం. ఎదుటివారి హక్కులను గౌరవించుట పౌరునివిధి. కాబట్టి తనిప్పుడు వారి నవ్వులను గౌరవించవలెను — అని ఆలోచించుకుని సారథి వాళ్ళని మెచ్చుకున్నాడు. "మీకు నవ్వడం బాగా వచ్చు."

"బాగా అంటే ?" శాంతి లత.

"అందంగా—"

ఈసారి శాంతిత్రయం నవ్వలేదు. మెరిసే కళ్ళతో సారథని చిత్రంగా చూసేరు. అందమైన ఆడపిల్లలు తనని అలా సూటిగా చూడటం సారథికదే తొలి అనుభవం. క్షణంపాటు చక్రవర్తిలా ఫీలయ్యేడు.

నిజం చెప్పాలొస్తే, సారథికి పాటలు పాడటంరాదు మనస్సులో కోరిక చంపుకోలేక పాడినా, విన్న వాళ్ళకి పాటలమీదే కోరిక చచ్చిపోతుంది. ఏమైనా సారథికి మాత్రం తన పాటమీద గొప్ప నమ్మకం వుంది. కాని, యిప్పుడు శాంతిత్రయం ప్రవర్తన ఆ నమ్మకాన్ని కాస్త సడలించినట్లుయింది. 'నేను బాగా పాడలేదూ భగవాన్!' అనుకున్నాడు. అసలు వీళ్ళక్కడున్నారని తెలిస్తే యింకా బాగా పాడేవాణ్ని, అని కూడా అనుకున్నాడు.

వెన్నెల షికారులన్నా, వేళాకోళాలన్నా శాంతిత్రయానికి బహు సరదా. రెండు క్షణాలపాటు గురువుగారి అందాన్ని తన్మయంగా చూసేక, సారథి అమాయకత్వాన్ని చొరవగా తీసుకున్న శాంతిత్రయం మరింత చనువుగా వేళాకోళానికి దిగేరు.

శాంతిప్రియ అడిగింది—"ఒక్కరే వచ్చారా సార్ ?"

"అవును. పాట పాడుకుందామని..." అతనిలో యిందాకటి అమాయకత యింకా అలాగే తొంగి చూస్తోంది.

సారథి పాట అనేసంకి శాంతిత్రయం మళ్ళీ గొల్లుమన్నారు.

"నవ్వేరంటే అబ్సెంటు మార్కు చేస్తాను." మంచి జోకు వేసేననుకున్నాడు సారథి.

"మీరు బాగా పాడతారే అనుకుంటే, బాగా జోకుతారు కూడానూ ?" శాంతిసిరి అంది.

"నిజంగా పాడుకోడానికే వచ్చారా సార్ ?" శాంతిలత అడిగింది.

సారథి బదులు చెప్పలేదు— ఇందాకే అతను వూహాలోకానికి వెళ్ళాడు. అప్పుడు శాంతిసిరి అతన్ని లోకానికి లాక్కొచ్చి

కూర్చోబెడుతూ గోముగా "ఒక పాట పాడండిసార్!" అని అడిగింది.

"పాటా?" అన్నాడు పార్థసారథి.

"అవును పాటే. పాడండి సార్! వినాలని వుంది."

"పాట కాదు. ముందు నా మాట వినండి."

"ఏమిటి సార్ ?" శాంతిత్రయం చెవులు రిక్కించేరు.

"ఏమీలేదు. నేను పాడానని గాని, పాడతానని గాని మీరు ఎవ్వరితోనూ చెప్పనని ప్రమాణం చెయ్యాలి" సారథి సీరియస్‌గా అడిగేడు.

"బలేవారే–మీరెంతో బాగా పాడగలరని అందరితో చెప్పాలనుంది నాకు" అంది శాంతిలత.

'అడిగారు కాబట్టి అలాగే ప్రమాణం చేస్తాను' అంది శాంతిప్రియ.

"నేను ప్రమాణం చెయ్యను. మీరు ముమ్మాటికీ ఎంతో బాగా పాడతారు. ఇందాక మీ పాట విన్నప్పట్నుంచీ నాకెన్నోసార్లు మీ చేత పాడించుకోవాలనిపిస్తోంది" అంది శాంతిసిరి.

ముగ్గురిలో శాంతిసిరి మాటలు సారథిని ఆకట్టేయి. తన పాటమీద అతనికెంతో నమ్మకం పెరిగింది. ఏదో ధీమా కలిగింది. అప్పుడు సారథి పాట పాడేడు. శాంతి ఆశ్రమంలో అశాంతి మజిలీ చేసినట్లు పాడేడు. అయినా శాంతిత్రయం మాత్రం ప్రశాంతంగా పార్థసారథి పాట విన్నారు. నిజం చెప్పాలొస్తే కేవలం వాళ్ళ చెవులు మాత్రమే పాట విన్నాయి. మిగిలిన ఇంద్రియాలన్నీ ఇంద్రజాలికుడి మాయకి లొంగి పోయినట్లు సారథి స్ఫురద్రూపానికి లొంగిపోయేయి.

సారథి పాట ముగిసేక శాంతిలత, "సార్ ? మీకింత చక్కగా పాడటం వచ్చుగదా! ఏ పార్టీలోనన్నా ఒక్కసారి పాడకూడదూ ?" అనడిగింది.

"ఏదో పార్టీదాకా ఎందుకూ? నేనే కొద్దిరోజుల్లో అందర్నీ పిలిచి ఒక పార్టీ ఏర్పాటుచేసి పాడి వినిపిస్తాను." అని చెప్పి, "అన్నట్టు, వచ్చే మంగళవారం నా బర్త్ డే. నా ప్రోగ్రామ్ ఆ రోజున ఏర్పాటు చేస్తాను. ఆ వాళ తప్పకుండా మీరూ వద్దురుగాని. ఆ రోజు ఒక్క పాటేమిటి, ఫిడేలు కూడా వాయిస్తాను. ఏర్పాట్లన్నీ పూర్తయ్యేక, మీకు యిన్విటేషన్లు పంపిస్తాను" అన్నాడు.

అలా వాళ్ళ మధ్య ఎన్నో కబుర్లు నడిచేక, ఎన్నో క్షణాలు గడిచేక,

శాంతిత్రయానికి సారథి గుడ్‌నైట్ చెప్పేడు.

• • •

ఆ రాత్రి మంచంమీద వెల్లకిలా పడుకొన్న పార్థసారథికి నిద్ర పట్టలేదు. కిటికీలోంచి గుండ్రటి చంద్రుడు 'క్లోజప్‌లో యూల్ బ్రిన్నర్'లా కనిపించేడు. సారథికి సాయంత్రపు క్షణాలు పదే పదే గుర్తుకు వచ్చేయి. ఆ క్షణాలకంటె, ఆ క్షణాల గుర్తులోనే ఆతనికి మధురిమ మరింతగా కనబడుతోంది!— అయితే ప్రేయసితో గడిపిన క్షణాలకంటె, ప్రేయసితో గడిపిన క్షణాల గుర్తు యింకెంత తియ్యగా వుంటుందో! ఏమైనా అనుభవంకంటె ఆలోచన గొప్పది. నిజంగా ఈ రోజు తన జన్మ తరించింది. ఇన్నాళ్లూ వాళ్ళకి పాఠం చెప్పడమే మహాభాగ్యం అనుకుంటున్న తను, ఈ రోజు వాళ్ళకి పాట వినిపించేడు. తను వినిపించడమేమిటి? వాళ్ళే బలవంతపెట్టి తన చేత పాడించుకుని విన్నారు. ఒకరు కాదు, ముగ్గురు అందమైన అప్సరసలు సరసన కూర్చుని కావాలని మరీ విన్నారు. ఆ క్షణం శాంతిప్రియ తన కళ్ళల్లో దీపావళి చూపించింది. శాంతిలత తన చెక్కిలి నీడల్లో సాయంత్రాన్ని సర్దుకొంది. శాంతిసిరి పెదాల్లో "మా సారథి ఎంతో బాగా పాడగలరు" అనే గర్వాన్ని దాచుకుంది. ఎంత బాగా విన్నారు వాళ్లు. వాళ్ళకి వినడంలో కూడా అందమే వుంది. ముగ్గురికి ముగ్గురే. చిత్రమైన కలయిక. మాటల్లో, పేర్లలో, చూపుల్లో, అందంలో, అంతా గమ్మత్తయిన ఏకత్వం— మనస్సుల్లో కూడానేమో. పైగా ఎంత చనువు—తన పాట వినేందుకు ఎంత దగ్గరగా కూర్చున్నారు. పక్షుల్లో నెమలిలా, పువ్వుల్లో గులాబిలా, మానవుల్లో శాంతిత్రయం—యిదేనేమో సృష్టికర్త ప్రత్యేకత. ఇప్పుడు వాళ్లల్లో ఒక్క శాంతి, ఒక్కగానొక్క శాంతి తన్ను ప్రేమిస్తే తనకీ భూమ్మీద మరి కోరికలుండవు. కానీ అది సాధ్యమా? సాధ్యమే అయితే నిజంగా తను చక్రవర్తే! అప్పుడు తను చక్కగా రోజూ తన శాంతిని పక్కన కూర్చోబెట్టుకుని తన కొచ్చిన ప్రేమ గీతాలన్నీ ఫిడేలు వాయించి వినిపించవచ్చు. తల్చుకుంటేనే ఎంత బావున్నాయి తన ప్రేమ క్షణాలు. కాని తన ప్రేమ, ఫిడేలు వాయించడంకోసం అంటే ఎవరూ నమ్మరు—ఇలా కాస్సేపు ఆలోచనలు సాగేక సారథి జ్వరం తగిలినట్టు ఫీలయ్యేడు. ఏదో బలమైన కోరిక తన హృదయం పట్టుకు వ్రేళ్లాడుతున్నట్టుంది. ఏదో తియ్యటి బాధ తనలో నరాల్ని గిజగిజలాడిస్తున్నట్టుంది. అందమైన అమ్మాయిల దగ్గర పాట పాడితే యిలాగే వుంటుందికాబోలు. అయినా తన మస్తిష్కంలో యింకేదో విప్లవం జరుగుతోంది. క్షణక్షణానికి శాంతిత్రయం తన మనస్సుకి మరీ దగ్గరగా వచ్చేస్తున్నారు. ఏమిటో ఈ సుఖంలో కూడా బాధ — ప్రేమంటే యిదేనేమో!

ఈ విధంగా చాలా రాత్రి గడిచే వరకూ సారథి మెదడులో ఎన్నో ఆలోచనలు పుట్టి, శాంతి ఆశ్రమంలో సరుగుడు వృక్షాల్లా — బలంగా, ఏపుగా, అసంఖ్యాకంగా పెరిగేయి. కాని, వృక్షాలు ఆశ్రమం చల్లదనానికి తోడైతే, ఆలోచనలు గుండెల్లో వేడికి తోడయ్యేయి.

క్రమంగా సారథి నిద్రలోకి జారేడు. నిద్రలో అతని ఆలోచనలన్నీ కలలుగామారి అల్లరి చేసేయి. కలలో సారథి, తన శరీరంలో రేగిన విప్లవాన్ని కళ్ళతో చూసేడు. అలా చూసుకొన్నప్పుడు సారథికి, తన గుండె లోపలి గదుల్లో రక్తం కనబడలేదు. కుడి కర్ణికలో శాంతిప్రియ, కుడి జఠరికలో శాంతిలత కూర్చుని వొంట్లో వున్న జీవకణాలన్నిటినుంచి కొత్త వుద్రేకాల్ని, కొత్త కోరికల్ని రాబట్టి—ఎడమ కర్ణికలో కూర్చున్న శాంతిసిరి కిస్తున్నారు. ఆమె వాటినన్నిటినీ కలిపి, చిలికి శుభ్రమైన ప్రేమని తయారు చేసి, ఎడమ జఠరిక నిండా నింపుతోంది. తిరిగి ఎడమ జఠరిక నుండి శుభ్రమైన ప్రేమ—పదునైన వుద్రేకాల్లోనూ, పదునైన కోరికల్లోనూ ప్రవహించి కణకణానికి వ్యాపిస్తోంది. ఇలా ప్రేమ ప్రసరణం జరుగుతున్నప్పుడు పార్థసారథి గుండె 'లబ్ డబ్' అని కొట్టుకోడం మానేసి, 'లవ్ హార్' అని కొట్టుకుంటోంది.

ఈ విధంగా — అవాళ్టి వరకూ శాంతి ఆశ్రమంలా వున్న సారథి గుండె ఆ రాత్రి శాన్ ఫ్రాన్సిస్కోలా మారింది.

• • •

మర్నాడు సారథి రోజూకంటె ఆలస్యంగా లేచేడు. వొళ్ళు బద్ధకంతో బరువెక్కింది. కళ్ళు కలల బరువుతో ఎరుపెక్కేయి. నిలువెల్లా

• "నాన్నా, నాన్నా! ఎప్పుడూ ఇంట్లోంచి కదలనియ్యవ్. బయటికెళ్ళి గోలీకాయ లాడుకుంటా నాన్నా!"
"నోరు మూసుకుని ముందు ముక్క వెయ్."



ఒత్తుగా మెత్తగా నిగనిగలాడే
సుదీర్ఘ కేశసంపదకు
కేశవర్ధిని
పెట్టింది పేరు
కొబ్బరినూనెతో తిరిగి కలప
నవసరంలేకుండా వాడడానికి
కేశవర్ధిని
రెడీమిక్స్‌డ్ హేరాయిల్
మీ శిరోజాలను పరిమళ
భరితంగా శుభ్రంగా ఉంచడానికి
కేశవర్ధిని షాంపూ



కేశవర్ధిని ప్రాడక్ట్స
27 మానిలామణి
మొదలియార్ రోడ్,
మద్రాసు-14.

నీరసం నిలిచింది. అవయవాలన్నీ సత్యాగ్రహం చేసినట్టు మారేయి. మనస్సు ఆలోచనల బరువుకి క్రుంగిపోయినట్టయింది. ఇంతలో టేబులు మీద టైంపీసు, కాలేజీకి టైమయింది త్వరగా తయారవమని హెచ్చరించింది: సారథిస్థితి మాత్రం కాలేజీకి వెళ్ళగలిగేలా లేదు. కాని ప్రచండుడైన ప్రొఫెసరు గుర్తుకి రావడంతో సారథి త్వరపడక తప్ప లేదు. గబగబా ఓ సారి 'ఛటర్జీ' తిరగేసి చకచకా తయారయ్యేడు.

కాలేజీకి వెళ్ళేక, సారథి ఆరోజు క్లాసు కూడా తీసుకోవలసొచ్చింది. లెక్చరు మధ్యలో, మధ్య వరసలో కూర్చున్న తన కాంతిత్రయాన్ని, వెనుక బెంచీలో కూర్చొన్న క్రానిక్ రిఫర్డ్ కాంతారావు ఆదేవనిగా వీక్షిస్తూ తన శాయశక్తులా కాంతిత్రయాన్ని నవ్వించడం చూసేడు. ఒక్కసారి కోపం ముంచుకొచ్చింది. తన ప్రణయ దేవతల్ని వీక్షిసి నవ్విస్తాడా? ఎంత దురాగతం? అనుకుని కాంతారావుని నిండు బెంచీల మధ్యనిలబెట్టిపాఠంలో ప్రశ్న వేసేడు. కాంతారావు తప్పు చెప్పగానే వీలు చూసుకుని నాలుగూ దులిపేశాడు. 'ఛటర్జీ'. చదివి చెడిపోయావన్నాడు. 'బి. టి' చదివి బాగుపడమన్నాడు. మాట్లాడకుండా కూర్చోమన్నాడు. కాంతారావు పాపం చేసేది లేక పార్థసారథిని గుడ్లురిమి చూసి కూర్చున్నాడు. పాఠం చెబుతున్నంతసేపూ సారథికి ఏదో మైకం కమ్మినట్టుండి, స్టూడెట్సు గోలచేసినా వినబడలేదు ఎదురుగా కూర్చొన్న కాంతిత్రయం తప్ప. క్లాసులో మరెవ్వరూ అతనికి కనబడలేదు. చివర్న 'టైమయిపోయింది మావోయ్!' అని అబ్బాయిలంతా అరిచేదాకా, సారథి క్లాసు వదిలి రావాలన్న సంగతే గుర్తుకి రాలేదు.

ఆ మధ్యాహ్నం స్టాఫ్ రూమ్‌లో కూర్చొన్న సారథికి ప్రొఫెసరు గారివద్ద నుంచి పిలుపురాగానే లేచేడు. నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటు , ఆలోచనలో ఆలోచన పేర్చుకుంటూ, ప్రొఫెసరుగారి గదిలోకి అడుగుపెట్టేడు. టేబులు వెనుక కుర్చీలో ప్రొఫెసరుగారు సర్కసు పులిలాకూర్చుని, పూరీలు తింటూ, ఛటర్జీ ముందేసుకుని దీక్షగా 'సి. ఎన్. ఎస్' బట్టీ పడుతున్నారు. సారథిని చూడగానే ఆయన పూరీప్లేటు చటుక్కున దాచేసి, చదివే పేజీల మధ్య గుర్తు కోసం ఒక పూరీ వేసి. పుస్తకం మూసేసి, గాండ్రుమని దగ్గేరు. పులిగా మారినప్పుడల్లా యిలా ప్రొఫెసరుగారు అస్త్మాపేషెంటులా అల్లరి చేస్తారని డిపార్టుమెంటంతకీ బాగా తెలుసు.

సారథి కంటిముందు పడగానే ప్రొఫెసరుగారు యింగ్లీషులో యింగ్లీషు పులిలా గర్జించేరు —
'పొద్దున్న ఏం తీసుకున్నావ్?'

సారథి సవినయంగా అన్నాడు
'చపాతీ సార్'

'షటప్! చపాతీ కాదు నే నడిగింది.' ఈ సారి ప్రొఫెసరుగారు గర్జించినప్పుడు సారథిమీద చినుకులు పడ్డాయి. (కండిషన్డ్ రిఫ్లెక్స్) 'క్లాసులో తీసుకున్న సబ్జెక్టేంటి—చెప్పిన భాగోతమేమిటి అని అడుగుతున్నా?'

సారథి యింకా వినయం మానలేదు. 'భాగోతం కాదు సార్—బ్లడ్!'

'బడ్డే బడ్డు. బ్లడ్‌లో ఏ టాపిక్కు?'

'ఆర్. బి. సి. సార్!'

'ఇంటి దగ్గర ప్రిపేరయ్యే వచ్చావా?'

'అవును! సార్!'

● నేటి బాలురే రేపటి వృద్ధులు.

— ఎస్. ఆర్. బాబూరావు

"మరయితే క్లాసులో ఆ పేలాపనేవిటి?"

"తప్పు చెప్పానా సార్!"

ఒక్కసారి ప్రొఫెసరుగారు కుర్చీలోంచి లేచి వొళ్ళు దులుపుకున్నారు. "తప్పా? తప్పన్నరా? రక్తంలో ఎర్రకణాలేకాక ప్రేమకణాలు కూడా ఉంటాయా? వాటి పేరు శాంతి కణాలా? అవి మూడు రకాలా? పైగా రక్తంలో అవి బాగా ఎక్కువగా తగులడితే 'పోలీశాంతీమియా వీరా' అనే రోగం అఘోరిస్తుందంటావా?" అంటూ దసరా పులి డ్యాన్సు చేసేరు— పిమ్మట ఆయన యింకా యిలా డ్యాన్సు చేసేరు— .

"ఎర్ర కణాలన్నెప్పి బోర్డుమీద అతీసు బొమ్మ లేస్తావా? పైగా యివన్నీ నేను చెప్పమన్నానని చెబుతావా? అసలేమిటి నీ ఉద్దేశ్యం" అంటూ ఆయాస పడ్డారు.

సారధి మెల్లగా "వొంట్లో బాగు లేదుసార్—" అం గొణిగేడు.

"ఒంట్లో బాగులేకపోతే యింట్లో ఏఘోరించాలి. అంతేగానీ క్లాసు కొచ్చి అవాకులు చెవాకులు చెబుతావా?— వెళ్ళు. తిన్నగా ఇంటికి వెళ్ళు. వెళ్ళి మళ్ళీ వారం రోజులు పోయేవరకూ డిపార్టుమెంట్లో అడుగెట్టకు. గెటవుట్!" అని చెడామడా దులిపేసేరు. సారధికి తన బొమ్మ తలంటిపోయడం గుర్తుకొచ్చింది.

రూముకి తిరిగొచ్చి మంచం మీదికి బరువుగా వాలేక, నిద్రకి బదులు క్రమంగా తీరని అస్వస్థత అతన్ని ఆవహించింది.

• • •


నాలుగురోజులు గడిచేక సారథి పుట్టిన రోజు వచ్చింది. ప్రపంచాన్ని క్రమక్రమంగా మరిచిపోతున్న పార్థసారధి, తన పుట్టినరోజు మాట కూడా మరచిపోయేడు. ఈ నాలుగు రోజులూ మంచి పుస్తకానికి చెదలు పట్టినట్టు అతడి మనస్సుని ఆలోచనలు పట్టి చాలావరకూ తినివేసేయి. అలా మిగిలిన చాలీచాలనీ మనస్సుతో అపసోపాలు పడుతున్న సారధికి ఆ సాయంత్రం మూడు వుత్తరాలొచ్చేయి. ఆసరాలన్నీ కోల్పోయానని మధనపడే సారధికి ఆ వుత్తరాలు మూడూ దేవతల్లా కనిపించేయి. అతను వాటిని ఆత్రంగా విప్పి చూసుకున్నాడు. నిజంగా అవి అతని దేవతలు రాసిన వుత్తరాలే. శాంతిలత, శాంతిప్రియ, శాంతిసిరి అనే సంతకాల తేడా తప్ప మిగిలిందంతా ప్రతి దాంట్లోనూ ఒకే లాగున వుంది.

అతను జాగ్రత్తగా చదువుకోడం మొదలు పెట్టేడు.

ప్రియమైన సారధిగారికి—

నమస్తే!

నాలుగురోజులు మీరు కనబడక పోయేసరికి మనస్సుకి జ్వరం వచ్చినట్టుంది నాకు. కలలు కరిగిపోతాయంటారు. ఏమో అనుకున్నాను. కాని నిజంగా మీ రిప్పుడు నా నాలుగు రోజుల కలల్నీ కరిగించి వేశారు. పుట్టిన రోజన్నారు. పార్టీ అన్నారు. పాటన్నారు. పిలుస్తానన్నారు. ఏమీ జరగలేదు. నన్ను మరచిపోయేరల్లే వుంది. కాని—డియర్ సారధీ! మీరు నన్ను మరిచిపోయినా, నేను మిమ్మల్ని నా జ్ఞాపకాల్లో భద్రంగా దాచుకోగల్గుతున్నాను. మీరు నన్ను పిలవకపోయినా, మీ పాట వినే భాగ్యం నాకు లేకపోయినా నాకు మీ మీద కోపం రాలేదు. మీ రిలా చెయ్యడంవల్ల నాకు మీ రింకాదగ్గరయి పోయినట్టనిపించింది. అంచేత ఈ రోజు పుట్టిన మీకోసం నేనివ్వగలిగిన స్వల్పమైన కానుక ఒకటి మీకు సమర్పిస్తున్నాను. మీకిది కేవలం యీ వొక్క పుట్టిన రోజుకే కాదు — జీవితాంతమూ యిది మీ కానుకగా నిలిచి పోవాలని. ఈ కానుక పేరు శాంతిసిరి



దయతో తప్పక గ్రహిస్తారనే ఆశతో—

మీ,

శాంతిసిరి.

మిగతా రెండు ఉత్తరాల్లో శాంతిసిరి అని వున్నచోట, ఒక దాంట్లో శాంతిప్రియ అనీ, మరో దాంట్లో శాంతిలత అనీ రాసుంది తప్ప మిగిలిన విషయం అంతా మక్కికిమక్కీ కాపీ చేసి రాసినట్టుంది. ఒకే ఉత్తరాన్ని మూడు సార్లు చదువుకున్నట్టు, ఆ మూడింటినీ ఒక్కొక్కసారి చదువుకున్నాక సారథికి స్పృహ తప్పినట్టయింది. తను చదివే సీరియల్ నవల నగంలో సమాప్త మయినట్టయింది. శాంతిత్రయానికి అందంలో నేకాక ఆలోచనల్లో కూడా ఏకత్వమే కాబోలునని ఆశ్చర్యపోయేడు. వాపోయేడు. క్షణంలో సారథి గుండెలో జపానులో భూకంపంలా తుఫానులో తరకపంలా ప్రేమ గందరగోళం చెలరేగింది.

—ఈ విపరీతాన్నిప్పుడు తను అదృష్ట మనుకోవాలా? దురదృష్ట మనుకోవాలా? ఏమిటీ దారుణం? చేతికందవనుకున్న అందాలుమూడూ హఠాత్తుగా పందాలు వేసుకుంటూ తన మనస్సుకేసి ఎందుకిలా పరుగులు తీస్తున్నాయి. ఇన్నాళ్లూ శాంతిత్రయం సరసన పాటు పాత్రమే మహా భాగ్యం అనుకున్నాడు తను. వారిలో వొక్కగానొక్క అమ్మాయి తన్ను వలచి వరిస్తే చాలనుకున్నాడు తను. కాని అనుకున్నదంతా అతినిజమయిపోయింది. మహా నిజమయిపోయింది. హే! భగవాన్! ఏమిటీ యూనివర్సిటీ పరీక్ష? శాంతిత్రయం చూపులకే తట్టుకోలేక జ్వరం తెచ్చుకున్న నా బలహీన మయిన మనస్సు యిప్పుడే ధాటికి తట్టుకోనగలదు? మూడు రేసు అశ్వములను, కూర్చిన నా ప్రేమ రథమునకు నేనెట్లు సారథిని కాగలను? నా కర్తవ్య మేమిటి పరాత్పరా? అనుకుంటూ సారథి అదే పనిగా చాలా సేపు రోదించేడు. చివరికి ఏమీ తోచక ఏదో హిందీ సినిమాకి వెళ్ళేడు. తీరా చూస్తే — పాపం!— ఆ సినిమాలో హీరోకి కూడా అలాంటి బాధే ఎదురయింది. కాని ఆ హీరో తనకంటె చాలా అదృష్టవంతుడిలా కనిపించాడు. తనలా అతడికి ఒకే రకమైన అందం, తెలివితేటలు, మనస్తత్వం గల స్త్రీలు ఎదురు కాలేదు. అసలు వాళ్ళ ప్రేమ దృక్పథంలో నే తేడా వుంది. అంచేత ఆ హీరో తన సమస్యని స్వల్ప శ్రమతో నే పరిష్కరించుకోగలిగేడు. కాని తను? శాంతిత్రయం ప్రేమల్లో ఎవరి ప్రేమ గొప్పదో ఎలా నిర్ణ

యించుకోవాలి? ఎవరి అందం గొప్పదను కోవాలి? ఎవరి మనస్సు గొప్పదను కోవాలి? — అయినా తనది జీవితం. అది సినిమా. తన జీవితం సినిమా అయితే ఎంత బావుణ్ను? — అనుకుంటూ నెమ్మదిగా రాత్రి పది గంటలకి రూము చేరాడు సినిమా చూసిన సారథి.

మంచంమీద నడుంవాల్చి కళ్ళు మూసుకు పడుక్కున్నాడు. అయినా అతనికి నిద్రపట్టలేదు. పక్కకి తిరిగి చెయ్యి రేడియో వున్న టేబులు మీదికి పోనిచ్చి మెల్లగా రేడియో ట్యూన్ చేసేడు. వివిధ భారతిలో విషాద గీతం వినబడింది. ఇన్నాళ్లూ సిలోన్ పాటలా వున్న తన జీవితం యిప్పుడు వివిధ భారతి పాటలా విషాద భరిత మయిపోయింది. అసలు తన జీవితమే ఒక విషాద స్వరూపం, దాన్ని చూడాలని తను ప్రేమ అనే దీపాన్ని వెలిగించు కున్నాడు. దీపం వెలిగింది కాని జీవితం పూర్తి స్వరూపం అంతా కనబడలేదు. అంతా కనబడేలా చేసుకునే ప్రయత్నంలో దీపం కాస్తా ఆరిపోతుందేమో!

సారథి క్రమంగా ఇలా వేదాంత ధోరణివైపు జరిగి, మంచంలో కింద పడుతూండగా, పెద్ద పెర్సనాలిటీ గల ఎదురింటి ప్రభాకరానికి ఏమీ తోచలేదు. తన 30వ ఏట ఎం. బి. బి. ఎస్. ఫైనలియరు చదువుతున్న ప్రభాకరం సారథికి పాత క్లాస్ మేటు. ఇప్పుడేకాదు — నాలుగు రోజులనుంచీ ప్రభాకరానికి ఏమీ తోచట్లేదు. పైగా రాత్రిళ్లు నిద్ర బాగా పడుతోంది. ఎంచేతంటే ఈ నాలుగురోజులూ ప్రభాకరానికి ఫిడేలు చప్పుళ్ళు వినిపించటం మానేశాయి. ఏమీ తోచని ప్రభాకరం అసలు సంగతి యిప్పుడే పసిగట్టగలిగేడు. వెంటనే అతను సారథి రూములో కొచ్చాడు.

ఎదురుగా ఎత్తుగా ప్రభలా నిలబడ్డ ప్రభాకరాన్ని చూడగానే సారథికి ప్రాణం లేచివచ్చింది. అప్పుడు తనుకూడా లేచొచ్చి ప్రభాకరాన్ని లోపలికి ఆహ్వానించేడు. ప్రేమ కేసుల్లో పదేళ్ళుగా పాతబడిన ప్రభాకరం సారథి మొహం చూస్తూనే అతని బాధేమిటో చూచాయగా ఊహించేసేడు. తర్వాత రేడియో కేసి ఓ చూపు విసరి 'ముందా భారతి నోరు కట్టెయ్. ఆలిండియా రేడియో వింటే ఆరోగ్యం చెడిపోతుంది' అని రేడియో ఆఫ్ చేయించి సారథిని మంచంమీద కూర్చోబెట్టి కుర్చీ వొకటి దగ్గరగా లాక్కుని తను కూడా కూర్చుని మాట్లాడేడు.

'అసలు నీకు తెలుసో తెలియదో గాని ఈ రోజుల్లో మన పడుచు వాళ్ళ మెదళ్ళని ఆడవాళ్ళూ, ఆలిం

డీయా రేడియో వాళ్లో చెద పురుగుల్లా దొలిచేస్తున్నారు' అని సిగరెట్టు వెలిగించి సీరియస్‌గా ఆలోచించి మళ్ళీ అన్నాడు — 'నువ్వు సిక్కుపడి నాలుగు రోజులైంది కదూ ?'

సారధి ఆశ్చర్యంగా చూసేడు.

'నువ్వు ప్రేమలో పడికూడా నాలుగు రోజులైంది కదూ ?'

'ఎలా తెలుసు నీకు ?!' సారధి ఆశ్చర్యం ప్రశ్నగా మారింది. ప్రభాకరం చిరునవ్వు పొగలు కక్కింది. ఆ పొగల మధ్య తల పంకించి అన్నాడు.

'ఇందులో తెలిసేందుకేం వుంది బ్రదర్ ! నాలుగు రోజులనుంచి నువ్వు ఫీడేలు సాము మానేసినట్టు విధంగా కోర్టై 'గుడ్లు' పెట్టడం కూడా మానేసి కూస్తోంది. నిన్నిప్పుడు చూస్తే ఎలాగూ సిక్కు పడ్డావని తెలుస్తూనే వుంది. పైగా ఏది కేవలం మానసిక సిక్కని నీ కళ్ళే చెబుతున్నాయి ఇకపోతే నీ ఏజ్‌లో ఏ మగాడైనా సిక్కు మనస్సుతో చిక్కి పోవడాన్ని ప్రేమ జ్వరం అంటారు.' అనుభవజ్ఞుడైన ప్రభాకరం మాటలు వినగానే సారధికి కొండంత అపరా దొరికినట్టయింది. గబగబా శాంతిత్రయం రాసిన వుత్తరాలు చూపించేడు. ప్రభాకరం వాటిని పరిశీలనగా చూసి అన్నాడు.

'వీళ్ళు పరీక్షలు కూడా యిలాగే రాస్తారులా వుంది.'

'అవ్వరైతే అంతరంగంలో భరించలేని అలజడికి నేను బలై పోతూ వుంటే ఏమిట్రా ఈ నీ వేళా కోళం ? నా జీవితం—' సారధి ఏదో మాట్లాడ బోయేడు.

'ముసిలి నర్సులా చంపక ముందు అసలు సంగతి చెప్పు' లేచి సిగరెట్టు పారేసి, గదిలో అటూ ఇటూ బాతులా పచార్లు చేయడం ప్రారంభించేడు ప్రభాకరం.

అప్పుడు సారధి తన బాధనంతా చాలాసేపు వొలకబోసి—'యిన్నేళ్లు డాక్టర్ చదివినా అసలు నే నెందుకిలా చిక్కి శల్యమై పోతున్నానో నా కర్థం కావడంలేదు' అని బావురుమన్నాడు. సారధి చెప్పిందంతా ప్రభాకరం మునిలా విని, పచార్లు మానేసి బక బక నవ్వేడు—'ఒరేయ్ సారధీ ! నువ్వెంత అమాయకుడివిరా ? మనకి ప్రేమ జ్వరం కోర్సులో లేదన్న సంగతి నీకు తెలియదూ ?. అఖరికి ఈ జ్వరం వచ్చిన పేషంట్లుకి హాస్పిటల్లో బెడ్స్ కూడా లేవు. ఈ జ్వరంరాని మిగతా పేషంట్సుకేనా సరిగ్గా బెడ్సు లేవనుకో. అది వేరే సంగతి. ఆ మాటకొస్తే అసలీ ప్రేమ వ్యాధికి క్యూరే లేదు—కేన్సరులాగే. కాకపోతే ఒక్కటే తేడా. కేన్సరొస్తే చచ్చిపోతారు. ప్రేమజ్వరం వస్తే పెళ్ళి చేసుకుంటారు. అదే అమ్మాయి కాకపోవచ్చు. ఏమయితే నేంలే చికిత్స చేస్తే మంచి ఫలితాలే వున్నాయి దీనికి. కాబట్టి కంగారు పడకు. ఇప్పుడు నీ కొచ్చిన ప్రేమ జ్వరం కొత్త కోవకి చెందినది. దీన్ని 'పోలీ శాంతి మియా వీరా' అందురు. శాంతిసిరి, శాంతిప్రియ, శాంతిలత — అనబడే ఈ ముగ్గురమ్మాయిలూ నీ రక్తంలో చేరి కణ కణానికి వ్యాపించేశారు. ఇప్పుడు నీలో మితిమీరిపోయిన ఆ శాంతి కణాలే యీ నీ అశాంతికి కారణం. ఇదే కణ్ కణ్ మె కావల్ ! ఇక్కీ మియా, రక్తం నిండా ప్రేమ! మరేం భయం లేదు. కోలుకొనే ఉపాయం నేను చెబుతాలే—' అని హామీ యిచ్చి ఊరడించేడు సారధిని ప్రభాకరం. అయినా సారధి మనస్సుకి స్వాస్థ్యం చిక్కలేదు. 'ఒరే ప్రభాకరం ! ఇలాంటి పరిస్థితిని యింతవరకూ నా జీవితంలో నే నెప్పుడూ ఎదుర్కోలేదు. కాబట్టి నువ్వే నా కిప్పుడు ఏదో ఒక తరుణోపాయం చూపించి నన్ని ముగ్గురి బారినుండి కాపాడాలి. నన్ను శాంతి విముక్తుణ్ణి చెయ్యాలి' అన్నాడు దీనంగా, మంచం మీద యోగివేమనలా కూర్చొని. అప్పుడు ప్రభాకరం మళ్ళీ యిందాకటిలాగే చిరునవ్వు నవ్వి తల పంకించి— 'భయపడకు! అన్నిటికీ నే నున్నాను. నిన్నిప్పుడు తప్పించవలసింది ఆ ముగ్గురి బారి నుండి కాదు. నీ ప్రేమ జ్వరం బాధ నుంచి నిన్ను తప్పించాలి. తరుణీ మనస్కుడవైన నీకు సిసలైన తరుణోపాయం ఒకటి చెబుతాను విను.' అని టేబులు మీపై నుంచి తెల్ల కాగితం తీసి, గబగబా దానిమీద ఏదో రాసి సారధి చేతికిచ్చి, అతుచెప్పులు తొడుక్కుంటూ 'వెంటనే దీనికి మూడు కాపీలు తీసి పొద్దుటే ముగ్గురికీ పోస్టించు. వేళ చూసుకుని మళ్ళా నేనే నీ దగ్గరికి వస్తా. భయపడకుండా బబ్బో!' అని హామీ యిచ్చి నిష్క్రమించేడు.

ప్రభాకరం వెళ్ళాక, చేతిలో కాగితాన్ని చూసుకున్నాడు సారధి.

'డియర్ శాంతి,

మీ ఉత్తరం చూశాను. కాని—యిన్నాళ్లూ నేను మిమ్మల్నొక సోదరిగా భావించాను. ఇప్పుడు మరో విధంగా భావించుకోలేను. అసలు మరోలా భావించుకోడానికి నా మనస్సు నెప్పుడూ తరిఫీదు చేసుకోలేదు నేను. కాబట్టి మీ కానుకని గ్రహించలేని స్థితిలో వున్నాను. వీలైతే క్షమించండి.

మీ సారధి'

ఇది చదువుకున్నాక దీనికి సారధి మూడు కాపీలు తీసేడు. కాపీ చేసే

టప్పుడు ఏదో విలువైన వస్తువును కోల్పోతున్నట్టు ఫీలయ్యేడు.

కాని అంతలోనే, మనస్సులో బెడద వదిలిపోతున్నందుకు సమాధాన పడ్డాడు. సంబరపడ్డాడు. మర్నాడు పొద్దుటే వాటిని పోస్టు చేసేడు.

• • •

ఆ తర్వాత రోజు కిటికీ పక్కన వాలుకుర్చీలో కూర్చున్న సారథికి పోస్టుమేన్ వచ్చి నిన్నటిలాగే మూడు ఉత్తరాలిచ్చేడు. ఉత్తరాలు అందుకుంటున్న సారథి, ఊహించని శాంతిప్రియం రెస్పాన్సుకి కాస్త చిరాకు పడినా, తన ఆధిక్యత అంతగా పెరిగినందుకు కాస్త గర్వపడ్డం కూడా ఉచితం అనుకున్నాడు. అప్పుడతనికి కిటికీలోంచి కనిపించిన దూరంగా నడిచే పోస్టుమేన్ 'హంస'లా అగుపించేడు. తర్వాత సారథి ఆ ఉత్తరాల్ని తీరిగ్గా చదువుకున్నాడు. అవి పాతవాటిలా ఒకే మూసలో పోసినట్టు లేవు. భిన్నంగా వున్నాయి. ఇలా వున్నాయి.

మొదటిది—

సారథిగారికి నమస్కరించి

వ్రాసేది—

మీ అందం చూసి మిమ్మల్ని ప్రేమించాను. జీవితం చివరిదాకా మిమ్మల్ని గుండెల్లో కూచోబెట్టుకుని పూజల్చేసుకుందామనుకున్నాను. కాని నన్ను మీరు తిరస్కరించారు. నా ఆశల్ని అపహాస్యం చేశారు. నాలో ఏంతక్కువో నాకర్థం కాకుండా చేశారు. ఎందుకో నాకు తెలియదనుకోకండి. మీకు చాలా అందంగా వుంటాననే గర్వం బాగా వుంది. అందుకే నన్నిలా చులకన చేశారు. చేస్తే చేశారు. పోనీండి. ఇక ముందైనా యితరుల విషయంలో యిలా చెయ్యడం మానుకోండి. మానకపోతే మీకు జన్మలో పెళ్ళికాదు. ఎందుకంటే తన అందానికి గర్వపడే మగాణ్ని ఏ ఆడదీ ఎన్నుకోదు. ఒక్కమాట— నేను మీ నెచ్చెలి కావాలనుకున్నాను కాని, మీ చెల్లెలు కావాలనుకోలేదు. కాబట్టి క్షమించండి.

సెలవ్,

శాంతిలత.

రెండోది—

ప్రియమైన సారథిగారూ,


నమస్తే! మీ వుత్తరం అందుకుని చదివాను. మీతో కలిసి బ్రతికే భాగ్యం నాకు దక్కలేదు. కాబట్టి నేను చాలా దురదృష్టవంతురాల్ని. కాని ఎట్ ది సేమ్ టైమ్, నాలో కనీసం సోదరి అర్హత మీకు కనిపించినందుకు, అదృష్టవంతురాలిని. కృతజ్ఞురాలిని కూడా. దయచేసి మిమ్మల్ని ప్రేమించిన పొరపాటుకి నన్ను క్షమించండి.

మీ సోదరి,

శాంతిప్రియ.

మూడోది—

మీ ఉత్తరం చదివాను. నవ్వొచ్చింది. ఆశ్చర్యమేసింది. ఎందుకంటే మీగురించి నాకంతా తెలుసుననుకున్నాను. నిజమేమరి. మగాడి గురించి తనకంతా తెలుసుననుకోడం ఆడదానికి తృప్తి, ఆడదాని గురించి తనకంతా తెలుసుననుకోడం మగాడికి ఆనందంలాగ. నిజానికి, ముగ్గురం కూడబలుక్కుని మిమ్మల్ని ఆడించాలనే ఉద్దేశ్యంతోనే ఆ ఉత్తరాలు రాశాం. కాని మీ జవాబు అందాక నా మనస్సు నాకు తెలిసింది. మిమ్మల్ని ఎందుకు వేళాకోళం చెయ్యాలనిపించిందో, మీలో ఈ ఆకర్షణ ఏవిటో యింతవరకూ తెలియని నాకు మీ జవాబు సమాధానం చెప్పింది. మీ జవాబుతో అహం దెబ్బతిని వ్యక్తిత్వం బైటపడింది. నాకు తెలియకుండానే నేను మిమ్మల్ని ప్రేమించినట్లు తెలిసింది. కాని, మీరు నాలో సోదరిని చూశానన్నారు. అంతమాత్రంచేత నేను తల వెనక్కి తిప్పి మీకు దూరంగా వెళ్ళిపోను. నా కసలే పట్టుదల హెచ్చు. మిమ్మల్ని దక్కించుకునేదాకా నాకు నిద్రపట్టదు. మీరు నాలో సోదరిని చూసినంత మాత్రాన మునిగి పోయిందేమీ లేదు. నిజం చెప్పాలంటే, భార్యలో—తల్లినీ, సోదరినీ, ప్రేయసినీ వూహించగల



పురుషుడూ, భర్తలో – తండ్రినీ, తమ్ముళ్ళనీ, ప్రియుడిని వూహించగల స్త్రీ – వాళ్ళు మఖానికి ప్రతినిధులు. కానీ ఈ జాబితాలో ఏ వొక్క పేరో సాధారణంగా మిస్ అవుతూ వుంటుంది. అందుకనే స్త్రీ పురుషుల చరిత్ర ఎప్పుడూ అసమగ్రంగా వుండిపోతోంది. కాబట్టి యిప్పుడు మనల్ని మనంగా అర్థం చేసుకుని, మన భావాల్ని పవిత్రంగా మలుచుకోగలిగితే పరిపూర్ణత నిండిన ఒక జీవితానికి మనమూ ప్రతినిధులయ్యే అవకాశం వుంది. దయచేసి ఆలోచించండి. ఏమైనా నన్ను కాదనకండి. నాకు మీరు కావాలి. మీరే కావాలి. నేనెప్పటికీ మీ దాన్నే. త్వరలోనే పోజిటివ్‌గా కలుస్తారని ఆశిస్తాను.

ఇట్లు,

ప్రేమంటే తెలిసిన పార్థసారథి గారికి ప్రేమంటేనే తెలిసిన — శాంతిసిరి.

ఉత్తరాలు మూడూ చదువుకున్నాక సారథి పెదాలు అందంగా విరిసేయి. ఆ విరుపులో చిరునవ్వు మెదిలింది. అతని మనస్సుతో ఆరోగ్యం కదిలింది. అప్పుడు సారథి మౌనంగా మూడో ఉత్తరాన్ని తీసి ప్రేమ రహస్యం చెప్పినట్లు మెల్లగా ముద్దు పెట్టుకున్నాడు. తర్వాత డైరీతీసి ఆ రోజు పేజీలో దాన్ని యిష్టంగా దాచుకున్నాడు. సారథి అలా దాచుకుంటున్నప్పుడు గుమ్మం దగ్గర అలికిడి వినబడి తల త్రిప్పి చూసేడు. అరడుగుల ప్రభాకరం హడావుడిగా లోపలికొచ్చి, రుమాలుతో ముఖం మీది చెమట తుడుచుకొని, తెగని సంతోషాన్ని పొంగు పులుముకున్నట్టు పులుముకున్నాడు. అప్పుడు అర్ధనిమీలిత నేత్రాలతో ఈజీ ఛైర్లోకి వాలిన పార్థసారథి ఎడమ ఛాతీ మీదికి చెయ్యి పోనిచ్చి గుండె వెతుక్కుంటూ — 'ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః' అనుకున్నాడు.

[అంకితం

'మెడికల రక్షకుడైన
శ్రీ చండీ చరణుని
చరణ కమలాలకు.']

□□□

(గత సంచిక తరువాయి)

విజేత

యద్దనపూడి సులోచనారాణి

"నీ ఆపరేషన్ పూర్తయే వరకూ నేనిక్కడినుంచి కదలను. అంతా సవ్యంగా ముగుస్తుంది. నువ్వు ధైర్యంగా వుండు వాసూ!" వాసు భుజాలచుట్టూ చెయ్యి వేసి గట్టిగా హృదయానికి హత్తుకుంటూ అన్నాడు మాధవ్.

"అక్క సంగతి మర్చిపోవద్దు" ఇది వాసు ఆఖరి మాట. నర్స్ వాసుని తీసుకెళ్ళి పోయింది. ఆపరేషన్ గది తలుపులు మూసుకున్నాయి. బైట వంటరిగా నిలబడి పోయాడు మాధవ్. ఒకవేళ వాసు కేదయినా అయితే! ఎన్నడూ లేంది భయంతో అతని శరీరం జలదరించింది. సంధ్య ముఖం తను చూడగలడా?

27

రెండు రోజుల తర్వాత హాస్పిటల్‌కి అమ్మా, సంధ్య వచ్చారు. తెల్లటి బెడ్ మీద రక్తంలేక పాలిపోయినట్టు పడుకుని వున్నా, ముఖంలో నీరసం బాగా కన్పిస్తున్నా వాసు కళ్ళు మాత్రం వుత్సాహంతో మెరుస్తున్నాయి. సంధ్య దగ్గరగా వెళ్ళింది.

"అక్కా!"

"వాసూ!" అప్పటికే నిండివున్న కన్నీళ్ళు జారి వాసు నుదుటిమీద పడ్డాయి.

"ఛ! యెందుకు? అంతా సవ్యంగా జరిగిపోయిందిగా. అక్కా! నేను క్షేమంగా బ్రతికి బైటపడ్డందుకు నిజంగా నీకు ఆనందంగా వుందా? చెప్పు—" వాసు అడిగే తీరుచూసి సంధ్య తెల్లబోయింది.

"నిజంగా మనస్ఫూర్తిగా నువ్వు సంతోషిస్తుంటే నువ్వు స్వయంగా మాధవ్‌గారికి కృతజ్ఞతలు చెప్పు. ఆయన ఋణం మనం యెన్ని జన్మలెత్తినా తీర్చుకోలేం. తీర్చుకోగలమా నువ్వే చెప్పు."

అక్కగారి మనసులో మాధవ్ పట్ల సదభిప్రాయాన్ని చొప్పించి అవునని ఒప్పించటానికి ఇదే మంచి అవకాశం అని ఆశించిన వాసు సంధ్య నోటిచేత ఔననిపించటానికి

తహతహ లాడిపోతున్నాడు. క్షణం సేపు బిత్తరపోయిన సంధ్య నోట్లోంచి యే మాట లేకుండా తమ్ముడివైపు చూస్తూ నిలబడి పోయింది. వాసు మాటలు విని సంధ్య చూడబోయే ఒక చల్లటి చూపుకోసం ఆత్రంగా యెదురు చూసిన మాధవ్‌కి నిరాశ తప్ప యేమీ యెదురవలేదు.

అక్కడనుంచి వెళ్ళిపోయి గుమ్మంలో నిలబడ్డాడు. తనెదుకు బాధ పడాలి! వాసుద్వారా సంధ్యకి కలిగిన అన్యాయం సరిచేయాలను కున్నాడు. చేస్తున్నాడు. అంతే. సంధ్య గుర్తించి కృతజ్ఞత చూపించటం లేదని బాధపడటం దేనికి? అంతకంటె వెర్రితనం యింకోటి లేదు. సంధ్య గుర్తించనీ! గుర్తించక పోనీ! తను చేయగలిగింది చేస్తాడంతే!

'హల్లో! మధూ!—'

మాధవ్ వులిక్కిపడి వెనక్కు తిరిగి చూశాడు.

జ్యోతి పరుగెత్తుకుంటూవచ్చింది.

జరిగినకథ

స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని జైలు శిక్ష తరవాత స్వగ్రామం తిరిగి వస్తున్న మాధవ్, త్రోవలో బండి బురదలో కూరుకుపోగా నిస్సహాయంగా ఉన్న సంధ్యకు సహాయం చేస్తాడు. ఆమె అతన్ని అపార్థం చేసుకుని, కొట్టి అవమానిస్తుంది. ఆ తరువాత కొన్నేళ్ళకు ఆమె అతనికి రైల్లో ఒంటరిగా తారసిల్లుతుంది. తల్లి మరణం, ప్రేమించిన సుధ మరొకరిని వివాహ మాడడం మొదలైన సంఘటనలతో వికలమనస్కుడై ఉన్న మాధవ్ ఆ యువతిపై పూర్వపు కసితో మానభంగం చేస్తాడు. మరికొన్నేళ్ళకు ఒక పల్లెటూరులోని తన భవనానికి వెళ్ళిన మాధవ్‌కు ఆ సంధ్యే మళ్ళీ తటస్థపడుతుంది. అనుకోకుండా తిరిగి తిరిగి ఎదురవుతూ తనపై విపరీత ద్వేషం చూపుతున్న ఆమెను ఎలాగైనా తనను ప్రేమించేలా చెయాలని అతను ప్రయత్నిస్తాడు. వికలాంగుడైన ఆమె తమ్ముడు వాసుతో స్నేహంచేస్తాడు. వాసు అంగవైకల్యం పోగొట్టి ఆ విధంగానైనా సంధ్య ప్రేమాదరాలను పొందాలని వాసును హైదరాబాదు తీసుకువెళ్ళి ఆపరేషన్ చేయిస్తాడు.



'మధూ! నువ్వు - ఇక్కడ—' ఆశ్చర్యాన్నంతా కళ్ళలోనూ, కనుబొమల్లోనూ ప్రదర్శిస్తూ చొరవగా అతని చేతిని తన చేతిలోకి తీసుకుంటూ అడిగింది.

'నువ్వు ముందు ఇక్కడెందుకున్నావ్ చెప్పు?' అన్నాడు మాధవ్.

'నా ఫ్రెండ్ ఒకమ్మాయికి ఆపరేషన్ అయింది. నువ్వు యిక్కడ యెందుకున్నావు?

'నాకు తెలిసినవాళ్ళ కుర్రాడికి అపరేషన్ అయింది.'

సంధ్య యిటు తిరిగి వాళ్ళవైపు చూసింది.

'ఎవరా తెలిసినవాళ్ళు?—'

'నువ్వెరగవు. నీకు తెలియదు.'

'నాకు తెలియని నీ మిత్రులెవరబ్బా!—' జ్యోతి లోపలికి తొంగి చూసింది. ఇటు చూస్తున్న సంధ్య చూపులు జ్యోతి చూపుల్లో కలిసినాయి.

'ఎవరూ !—' అంటూ జ్యోతి మాధవ్‌ని తోసుకుని లోపలికి వచ్చింది.

సంధ్య చటుక్కున ముఖం తిప్పేసుకుంది,

'అరె! నువ్వా? ఇంకెవరో అనుకున్నాను.' ఆశ్చర్యం వెలిబుచ్చింది జ్యోతి.

'మీరు తెలిసిన వాళ్ళేనా? అయితే నాకు పరిచయం చేయాల్సిన పని తప్పిందన్న మాట.' మాధవ్ కూడా నవ్వుతూ లోపలికి వచ్చాడు.

'అంత ప్రత్యేకంగా పరిచయం చేసుకోవాల్సినంత ప్రముఖులేం కాదులే! అవునుగాని మధూ! వీళ్లు నీ కెక్కడ దొరికారు.' జ్యోతి మాధవ్‌వైపు తిరిగి నిర్భయంగా, వ్యంగ్యంగా అడిగింది.

మాధవ్ తెల్లబోయినట్టు చూశాడు.

'అవన్నీ నీ కనవసరం! ముందు నువ్వీ గదిలోంచి వెళ్ళు' వాసు కోపంతో గట్టిగా అరిచాడు.

'వాసూ!' అయా అదుర్దాగా దగ్గరకు వెళ్ళింది.

జ్యోతి వాసువైపు నిర్లక్ష్యంగా ఓ విషపు చూపు విసిరి సంధ్యతో 'ఊ! అయితే అక్కా తమ్ముళ్ళిద్దరూ మంచి వాడినే పట్టారన్నమాట—' అంది.

'జ్యోతీ!' మాధవ్ వారిస్తున్నట్టు పిలిచాడు.

'నీకు తెలియదు. నాకేం భయం లేదు. వీళ్ళ సంగతి అంతా నాకు తెలును. ఏదీ ధైర్యం వుంటే ముఖంయెత్తి నాతో మాట్లాడమ్మను చూస్తా! మధూ! నీకు గట్టిగా చెబుతున్నా! నీ స్నేహం పొందాల్సిన మనుష్యులు కాదు వీళ్ళు—' అప్పటికి మాధవ్ జ్యోతి రెక్క పట్టుకుని బైటికి లాక్కుపోయాడు.

'రాక్షసి! ఇక్కడికెలా వచ్చింది. మాధవ్‌కెలా పరిచయం?—' పళ్ళు బిగిస్తూ అన్నాడు వాసు.

సంధ్య అప్పటికే రెండు చేతుల్లో ముఖం దాచుకుని వెక్కి వెక్కి ఏడవసాగింది అయా పిల్లలిద్దర్నీ సముదాయించడం మొదలుపెట్టింది.

28

'జ్యోతీ! నీకు బుద్ధుందా? చదువు - సంస్కారం వున్న మనుష్యులు మాట్లాడే తీరేనా అది?— మర్యాదేనా నీకు?—' ఇవతలికి వచ్చింతర్వాత మాధవ్ కోపంగా అన్నాడు.

'వాళ్ళ మొహం. వాళ్ళకి మర్యాదేమిటి? ఆ అమ్మాయి యెంత గ్రంథసాంగురాలో నీకు తెలియదు.' నిర్లక్ష్యంగా అంది జ్యోతి.

మాధవ్ వినటం యిష్టంలేనట్టు సిగరెట్ తీసి వెలిగించుకున్నాడు.

'అసలు వాళ్ళు నీ కెక్కడ తగిలారు?—'

'ఏం? అంత తెలుసుకోకూడని మనుష్యులా?—'

'ఖచ్చితంగా. వాళ్లు మనుష్యులా! కాదు విషపునాగులు. చాలా భయంకరమైన వాళ్ళు. ఆ అమ్మాయి పెళ్ళి పెటాకులు లేకుండా పిల్లాడిని ప్రసవించింది తెలుసా?—'

మాధవ్ ముఖంలోకి ఒక్కసారిగా రక్తం పొంగింది. భగవాన్! సంధ్యని వీళ్ళంతా కలిసి వేట కుక్కల్లా తరిమివుంటారు అందులో సందేహంలేదు. అయినా జ్యోతికి సంధ్యకి యెలా పరిచయం? అదే అడిగాడు 'మీ యిద్దరూ ఒకళ్ళకి ఒకళ్లెలా తెలుసో!—'

'ఒకే కాలేజీలో వెలగబెట్టాంలే! అబ్బో! కాలేజీలో చదివే రోజుల్లో యీవిడగారి మిడిసిపాటు యేమని చెప్పమంటావు? ఆ బట్టలు. పెద్ద నవాబు కూతురులాగా ఆ దర్జా. ఓ జోడు గుఱ్ఱాలబండి. ఓహో! అడగకు. పాపం, ఆ పొగరంతా ఆ దెబ్బతో దిగిపోయింది.'

మాధవ్ మాట్లాడలేదు. ముఖం తిప్పేసుకున్నాడు.

జ్యోతి అనుమానంగా చూస్తూ 'ఇదంతా అబద్ధం అని కదూ నీ వుద్దేశ్యం? అవున్లే! అసలు మీ మగాళ్ళ బుద్దే అంత. కాస్త ఎర్రగా బుర్రగా కనిపిస్తే చాలు. కళ్ళు మూసుకుపోతాయి. నేను అబద్ధం ఆడుతున్నానని నువ్వు అనుకుంటే నాకు ఒళ్లుమండుతుంది. అనవసరంగా ఒకళ్ళని గురించి అడిపోసుకునే అలవాటు నాకు లేదు. కావాలంటే రా! తీసుకెళ్ళి చూపిస్తాను.'

'ఏం చూపిస్తావు?' మాధవ్ విస్మయంగా అడిగాడు.

'ఈవిడగారు కని వదిలేసిన పుత్రరత్నాన్ని.'

'అబద్ధం!' రక్తంలేని ముఖంతో అన్నాడు.

'అబద్ధమా? అయ్యో రామా! నువ్వు వాళ్ళ వలలో బాగా పడ్డట్టుందే! అబద్ధాలు చెప్పాల్సిన ఖర్మ నాకేమిటి? కావాలంటే నిజం తెలుసుకోవాలని నీకు గట్టిగా వుంటే నాతో రా! యిప్పుడే చూపిస్తాను.' ఈర్ష్య నిండినముఖంతో అంది.

'చూపించకపోతే?—' జ్యోతి చెయి నొప్పి వచ్చేంత గట్టిగా గుచ్చి పట్టుకుంటూ అడిగాడు.

'నా పేరు జ్యోతేకాదు. నువ్వు మళ్ళీ నా ముఖం చూడకు. సరేనా?' రోషంగా అంది.

'మాధవ్ రెప్పవాల్చకుండా జ్యోతివైపు చూస్తుండి పోయాడు.

'ఏం? రావటానికి నీ కేమైనా అభ్యంతరమా?—' సవాల్ చేస్తున్నట్టు అడిగింది.

'లేదు.'

'అయితేపద.' మాధవ్ చేతిలోంచి చేతిని విడిపించుకుని విసురుగా దారితీసింది. మాధవ్ అనుసరించాడు. అతని గుండెలు వేగంగా చిత్రంగా కొట్టుకుంటున్నాయి. ఒంట్లో రక్తం అంతా మరుగుతున్నట్టు వేడెక్కి ముఖంలోకి పొంగింది. ఇది నిజమా? నిజంగా సంధ్య కొడుకు బ్రతికి బాగున్నాడా! కానీ - కానీ వాసు చెప్పలేదే! ఇష్టంలేక అలా వదిలేసాడా? కారులో కూర్చుని స్టార్టు చేయటానికి స్టీరింగ్‌మీద వేసిన అతని చేతులు కొద్దిగా వణికినాయి. కారు బైలుదేరింది.

వెడుతుండగా దారిలో జ్యోతి చటుక్కున గుర్తువచ్చినదానిలా 'మధూ! నువ్వు ఓ చిన్న అబద్ధం చెప్పాలి.' అంది.

'యేమిటది?—'

'నువ్వా కుర్రాడికి తండ్రినని చెప్పాలి. లేకపోతే వాళ్ళుచూపించరు. ఇదంతా నీకేం తెలియదని, ఆ సమయంలో నువ్వు ఫారెన్‌లో వుండటంవల్ల యిలా జరిగిపోయిందని అబద్ధం ఆడాలి. ఇదంతా ఇలా అయినందుకు చాలా బాధ పడుతున్నట్టు నటించాలి. పిల్లాడిని చూపించి యిచ్చేస్తే హాస్పిటల్‌కి పదివేలు విరాళం యిస్తానని ఆశ పెట్టాలి. కుర్రాడిని చూడటానికి తహతహలాడి పోతున్నట్టు ఆదుర్దా ప్రకటించాలి.'

మాధవ్ ముఖం కందగడ్డలా తయారైంది.

'యేం? యేమంటావు?' జ్యోతి ఆదుర్దాగా అడిగింది.

'సరె! నాకభ్యంతరం లేదు.'

బొంగురుపోయిన అతని కంఠం విని ప్రక్కకు తిరిగిచూసిన జ్యోతి 'థాంక్స్. నాకు తెలుసు. నీకు కొంచం కష్టం అవుతుంది. అయినా ఓ అరగంటేగా! ప్రక్కన నేనుంటాను. అన్నింటికీ నేనే జవాబు చెప్తాను.' అతని చేతిమీద తన చేయివేస్తూ తృప్తిగా అంది. సంధ్య మాధవ్‌కి తెలుసునన్న విషయం జ్యోతి భరించలేకుండావుంది. అతిత్వరగా ఆ రహస్యం బైటపెట్టి మాధవ్‌కి సంధ్య అసలు స్వరూపం తెలియజేసేంతవరకూ వూపిరాడనట్టు వుక్కిరిబిక్కిరి అవుతుంది.

29

'అక్కా! మాధవ్ యింకా రాలేదూ?—' వాసు నీరసంగా అడిగాడు. ఈ రోజు మాధవ్ సంధ్య ఆప్యాయంగా మాట్లాడుకుంటారని, తన దగ్గర కూర్చున్న యిద్దర్నీ తృప్తిగా చూడవచ్చని యేవేవో ఆశించాడు అతను. జ్యోతి అనుకోకుండా వచ్చి అంతా నాశనం చేసి వెళ్ళింది.

'స్నేహితురాలు బహుశా వదిలి వుండదు' కఠినంగా అంది సంధ్య.

'మాధవ్‌కి మనకంటే మంచి స్నేహితురాలయి వుంటుందంటావా?—' ఈర్ష్యగా అడిగాడు.

'ఎందుకు కాకూడదూ? అయినా నీ పిచ్చిగాని—మనం స్నేహితులం యెలా అవుతాంరా? అతని దగ్గర దయా ధర్మం తీసుకునే యాచకులం గాని. బిచ్చగాళ్ళకి – స్నేహితులకి నీకు అర్థాలు తెలియవా?—' సంధ్య మనసులో అగ్ని పర్వతాలు బ్రద్దలవుతున్నాయి. కాని పైకి ప్రశాంతంగా, తెచ్చిపెట్టుకున్న చిరునవ్వుతో తమ్ముడి జుట్టుసరిచేస్తోంది. భగవాన్! తనసలు యిక్కడికెందుకు వచ్చింది! అయినా అసలు జ్యోతికి అతనికి యే విధంగా పరిచయం! అతనికి ఏమని చెప్తొందో! ఇంకేం చెబుతుంది! వున్నదేదో చెబుతుంది. చెప్పనీ! భయమా? కానీ తన ఈ సర్వనాశనానికి ఎవరో ఆ మూర్ఖుడికెలా తెలుస్తుంది! గదిలోకి రాగానే మంచంమీద క్షేమంగా వాసు కన్పించగానే మొట్టమొదటిసారి మనసు అతనిపట్ల కృతజ్ఞతతో మెత్తపడబోయింది. ఇంతలో జ్యోతి వచ్చింది. ఇప్పుడు మాధవ్ పేరు చెప్తేనే అసహ్యంతో రోషంతో విలవిలలాడుతోంది మనసు. అసలు భగవంతుడే అన్యాయం చేసాడని బాధ పడుతుంటే మధ్యలో వీళ్ళ గోలకూడా ఏమిటి? జ్యోతి–మాధవ్ యిద్దరూ చాలా ఆత్మీయులు కాబోలు. ఎందుకు కారు! జ్యోతి వచ్చి అలా అతని చెయి పట్టుకోవటంలోనే కన్పిస్తోంది. అయినా అతని కెంతమంది కావాలి! ఆడపిల్లని చూడగానే నిగ్రహం కోల్పోయే పశువు! పెళ్ళయిన సుధతో ప్రేమ కలాపం ఆడే పాచ్యుడు పెళ్ళికాని జ్యోతితో పరిచయం వుండటంలో ఆశ్చర్యం యేముంది! ఈ మనిషి మళ్ళీ ఇలా తన జీవితంలో ప్రవేశించాడెందుకు! సంధ్యకి ఆ క్షణంలో మాధవ్ అంటే ఆడవాళ్ళ వేటకాడుగా, అతి క్రూరుడుగా కన్పించాడు.

'అక్కా! ఆయనిక ఈ రాత్రికి కన్పించరా?—' హీనస్వరంతో మరోసారి అడిగాడు వాసు.

'నాకెలా తెలుస్తుందిరా!'

'ఒకవేళ ఆయనవస్తే నన్ను లేపటం మర్చిపోకు.' కళ్ళు మూతలు పడుతుండగా అన్నాడు వాసు. వాడికి దగ్గరున్న అక్కగారు అవ

షరంలేదు. అక్కరలేని మాధవ్ కావాలి. సంధ్య హృదయం ఈర్ష్యతో చ్రురుమంది. తనకంటే మాధవ్ యెక్కువగా ప్రేమిస్తాడా ? అసలు అతనిలో యేముందని అందరూ అలా ఆకర్షింపబడ్తారు ? ఒక్క వానేకాదు. ఇప్పుడిప్పుడు ఊళ్ళోవాళ్ళుకూడా కమ్మరి, పాకి, పల్లె అనే వివక్షత లేకుండా అందరూ అతని దగ్గరకొచ్చి స్వవిష యాలు చెప్పుకుని 'దొరగారూ ! ఏం చెయ్యమంటారండి ?' అంటూ సలహా అడుగుతారు. ఇలాటి హీను లకి భగవంతుడు ఇలాంటి ఆకర్షణ ప్రత్యేకంగా యెందుకిస్తాడో మరి !

30

మాధవ్, జ్యోతి కారుదిగి సరాసరి నర్సింగ్ హోమ్‌లోకి వెళ్ళారు. దాదాపు యిరవై ముప్ఫై సంవత్స రాలక్రితం యూరోప్‌నుంచి వచ్చి యిక్కడ స్థిరపడిపోయి ఒక ఆంగ్లేయుడు భారతదేశంలో మృతి అయిపోయిన తన భార్య జ్ఞాపకార్థం కట్టించిన భవనం అది. అందులో నర్సులు ఉచితంగా సేవచేస్తారు. దిక్కులేని ఆడవాళ్ళకి ఆ హాస్పిటల్లో పురుడుపోసి పంపిస్తారు. ప్రస వించిన తర్వాత ఏ కారణాలవల్లనైనా వద్దని వదిలేసి పోయిన శిశువులని పెంచి పెద్దజేసి క్రైస్తవ మత బోధకులుగా తీర్చి దిద్దుతారు. సాధారణంగా ఈ నర్సింగ్ హోమ్‌కి మరి బీదవాళ్ళు, అసలు దిక్కులేని వాళ్ళు తప్ప వున్నత కుటుంబీకులు గాని, గౌరవనీయులైనవాళ్ళు కాని రారు.

'జ్యోతి తెల్లగా పొట్టిగా గుమ్మటంలావున్న ఓ సిస్టర్ని కలుసుకుని ప్రసాద్ పేరు చెప్పి తనని పరిచయం చేసుకుంది. సంధ్య విషయం యెత్తి మాధవ్‌ని పరిచయం చేసింది. ముందు కుర్రాడు సంగతి యేమీ చెప్పకుండా సిస్టర్ ఇద్దర్నీ అను మానంగా చూస్తూ సవాలక్ష ప్రశ్నలు వేసింది జ్యోతి వాటన్నింకిటి చురుగా, చాలా తెలివిగా సమాధానాలు యిచ్చింది.

'క్షమించాలి. ఆ సమయంలో నేను లేను. చాలా పొరపాటయి పోయింది.' యెలాగో అయిపోయిన కంఠంతో అన్నాడు మాధవ్.

'దానికేముందిలెండి. పొరపాటు చేయుటం అనేది మానవనైజం. అది తెలుసుకుని చక్కదిద్దుకున్నప్పుడే మానవోత్తము డవుతాడు. మీలో కట్టాడి పోలికలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. నాకు వేరే సాక్ష్యాలు కూడా అనవసరం.' జ్యోతి అన్ని విధాలా అతికినట్టు చెప్పటంతో సంతృప్తి పొందిన సిస్టర్ నవ్వుతూ ప్రసన్నంగా అంది.

ఇద్దర్నీ కూర్చోమని చెప్పి బాబుని తీసుకు రావటానికి లోపలికి వెళ్ళింది.



"ఏడిసింది. లక్క పిడత లా[illegible]నవ్వుతూ అంటున్న మాటలు మాధవ్ మొహం యిదీను వెర్రి పీనుగు. చెవుల్ని సోకనే లేదు. అతని నిజంగా నువ్వు తండ్రివని నమ్మేసి గుండెలు వేగంగా కొట్టుకుంటు న్నట్టుంది." జ్యోతి వెటకారంగా న్నాయి. సంభ్రమమో,ఆశ్చర్యమో

తెలియని అద్భుతమైన భావంతో అంతరాత్మ సుడిగుండంలో పడి గిరగిరా తిరుగుతున్నట్టు వుంది. ఇది నిజమా! నిజమా అని మనసు పది సార్లు వందసార్లు ప్రశ్నించ సాగింది.

పది నిముషాల్లో సిస్టర్ తిరిగి వచ్చింది. వెంట ఆవిడ చిటికిన వేలు పట్టుకుని నాలుగైదు సంవత్సరాల కుర్రాడు నడిచి వస్తున్నాడు. మంచి పోషణలో పెరుగుతున్న సూచనగా తెల్లగా, బొద్దుగా, చక్కటి జుట్టుతో మిసిమిస లాడుతున్న ఆరోగ్యంతో కుడిచేత్తో చంకన పెద్ద కుక్కపిల్ల బొమ్మతో తనవైపు వస్తున్న వాడిని చూడగానే మాధవకి పూర్తిగా మతి పోయింది.

'గుడ్‌యీవినింగ్ చెప్పు' అంది సిస్టర్. ఆవిడ చెప్పగానే చెయి చాస్తూ 'గుడీవినింగ్' అన్నాడు సిగ్గు సిగ్గుగా. తనవైపు చాచివున్న ఆ లేత చేతిని తాకటానికి మాధవ్ చెయి క్షణంసేపు వణికింది. కాని వెంటనే తనకి తెలియకుండానే రెండు చేతులూ జాపి దగ్గరకు లాక్కున్నాడు. వాడి స్పర్శ తగలగానే శరీరం అంతా విద్యుత్తు ప్రవహించినట్టయింది.

'చాలా తెలివి గలవాడు. నేను ప్రత్యేకంగా పెంచుకుంటున్నాను' బాబువైపు ఆప్యాయంగా చూస్తూ అంది సిస్టర్.

'సంధ్య కళ్ళు పూడిపోయినాయి. ఎంత చక్కటి కుర్రాడు' అంది జ్యోతి కూడా.

'నో! నో! ఆ అమ్మాయికి తెలియదు. ప్రసవించగానే చాలా సుస్తీ చేసింది. అసలు బ్రతకదనే అనుకున్నారు. ప్రసవించిన నాలుగైదు రోజులకి యీ నర్సింగ్ హోమ్ నుంచి యింటికి తీసుకెళ్ళిపోయారు. సంధ్యకి శిశువు కలిగిన విషయం తెలియనీకుండా నేను తీసుకుని కొద్ది రోజులు పెంచేటట్టు రహస్యంగా తండ్రి యేర్పాటు చేసారు. తర్వాత రజాకర్ మూవ్‌మెంట్ జరిగింది. ఆయన్ని కాల్చేసినట్టు విన్నాను. తర్వాత నేను ప్రయత్నించినా ఆ అమ్మాయి యెక్కడుందో తెలుసుకోలేక పోయాను. ఇప్పుడెక్కడుందో మీ కేమైనా తెలుసా?—'

జ్యోతి—మాధవ్ ముఖాలు చూసుకున్నారు.

'తెలియదు. ఆ గొడవలు జరిగిన తర్వాత కొద్దిరోజులు యీ ఊళ్ళోనే వుంది. తర్వాత ఎక్కడకెళ్ళిందో ఏమైందో మాకూ తెలియదు.' అతి సహజంగా అంది జ్యోతి.

'అలాగా! ఆ సమయంలో నాక్కూడా ఒంట్లో బాగా లేక విశ్రాంతి కోసం మద్రాసు వెళ్ళి కొన్ని రోజులున్నాను. తిరిగి వచ్చిన తర్వాత వాకబు చేస్తే ఏ సంగతి తెలియలేదు.' మాధవ్ చెవులు యధాలాపంగా యీ మాటలు వింటున్నా మెదడు అర్ధం గ్రహించటం మానేసింది. అతని రెండు కళ్ళూ కుర్రాడిలో అణువణువుని ఆత్రంగా, జాగ్రత్తగా పరిశీలిస్తున్నాయి. సిస్టర్ అన్నమాటలో యదార్ధం లేకపోదు. తన చిన్ననాటి ఫోటోలో తను యించుమించు యిలాగే వున్నాడు. కానీ ఆ కనుబొమలు, ఆ పెదవుల వంపు పరీక్షగా గమనిస్తే సంధ్య పోలికలు గుర్తుకు వస్తాయి. కుర్రాడి మెళ్ళో వేళ్ళాడుతున్న శిలువ చూడగానే అతని మనసు అవ్యక్తమైన ఆవేదనతో గిలగిలలాడింది. తనకి సత్యం తెలియకపోతే యింత చక్కటి బాబు సిస్టర్ నీడలో పెరిగి పెద్దయి వ్యక్తిగా రూపొంది యే ఫాదరీగానో యెక్కడో క్రైస్తవ మతం యొక్క వున్నతిని చాటుతూ—భగవాన్! ఆపైన ఆలోచించటానికి అతనికి శక్తి చాలలేదు.

'మధూ! ఇక పోదామా?—' ఇంకా కూర్చుంటే సిస్టర్ యింకే ప్రశ్నలు వేస్తుందో యెక్కడ చిక్కుల్లో పడి—పట్టుబడి పోవాల్సి వస్తుందోనని భయపడిన జ్యోతి లేచింది. అయినా వచ్చిన పని యెలాగో ముగియనే ముగిసింది ఇంకెందుకు యిక్కడ! జ్యోతి త్వరపెట్టటంలో మాధవ్ తప్పనిసరిగా లేచాడు

ఇద్దరూ వెళ్తామని శలవు తీసుకుంటుండగా సిస్టర్ మెడచుట్టూ చేతులువేసి చెవిలో రహస్యంగా యేదో అడుగుతున్నాడు.

'ఏమిటది?' అన్నాడు మాధవ్ కుతూహలంగా.

'మీ రెవరు అని అడుగుతున్నాడు. వయసు చిన్నదైనా ప్రతిదీ తెలుసుకోవాలనే ఆరాటం జాస్తి' బాబు రెండు బుగ్గల మీద ముద్దు పెట్టుకుంటూ ఆప్యాయంగా అంది.

'తండ్రినని చెప్పండి' అన్నాడు మాధవ్

జ్యోతి నవ్వేసి అతని చెయి పట్టుకుని బైటకి లాక్కొచ్చింది.

సిస్టర్ రూమ్ దాటగానే అప్పటి వరకూ బలవంతంగా బిగపట్టుకుని యిక ఆపుకోలేనట్టుగా విరగబడి నవ్వుతూ 'భలే వాడివి' అంది.

'ఏమిటది?' అన్నాడు మాధవ్ కనుబొమలు ముడుస్తూ

'యెంత బాగా నటించావు! నిజంగా నువ్వు తండ్రివే అని ఆ లక్క పిడత నమ్మేస్తోంది. మధూ! నువ్వింత బాగా నటించగలవంటే నిజంగా రెండు కళ్ళతో చూసి కూడా నమ్మలేక పోతున్నాను' అది వచ్చిన కారులో కూర్చుంటూ

మాధవ్ నవ్వలేదు. గంభీరంగా

వచ్చి స్టీరింగ్ ముందు కూర్చున్నాడు.

కారు వెడుతుండగా 'యిప్పుడు చెప్పు. సంధ్య నీ కెలా పరిచయం? యెప్పటినుంచీ ?' అంది.

'ప్లీజ్! జ్యోతీ! యింకెప్పుడైనా సమాధానంచెప్తాను. ఇప్పుడు మాత్రం కాదు.' అన్నాడు. అతని దృష్టి రోడ్డు మీదకి నిశ్చలంగా చూస్తోంది.

జ్యోతి అర్థం చేసుకున్నట్టు నవ్వింది. వెంటనే అతని చేతిమీద తనచేతిని ఆనిస్తూ 'అల్ రైట్ సరే. పోనీ. యిప్పుడైనా జ్యోతి అనవసరంగా మాట్లాడే మనిషి కాదని నమ్మతావుగా!' అంది సగర్వంగా.

'నీ ఋణం యీ జన్మలో తీర్చుకోలేను. చాలా మేలు చేసావు. ఆ జన్మాంతం నీకు కృతజ్ఞుడిని' అన్నాడు మాధవ్ సమాధానంగా.

'దాని కేముందిలే! నాకు తెలిసింది చెప్పాను. ఇంకెప్పుడు నా మాటలు అనుమానించకపోతే సంతోషిస్తాను. అదే చాలు' అంది.

పిల్లాడిని చూడగానే మాధవ్ యెలాగో అయిపోవటం జ్యోతి కనిపెట్టక పోలేదు. అయితే యీ మధ్య అతని ప్రవర్తనలో మార్పుకి కారణం సంధ్య అన్నమాట! అసలు వాళ్ళిద్దరికీ పరిచయం యెలా అయిందో! యెలాగైనా అసలీ యీ దెబ్బతో అతను సంధ్య నీడ చూడటానికి కూడా అసహ్యించుకుంటాడు. అందులో ఏ మాత్రం సందేహం లేదు అనుకుంది.

'జ్యోతీ! ఈ కుఱ్ఱాడి సంగతి నీ ఒక్కదానికి తెలుసా? —లేక మీ వాళ్ళందరికీ—'

'అందరికీ అంటే ?—'

'అదే. సంధ్యకి తెలిసిన వాళ్ళందరికీ—'

'ఉహు. మా ఒక్క కుటుంబానికి తప్ప యెవరికీ తెలియదు. అది కూడా—మాకూ తెలిసేది కాదేమో! సంధ్య నర్సింగ్ హోమ్‌లో వున్న ఆ టైమ్‌లోనే మా అమ్మ వూరునుంచి వచ్చిన ఒకావిడని, ఆవిడకి యెవరూ లేకపోతే నర్సింగ్ హోమ్‌లో చేర్పించటానికి తీసుకెళ్ళాం. అక్కడ సంధ్య వుంది. సంధ్యావాళ్ళ ఆయా మమ్మల్ని చూడగానే దొంగదానిలా నక్కి నక్కి పారిపోయింది. మా ప్రసాద్ అన్నయ్య తర్వాత మా అమ్మకి సంధ్య విషయం చెప్పాడు. అంతే కాదు. ఈ విషయం యెక్కడా అనద్దని తెలియనట్టు వూరుకోమని నన్ను గట్టిగా మందలించాడు కూడా! అసలయినా యెవరి యిబ్బందులు వాళ్ళవి. మాకేమిటి సంబంధం. మేము అసలలా అనవసరంగా అనుకునేవాళ్ళం కాదు.

మా నాన్నగారు మమ్మల్ని చాలా శిక్షణతో జాగ్రత్తగా పెంచారు.'

కారు జ్యోతివాళ్ళ యింటి ముందు వచ్చి ఆగింది.

'లోపలికి వచ్చి అమ్మకి కన్పించి వెళ్ళవూ ?—' అంది దిగుతూ.

'లేదు జ్యోతీ! పనుంది. ప్లీజ్. తర్వాత వస్తాను.'

'తర్వాతంటే ?— రేపు వస్తావా ?—'

'చూస్తాను.'

'కాదు తప్పక రావాలి.'

'అలాగే.' మాధవ్ అప్పటికే కారు బ్యాక్ చేసుకుంటున్నాడు.

జ్యోతి సగర్వంగా చూస్తూ చేయి వూపింది. పోన్లే! పాపం కోలుకోటానికి టైమ్ కావాలి. ఈ సమయంలో దేనికి అతన్ని వత్తిడిచేసి చికాకు పరచకూడదనుకుంది.

మాధవ్ సరాసరి అక్కడనుంచి మళ్ళీ నర్సింగ్ హోమ్‌కి వెళ్ళాడు. అతనికి యిప్పుడు ప్రపంచంలో వున్న ఆకర్షణ అంతా ఆ కుఱ్ఱాడిలో కేంద్రీకరింపబడి అది అయస్కాంతంలా అతనిని అటువైపు బలంగా లాగుతున్నట్టు అన్పించ సాగింది.

31

రాత్రి చాలా పొద్దుపోయింతర్వాత మాధవ్ హాస్పిటల్ కిమాంచి ఉల్లాసంగా తిరిగి వచ్చాడు. కొద్ది రోజులపాటు అప్పుడప్పుడు ముందు వచ్చి బాగా అలవాటు చేసుకున్న తర్వాత బాబుని యివ్వటానికి ఎలాగైతేనేం చివరికి సిస్టర్ ఒప్పుకుంది. ఒప్పించి అంగీకారం తెలిపితే కాని అతను బైటకి రాలేదు. ఫలితంగా కృతజ్ఞతతో అతను నర్సింగ్ హోమ్‌కి 10 వేలు విరాళం యిస్తానని వాగ్దానం చేసాడు. ఇప్పుడతనిలో అపురూపమైన వస్తువునేదో పొందిన తృప్తి, ఆనందం కన్పిస్తున్నాయి. ఈ సారి అతను సంధ్యవైపు చూడటానికి జంకలేదు. మాట్లాడటానికి సంకోచించలేదు. ఆ పసివాడిని చూసిన తర్వాత

- ఒక చిరతపులి కళ్ళడాక్టరు దగ్గిరకెళ్ళింది. 'డాక్టరుగారూ! నాకళ్ళకేదో జబ్బు వచ్చిందండి. నా భార్యకేసి చూసినప్పుడల్లా ఏవో మచ్చలు కనబడుతున్నాయండి' అంది.

  'అవును మరి, నువ్వు చిరతపులివి కదా ?' అన్నాడు డాక్టరు.

  'నిజమేనండి. కాని నా భార్య జీబ్రా కదండి.' అంది చిరతపులి.

సంధ్య తన రక్తంలో రక్తంగా, శరీరంలో ఒక భాగంగా అన్పిస్తోంది. ఇప్పుడిద్దరి మధ్యా ఓ అనుబంధం వుంది. సిస్టర్ మెడ చుట్టూ చేతులు పెనవేసి గుండెల్లో ముఖం దాచుకున్నట్టు బాబు యెప్పుడైనా సంధ్యని అలా పెనవైచుకుంటాడా? ఇద్దరూ అలా కలిసివున్న ఆ దృశ్యంచూసే అదృష్టం తనకుందా? ఎప్పటికైనా సరే! ముందు భవిష్యత్‌లో ఆ రోజు వచ్చి తీరాలి. ఆ రోజుకోసం ఆ క్షణంకోసం తను తీవ్రంగా కృషి చేస్తాడు. అవసరం అయితే జీవితాన్నే పణంగా పెడతాడు!

'ఎలా వుంది?' వాసు ప్రక్కలో కూర్చుని నుదుటమీద చెయ్యివేసి తాకి చూస్తూ అడిగాడు.

'మీ కోసం చాలాసేపు అడిగాడు' అంది ఆయా.

'అలాగా!'

'రాగానే లేపమని మరీ మరీ చెప్పి నిద్రపోయాడు.'

'పన్నెండు గంటలకి యెలాగో మందు యివ్వాలిగా. అప్పుడు నేను దగ్గరే వుంటాను' మాధవ్‌కి వాసుని చూస్తూంటే యిదివరకు యెప్పుడూ లేని ఓ విధమైన సోదర భావంతో మనసు పురుకులు పెడుతోంది. మధ్యలో వాసు అనే సారధి లేకపోతే తనకి విషయాలు యెప్పటికీ తెలిసి వుండేవి కావు. ఏనాటికైనా యీ సారధివల్లే ఆవతలి తీరంలో వంటరిగా నిలబడివున్న సంధ్యని తను చేరుకోవాలి. వాసే లేకపోతే ఆ ఆశ గగన కుసుమంలా కన్పించేది. ఎప్పటికప్పుడు దూరంగా పోయి యెండమావిలా వెక్కిరించేది.

'రేపు వుదయం మేం వెళ్ళిపోతాం' అంది ఆయా. సంధ్య మాటలు ఆయా అప్పచెబుతోందని గ్రహించిన మాధవ్ సూటిగా సంధ్యవైపు చూస్తూ 'యెందుకని?' అన్నాడు. 'వెళ్ళిపోతాం' ముక్తసరిగా అని వూరుకుంది ఆయా.

సంధ్య కిటికీ దగ్గర నిలబడి ప్రాణంలేని బొమ్మలా బైటకి చూస్తోంది. మాధవ్‌కి ఈ రోజు సంధ్యని తాకాలనిపిస్తోంది. దగ్గరకి లాక్కుని పిచ్చిపిచ్చిగా యేవేవో చెప్పాలనిపిస్తోంది. కనీసం దగ్గరగా వెళ్ళి నిలబడాలనే కోర్కె అయినా తీర్చుకోకుండా వుండటానికి నిగ్రహించుకోలేక పోయాడు. లేచి సంధ్య దగ్గరగా వెడ్తూ 'ఏం సంధ్యా? ఎందుకని?' అని అడిగాడు.

సంధ్య చివ్వున తల తిప్పి చూసింది. క్షణంసేపు అతని కళ్ళతో కలిసిన ఆ కళ్ళలో ప్రపంచంలో వున్న అసహ్యం — ద్వేషం అంతా పోగుపోసినట్టుంది. అంతేగాదు. ఏమిటీ మనిషి అనే హీనమైన భావం నిండివున్న వాడియైన చూపు అది. అప్పటివరకూ వూహల అలలమీద వూగుతూ, గాలిమేడల్లో విహరిస్తు, మేఘాల్లో తేలిపోతున్న మాధవ్ మనసు చురుక్కుమన్నటు తీక్షణంగా వున్న ఆ చూపుతో తక్షణం క్రిందికి దిగివచ్చింది. వాస్తవికతను గుర్తించిన అతను అక్కడ నిలబడలేక మరుక్షణంలో గిరుక్కున వెనక్కు తిరిగి దూరంగా వచ్చేసాడు.

32

ప్రియమైన అక్కయ్యకి,

వాసు నమస్కరించి వ్రాయునది. నేనిక్కడ క్షేమంగా నే వున్నాను. ఇంకో వారంలో జుల్లో యింటికి వెళ్ళిపోవచ్చునని డాక్టరు చెబుతున్నాడు. ఆరు వారాలు. యెంత త్వరగా తిరిగిపోయినాయి కదూ! అక్కా! నాకు బుద్ధి తెలిసిన తర్వాత నిన్ను చూడకుండా యిన్నిరోజులు నే నెప్పుడు వుండలేదు. నాకిలాగే వుంది. ఎప్పుడెప్పుడు నీ దగ్గరకి పరుగెత్తుకొస్తానా అని ఆత్రంగావుంది. ఒక్క వారం రోజులే గా ఎక్సర్‌సైజ్ మానేస్తే ఏమవుతుంది? అంటే మాధవ్ ఒప్పుకోవటంలేదు. అక్కా! మళ్ళీ నా రెండు కాళ్ళమీద ఇలా నడుస్తుంటే యెంత బాగుందని! పాత జీవితం అంతా భయంకరమైన పీడకలలా తోస్తుంది. పడుకుని నిద్రపోవాలంటే భయం. మళ్ళీ నిద్ర మెలకువ వచ్చేసరికి కుంటివానిగా మంచంలో వుండిపోతానేమో యిదంతా కలేమో అనిపిస్తుంది. ఆ వూహ వస్తేచాలు. మైళ్ళకొద్దీ వేగంగా పరుగెత్తటానికి మనసు తొందరపడుతుంది. ఇలాగని మాధవ్‌కి చెప్తే ఆయన నవ్వి నా బుగ్గ పట్టుకుని సాగదీస్తూ నీకు ఆలోచన్లు అధికం. అంతకంటే యేమీ లేదు' అంటారు. అక్కా! ఆయన యెంత మంచివారు కదూ! యిది యేనాటి ఋణమోమరి. మనం అడక్కుండా కేవలం భగవంతుడు పంపిన దేవదూతలా వచ్చి నా జీవితాన్ని చక్కబరిచారు. మనం ఏం యిస్తే ఆయన చేసిన యీ సహాయానికి ఋణం తీర్చుకోగలమో చెప్పు. నువ్వేమో కనీసం ఒక్క మంచి మాట అయినా


- రోగి నెమ్మదిగా కళ్ళుతెరిచాడు. ముందు అంతామసక మసగ్గా కనబడింది. తరవాత తన మీదికి వంగి ఆత్రంగా చూస్తున్న ఒక ముఖం కనబడింది. 'డాక్టరుగారూ! అపరేషను బాగా జరిగినట్టేనా?' అని నీరసంగా అడిగాడు.

'నేను డాక్టర్నికాదుబాబూ! నన్ను చిత్రగుప్తుడంటారు.'

మాట్లాడవయ్యే. అప్పుడప్పుడు ఇది గుర్తుకొచ్చి సిగ్గుతో నాకు చావాలనిపిస్తుంది. ఆయన మంచివారు కాబట్టి పట్టించుకోరనుకో! అక్కా! ఎవరో నీ యింట్లో వస్తువు ఎత్తుకుపోయారని చెప్పి మిగతా ప్రపంచంలో అందర్నీ దొంగల క్రింద జమకత్తే ఏం బాగుంటుంది చెప్పు? నాకు తెలుసు. నా తర్వాత ఈ లోకంలో నీకు ఆయన ఒక్కరే ఆత్మీయులు. అది నువ్వెప్పటికి గ్రహిస్తావో నాకు తెలియకుండా వుంది. నువ్వింత నిర్లక్ష్యంగా వున్నా ఆయన కాస్తయినా పట్టించుకుంటున్నారా? అంతటి విశాల హృదయం యెవరికి వుంటుందో చెప్పు కాస్త వింటాను. ఈ ఒక్క విషయం చాలదూ? ఆయన వ్యక్తిత్వం అర్థం చేసుకోటానికి. మాధవ్‌లాంటి వాళ్ళు వుండబట్టే యింకా యీ లోకంలో అక్కడక్కడ దయా ధర్మం—జాలి—స్నేహం కన్పిస్తున్నాయని నా ఉద్దేశ్యం. కేవలం నా నిస్సహాయ స్థితిచూసి జాలిపడి, చితికిపోయిన మన కుటుంబంమీద సానుభూతితో కాకపోతే అతని కిదంతా చేయాల్సిన అవసరం ఏమిటి. నాకెందుకో మీ యిద్దరు స్నేహంగా వుంటే బాగుండు ననిపిస్తుంది. నాకు తెలుసులే! ఇలా చెప్తే నీకు కోపం వస్తుంది. అయినా చెప్పకుండా వుండలేను. ఉండటానికి నా మనసు అంగీకరించటంలేదు.

అక్కా! అసలు సంగతి మర్చిపోయాను. నిన్న ఈ హాస్పిటల్‌కి మోహన్ వచ్చాడు. వాళ్ళ మామయ్యకి ఏక్సిడెంట్ అయి చెయ్యి విరిగితే యిక్కడ చేర్పించారట. నేను వరండాలో తిరుగుతుంటే కన్పించాడు. వాడు నన్ను గుర్తుపట్టలేదు. నేనే గుర్తుపట్టి వాడి దగ్గరకు వెళ్ళి పలకరించాను. మళ్ళీ నడుస్తున్న నన్ను చూసి ఎంత తెల్లబోయాడని! వాడిప్పుడు ఏడవ ఫారం చదువుతున్నాట్ట. క్రికెట్ ఆట బాగా వచ్చిందట. వాడి మొహం వాడికసలు బాట్ పట్టుకోవటం నేర్పింది నేను. వాడికబుర్లు వింటుంటే ఎంత ఈర్ష్య అన్పించిందని. నా కీ కాలు కుంటి లేకపోతే యీపాటికి నేను కూడా వాడితోపాటు వుండాల్సింది కదూ! 'ఇప్పుడైనా కొంప మునిగిపోలేదు. దిగులుపడకు.' అంటారు మాధవ్. నిజంగా! ఆయన పేరు తలిస్తేనే నాకు రెండు చేతులెత్తి నమస్కరించాలనిపిస్తుంది. ఎలాటి సమయంలో కూడా మనిషి దిగజారిపోకుండా ధైర్యం చెప్తారు. అక్కా! కాలు నయం అయిపోయిందిగా! మామూలుగా నడవగలుగుతున్న నేను మళ్ళీ చదువుకోవచ్చు కదూ! నువ్వు నన్ను స్కూల్లో చేర్పిస్తావుగా! మళ్ళీ పుస్తకాలు పుచ్చుకుని అందరిలా నేను కూడా స్కూలుకి వెడుతున్న దృశ్యం కళ్ళముందు కదలుతుంటే! భగవాన్! సంధ్యలాటి అక్కని, మాధవ్‌లాటి స్నేహితుడిని పొందటానికి క్రింద జన్మలో నేనేం సుకృతం చేసేమ! అన్పిస్తుంది. మీ రిద్దరూ అంత మంచి వాళ్ళు. నా కెంత అప్తులు!

అయాని అడిగానని చెప్పు. నాలు



● జార్జి మూర్ అనే ఐరిష్ రచయిత ఎనభైయవ ఏటకూడా దృఢంగా, ఆరోగ్యంగా, నిర్విచారంగా వుండేవాడట.

'మీ ఆరోగ్యానికి కారణమేమి' టని ఒకరు అడగ్గా దానికి మూర్ సమాధానం :

'నాకు తాగుడు అలవాటులేదు, స్త్రీ వ్యసనం లేదు, చుట్టకూడా అలవాటులేదు—పదకొండేళ్ళు వచ్చేవరకు.'

గైదు రోజుల్లో పరుగెత్తుకొస్తున్నానని తెలియజేయి, వుంటాను.

ఇట్లు,
వాసు.

సుదీర్ఘమైన ఆ వుత్తరం నిండా మాధవ్ గొడవే! ఎంత చిత్రం! ద్వేషంతో, అవమానంతో, అక్క మనసు కరకరమంటుంటే కృతజ్ఞతతో–స్నేహంతో తమ్ముడి మనసు తొణికిసలాడుతోంది. ఉత్తరం యెన్నిసార్లు చదివినా యెక్కడా అక్కా నువ్వెలా వున్నావు – యేం చేస్తున్నావు అనే ముక్క లేదు.

సాయంత్రంపూట కూరగాయల తోట దగ్గర పరధ్యానంగా నిలబడిపోయి ఆ రోజు మధ్యాహ్నం తమ్ముడి దగ్గరనుంచి వచ్చిన ఉత్తరాన్ని పదే పదే నెమరువేసుకుంటోంది సంధ్య. వాసు కాలు నయం అయిందన్న ఆనందాన్ని ఈ చదువుకుంటాననే గొడవ ఆవిరిలా మాయం చేస్తోంది. ఇప్పుడింకో కొత్త సమస్య తలెత్తింది. వాసు చదువుకోసం యింక వూపిరి ఆడనివ్వడు. తనకి కూడా చదివించాలనే వుంది. కాని ఎలా? ఏం పెట్టి? వేరే ఊరు వెళ్ళి చదువుకోవాలంటే మాటలా? ఎంత డబ్బుకావాలి! ఈ కూరగాయల మీద వచ్చింది, పొదుపుగా వాడుకుంటే బొటాబొటిగా తింటానికి సరిపోతోంది. ఇంకా, పైఖర్చులకి కూడా యెక్కడ మిగులుతుంది!

సంధ్య దృష్టి తోట మీదకి మళ్ళింది. చెట్లు, పాదులు యెదిగి కాపుకి వచ్చాయి. పువ్వులు, పిందెలతో కళకళలాడుతున్నాయి. ఈ తోటంటే సంధ్యకి చంటిబిడ్డతో సమానం. కష్టపడి బ్రతకటంలో యెంత తృప్తి వుంది! మొదట మొదట ఈ కాయకష్టానికి శరీరం యెదురు తిరిగినా తర్వాత క్రమేపీ అలవాటు పడిపోయింది. ఇప్పుడు బాధేమీ అన్పించదు. పరికదా అదో విధమైన ఆనందం కలుగుతుంది. పోనీ యీ స్థలాన్నే ఇంకా కొంచం చదునుచేసి తోటని ఆ వైపుకి పెంచి పెద్దజేస్తే! చేస్తే బాగానే వుంటుంది. కానీ మళ్ళీ బోలెడంత ఖర్చు. చేతిక్రింద ఇంకో మనిషి అవసరం. ఇప్పటికే అయా తనూ శక్తికిమించి చేస్తున్నారు డబ్బు పెట్టుబడి పెట్టాలి. అన్ని సమస్యలే. అలాగని వాసుని చదువు విషయంలో నిరాశ పరచటం కూడా యిష్టంలేదు. వాసు చదువుకుని, పైకి వస్తే ఒకనాటికైనా తన కష్టాలు తీరుతాయి. వయసుగడిచిన తర్వాతనైనా నిశ్చింతగా గడుస్తుంది. ఎల్లకాలం తనకి శక్తి వుంటుందని ఏం నమ్మకం! అందుకే ఈ లోపల వాసు ఈ భారం మోయగలిగిన శక్తిని కల్పించాలి. పోనీ మళ్ళీ హైద్రా

బాద్ వెళ్ళి యేదయినా వుద్యోగం చేసుకుంటే? ఊహు. వద్దు వద్దు. మళ్ళీ పాత మనుష్యులు–పాత విషయాలు. అవన్నీ గుండెల్లో పొడిచినట్టయి అసలు జీవితం అంటేనే విరక్తి పుడుతుంది. సంధ్య కళ్ళ ముందు జ్యోతి ముఖం మెదిలింది. చదువుకునే రోజుల్లో జ్యోతికి తన మీద అకారణంగా అసహ్యం వుండేది. అది ఈర్ష్యతో కూడిన చాతకాని తనం అని తనకు తెలుసు. జీవితం తలక్రిందులై, దురదృష్టదేవత క్రూరంగా నవ్విన ఆ రోజుల్లో తన పతనానికి యెక్కువగా సంతోషించిన వ్యక్తి జ్యోతి అని చెప్పటానికి యేమాత్రం సందేహంలేదు. ఆ రోజు హాస్పిటల్లో తనని చూసిం తర్వాత బైటకి వెళ్ళిపోయినప్పుడు మాధవ్‌కి యేమని చెప్పి వుంటుంది? యింకేం చెప్తుంది. అసలు చెప్పటానికి యింకేం వుంది? కానీ యీ దౌర్భాగ్యానికి అంతటికీ కారణ మెవరు? నూరేళ్ళ జీవితం నాశనం చేసుకుని యీ మారుమూల యీ పల్లెటూళ్ళో జీవచ్ఛవంలా బ్రతకటానికి బలిచేసింది యెవరు? అందరిలా ఆత్మీయతకి, గౌరవాభిమానాలకి దూరం అయి వెలిగా బ్రతుకుతున్నది ఎవరి మూలంగా? ఎవరి మూలంగానో ఆ హీముడికెలా తెలుస్తుంది. ఎవరు తెలియ చెప్తారు అతనికి! అన్నింటికంటే – అసలు గుర్తువస్తేనే భరించలేని దారుణం. చివరి చివరికి తండ్రి నిర్లక్ష్యం. కుటుంబ గౌరవాన్ని మంటకలిపిన భూతంలా చూసేవారు. పరువు ప్రతిష్ఠలని మింగిన రాక్షసిలా ఏవగించుకునే వారు. ఆయన చూపుల్ని, ఆకళ్ళలో అసహ్యాన్ని గుర్తుకు తెచ్చుకుంటేనే మనసు విలవిలలాడుతుంది. అన్నింటికంటే అపురూపంగా తను చూసుకున్నది తండ్రిప్రేమ. అది పోగొట్టుకున్నప్పుడు తను చూసిన నరకం యెవరు వూహించగలరు! అవన్నీ ఎలా మర్చిపోతుంది! వాసుకి తన అవిటితనం బాగుచేయించాడు కాబట్టి కృతజ్ఞతతో మాధవ్ దేవుడుగా కన్పించవచ్చు.

● ప్రసిద్ధ చలన చిత్ర నిర్మాత సెసిల్ బి. డిమిల్‌ను ఒకరు అడిగారట: 'మీరు తరుచుగా బైబిల్ కథలే ఎందుకు సినిమా తీస్తా'రని.

'మరేంలేదు. రెండువేలేళ్ళుగా జరిగిన పబ్లిసిటీని ఎందుకు వాడుకోకూడదూ అని.'

కానీ—తన జీవిత కుసుమాన్ని నిర్దాక్షిణ్యంగా నలిపి నాశనం చేసిన మనిషి ముఖం వెగటు లేకుండా తనెలా చూడగలుగుతుంది. అయినా—యిదేం దురదృష్టం. అతనే వచ్చి స్వయంగా వాసు కింత చేయటం యెంత విచిత్రం! అదే యింకో వ్యక్తి అయితే కృతజ్ఞతతో చర్మం వలిచి అతనికి చెప్పులుగా కానుక అర్పించేది. ఇప్పుడు వేరు. వాసుకి తనలో వున్న ఈ బాధంతా యెలా తెలుస్తుంది? సిగ్గు విడిచి తనెలా చెప్పగలుగుతుంది. చెప్పలేదు. నిశ్శబ్దంగా యీ గరళాన్ని మింగి వూరుకోవటం కంటే గత్యంతరం లేదు. తనకి కావాల్సింది వాసు క్షేమం. వాడి ఆరోగ్యంకోసం, వాడిని బాగుచేసి మళ్ళీ జీవితం యివ్వటంకోసం—గర్భ శత్రువునైనా సరే వాళ్ళముందు మోకాళ్ళమీద కూలబడి రెండు చేతులూ జాచి భిక్షం తీసుకుంటుంది. సిగ్గుపడదు. అవమానం అనుకోదు. మాధవ్ పట్ల తను చూపే నిర్లక్ష్యం, అతనిచ్చిన వస్తువులను తాకాలంటే చూపే అసహ్యం ఆయాకి కూడా అర్థం కాదు. కుతూహలంగా చూస్తుంది. కళ్ళతో కారణం ఏమిటి చెప్పమని ప్రార్థిస్తుంది. కాని నోరు తెరిచి అడగలేదు. కారణం. ఎంత కన్న తల్లిలా చూసినా కొన్నికొన్ని విషయాల్లో యజమానికి. నౌకర్లకి వుండే హద్దుని తను గిరిగీసి చూపిస్తుందని ఆయాకి అనుభవ పూర్వకంగా తెలును.

అప్పటికే మేఘావృతం అయి వున్న ఆకాశం నుంచి టపటపమని చినుకులు రాలి మీదపడటంతో సంధ్య వులిక్కిపడి తలెత్తిచూసింది. ఆకాశంలో పడమటి దిక్కు నుండి కారుమబ్బులు గుంపులు గుంపులుగా యిటువైపు వస్తున్నాయి. బాగా వానని సూచిస్తున్న వాతావరణం చూసి ఆలోచన్ల వేగం నుంచి తేరుకున్న సంధ్య గబగబా యింటికి నడిచింది.

33

'వచ్చావు కదా! పెద్దవాన పడేట్టుంది. తడిసి పోతావేమోనని భయపడ్డాను' అంది ఆయా ఎదురొస్తూ. అప్పటికే గాలి జోరు ఎక్కువైంది. చూస్తూండగానే కుండపోతగా వర్షం ప్రారంభమైంది. చీకటి పడిపోయింది. వేగంగా వీస్తున్న గాలికి తలుపులు, కిటికీలు కొట్టుకోటం ప్రారంభించాయి. ఆకాశంలో మెరుపులు, వురుములు మధ్య మేఘాలు గర్జిస్తూ వరవళ్ళు తొక్కటం ప్రారంభించాయి.

(సశేషం)

సినిమా

'నవరాత్రి'

ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్ సమర్పించు విజయ చాముండేశ్వరీ వారి "నవరాత్రి" ఏప్రిల్ 22న ఆంధ్రదేశమంతటా విడుదల అయింది.

కవి, నట, గాయకాది కళాకారులు తమ కళాసృష్టి ద్వారా మన హృదయాలలో కలిగించే అనుభూతులను పెద్దలు తొమ్మిది విధాలుగా విభజించారు. వాటికి శృంగారం, హాస్యం, కరుణ, రౌద్రం, భీభత్సం, భయానకం, వీరం, అద్భుతం, శాంతం — అని పేర్లు పెట్టారు.

ఈ నవరసాలను పండించాలన్న సంకల్పంతో ఒక్కొక్క రసం పేరిట ఒక్కొక్క పాత్రను కల్పించి, ఆయా రసాలను నిరూపించేవిధంగా వాటికి కథా సన్నివేశాలు ఏర్పరచి వాటిని ఒక పాత్ర ద్వారా సమన్వయిస్తూ 'నవరాత్రి' చిత్రకథను రూపొందించడం జరిగింది.

తావలచినవాడు, తనకు తండ్రి నిశ్చయించిన వరుడు వేరు అన్న అపోహతో తండ్రి నెదిరించలేక ఇల్లు వదిలి పారిపోయిన ఒక అమ్మాయి కథే ఈ నవరత్నాల హారంలోని దారం. ఆ అమ్మాయి నవరాత్రినాడు ఇల్లు వదలి వెళ్ళి, ఒక్కొక్కరాత్రి ఒక్కొక్క గండం గడచి గట్టెక్కి దశమినాడు భద్రంగా ఇల్లుచేరి, తావలచిన వాడిని కలుసుకుంటుంది. ఈ నవరాత్రులలో తొమ్మండుగురు విభిన్న వ్యక్తులు ఆమెకు తారసపడతారు.

నవరత్నాల వంటి పాత్రలను తొమ్మిదింటిని సమర్థుడైన ఒకే నటునిచే నిర్వహింప జేయాలన్న ఆశయంతో శ్రీ అక్కినేని నాగేశ్వరరావుకు ఈ బాధ్యతను అప్పగించారు.

భగ్నజీవి ఆనందరావుగా, తప్పనిసరిగా అవినీతికి వడిగట్టిన దేవదానుగా, డాక్టర్ కరుణాకర్‌గా, కోపిష్టి గోపన్నగా, పల్లెరైతు శాంతన్నగా, కుష్ఠురోగగ్రస్తుడు సుందరరామయ్యగా, భాగవతార్ శ్రీనివాసులుగా, పోలీస్ ఆఫీసర్ వీరభద్రరావుగా, ప్రేమికుడు వేణుగోపాలరావుగా—శ్రీ నాగేశ్వరరావు నటించారు.

దీనిలో నాగేశ్వరరావు, సావిత్రిలతోపాటు జగ్గయ్య, గుమ్మడి, రేలంగి, నాగయ్య, చలం, కుటుంబ



నాగేశ్వరరావు నవభూమికలు ధరించిన పి. ఏ. వి. చిత్రం "నవరాత్రి"లో
సావిత్రి, నాగేశ్వరరావు


రావు, ప్రభాకరరెడ్డి, సూర్యకాంతం, జయలలిత, కాంచన, జమున, ఛాయాదేవి, గిరిజ, నిర్మల, గీతాంజలి, హేమలత, ఋష్యేంద్రమణి ప్రభృతులంతా అతిథులుగా పాల్గొన్నారు.

"భార్యాభర్తలు" చిత్రంతో ప్రత్యగాత్మను దర్శకుడుగా సమర్పించిన పి. ఎ. వి. సంస్థ ఈ చిత్రం ద్వారా తాతినేని రామారావు అనే మరొక యువ దర్శకుని పరిచయం చేస్తున్నది.

ఈ చిత్రంలో కొన్ని విశేషాలు : నవరాత్రి చిత్రంలో సావిత్రీ సత్యవంత కథ వీథిభాగవతం అత్యంత వినోదకరమైన ఘట్టాలలో ఒకటి. ఇందులో సావిత్రి పాత్రను శ్రీమతి సావిత్రి ధరించి గాత్రధారణ కూడా చేసి ఘంటసాలతో కలసి పాడింది. ఆమె ఇలా పాడడం ఇదే తొలిసారి.

ఈ భాగవత ప్రదర్శనలో రమణారెడ్డి, నల్లరామమూర్తి, సీతారాం, రాజబాబు, రామచంద్రరావు (చంటిబాబు) మొదలయిన వారంతా పాల్గొన్నారు.

నవరాత్రి చిత్రంలో హుషారయిన మరొక ఘట్టం పిక్నిక్ పత్రి. నటీమణులు — జయలలిత, జమున, కాంచన, గీతాంజలి, గిరిజ, సూర్యకాంతం, ఛాయాదేవి మొదలైన వారు ఇందులో అతిథులుగా పాల్గొన్నారు.



"నవరాత్రి"లో
నాగేశ్వరరావు ధరిస్తున్న
పదవ భూమిక

హాస్య ప్రధాన సన్నివేశాలలో శాంతన్న ఇంటి నగర ఘట్టం ఒకటి. ఇందులో పల్లెరైతుగా నాగేశ్వరరావు తూర్పు యాసలో మాట్లాడడం ఒక ప్రత్యేక ఆకర్షణ. అమాయకులను హడలగొట్టి, డబ్బులు గుంజుకునే భూత వైద్యుడుగా అతిథి నటుడు రేలంగి బాగా నటించాడు.

ఏప్రిల్ మొదటి వారంలో శ్రీ సారధి స్టూడియోస్‌లో సోవియట్ ఫిలిం ప్రతినిధి వర్గానికి "నవరాత్రి" తెలుగు చిత్రం ప్రదర్శించారు. మొత్తం చిత్రమును, నాగేశ్వరరావు బహుముఖ ప్రజ్ఞను రష్యనులు మెచ్చుకొన్నారు.

"పరమానందయ్య శిష్యుల కథ"

జానపద, పౌరాణిక, హాస్య భాగవత ఇతి వృత్తాల సమ్మేళనం "పరమానందయ్య శిష్యుల కథ"

జానపదాంశం : నందివర్ధన మహారాజు (రామారావు) మధుపాన మత్తుడై రాజనర్తకి రంజని (విజయలక్ష్మి) మోహావేశంలో సక్రమ ప్రజాపాలనే విస్మరిస్తాడు. మహామంత్రి (ముక్కామల) రాజ్య కాంక్షతో పథకాలపై పథకాలు వేస్తాడు. సమయం చూచి రాజును పదచ్యుతుణ్ణి చెయ్యాలని కలలు కంటాడు. దొంగల ముఠాతో చేతులు కలుపుతాడు.

రాజగురువు పరమానందయ్య (నాగయ్య) ఉపదేశంవల్ల మహారాజు శివపూజ జరుపుతాడు కాని అదీ వక్రగతిలోనే సాగుతుంది.

పౌరాణిక భాగం : భూలోకంలో నందివర్ధన మహారాజు వక్రపూజను కైలాసం నుంచి చూసిన పార్వతి, శివునికి నిరసన తెల్పుతుంది. శివుడు ఆ మహారాజే మహాభక్తుడని చెప్పి, రాజ్యపాలనను అతడు సక్రమంగా సాగించేందుకు గంధర్వ రాజకన్య చిత్రలేఖను (కె. ఆర్. విజయ) సాధనంగా పంపుతాడు. కైలాసం నుంచి ఈశ్వరప్రసాదిత రుద్రాక్ష మాలతో భూలోకానికి వచ్చింది చిత్రలేఖ.

హాస్య భాగవతం : భూలోక తటాకంలో చిత్రలేఖ స్నానంచేస్తూ వుండగా దారిన పోతున్న మహా విజ్ఞానులు, అరుణకేశ ముని శిష్య సప్తకం చూస్తుంది. చిత్రలేఖ ఆగ్రహించి పరమ శుంఠలు కండని శపిస్తుంది. మహా విజ్ఞానులు పరమ శుంఠలై పరమానందయ్య పంచన శిష్యులై హాస్య వర్షం కురిపిస్తారు.

రూపంలో చేష్టలలో అజ్ఞానులైనా, దొంగలను పట్టుకొంటారు; గురువుగారి కుమార్తెకు మోసం పెళ్ళి తప్పిస్తారు. తమను శపించిన చిత్రలేఖను, తమను శుంఠలక్రింద లెక్కకట్టిన నందివర్ధన మహారాజును వివాహ బంధంలో బిగించి రాజునూ, రాజ్యాన్నీ రక్షించి శాప విముక్తులై సీతాకోకలవలె అరుణకేశముని ఆశ్రమానికి ఎగిరిపోతారు.

జానపద, పౌరాణిక, హాస్య భాగవతములను చాలా చక్కగా గది్రుచ్చారు.

సదాశివబ్రహ్మం, సి. పుల్లయ్య, తోట సుబ్బారావు, నాగయ్య, కె. ఆర్. విజయ, ఎన్. టి. రామారావు, విజయలక్ష్మి, పద్మనాభం, వాలి (కళాదర్శకుడు), సి. నాగేశ్వరరావు (ఛాయాగ్రహణ దర్శకుడు) అభినందనీయులు.



"శ్రీకాకుళ ఆంధ్ర మహావిష్ణువు కథ" లో
రామారావు, జమున

"అర్ధరాత్రి" కొత్త తారలు, కొత్త దర్శకుడు

హైదరాబాద్ మూవీస్ వారు నిర్మిస్తున్న "అర్ధరాత్రి" అపరాధ పరిశోధక చిత్రంకాదు. ఉత్కంఠ ప్రేరేపక చిత్రం. క్రైమ్ పిక్చర్ల లోని ఉత్కంఠ, సాంఘికాలలోని సెంటిమెంట్, ప్రయోజనాత్మక చిత్రాల సందేశం మిళితమైవున్న ఇతి వృత్తానికి ఆరుద్ర సాహిత్య రూప మిచ్చారు. నిర్మాత శ్రీ పి. గంగాధరరావు. ఈ చిత్రం ద్వారా పి. సాంబశివరావు అనే దర్శకుని పరిచయం చెయ్యడమే కాక రెండు మూడు నిమిషాలు నాట్యకత్తెగా రెండు మూడు చిత్రాలలో కన్పించిన భారతిని నాయికగా పరిచయం చేస్తున్నారు. బి. సరోజా

దేవి ఫేస్‌కట్ కల ఈ తారతో, జగ్గయ్యతో మొదటి షెడ్యూలు. హాస్పిటల్ సెట్‌తో రెండవ షెడ్యూల్. భాగతి, పెరుమాళ్ళు, నిర్మలతో నాయిక సెట్‌లో మూడవ షెడ్యూల్ ముగించి ఏప్రిల్‌లో మరి రెండు షెడ్యూల్సు పూర్తి చేశారు. ఈ నెల మొదటి షెడ్యూల్‌లో కారు ప్రమాద ఘట్టం, అనంతర పరిణామాలు, రెండవ షెడ్యూల్‌లో నర్తకి ఎత్తుగడలు చిత్రీకరించారు. ఈ నర్తకి కూడా రాధిక అనే కొత్త నటి. తెలుగు తెరకు తొలి పరిచయం. నాట్యంలో తీవి, చురుకుదనం, భావంలో విస్పష్ట ముద్ర వున్నాయి.

ఒక హాస్య పాత్రకు ఒక కొత్త అమ్మాయిని, మరొక ముఖ్యమైన పాత్రకు మరొక కొత్త అమ్మాయిని పరిచయం చెయ్యాలని నిర్మాత సంకల్పం.

30 సంవత్సరాల వయసు కల సాంబశివరావు లోగడ ఆదుర్తి, చాణక్య, సి. ఎస్. రావుల వద్ద ముఖ్య సహాయకునిగా వున్నారు.

"దర్శకుడు చిత్రించవలసింది బాహ్యాడంబరాలు కావు. పాత్రల హృదయాలూ, వాటి లోతులూ" అనేది ఈ యువ దర్శకుని నిశ్చితాభిప్రాయం.

గంటసేపు కవ్వించి కవ్వించే ఘట్టంకన్న క్షణంపాటు హృదయాన్ని ఆకట్టుకొనే సన్నివేశం ఎక్కువకాలం జీవిస్తుందన్నది ఈయన మతం.

ఈ సంచిక వెలువడే సరికి ఏడు రీళ్ళ చిత్రం సిద్ధమౌతుంది. మే 1 నుంచి 15 వరకు హీరో సెట్‌పై సాగే షూటింగ్‌తో ముప్పాతిక సిద్ధమౌతుంది.

అర్థరాత్రి ఆర్తనాదం అర్థం ఏమిటి?

ఆ ప్రశ్న చిత్రంలోని ప్రతి పాత్రను అంత్య ఘట్టంవరకు కలవరపరచుతుంది. పాత్రతోపాటు ప్రతి ప్రేక్షకునికి "శుభం" వరకు ఆ ప్రశ్న ఆసక్తి కలుగజేసేటట్లు చిత్రం రూపొందించడమే తన లక్ష్యమని కొత్త దర్శకుడు అన్నారు.

"అర్థరాత్రి" యూనిట్‌లోని మిగిలిన ముఖ్యులు :

పాటలు : దాశరథి, ఆరుద్ర, కొసరాజు; సంగీతం : వేణు; కెమెరా : జె. సత్యనారాయణ; ఎడిటర్ : వీరప్ప; కళ : రాజేంద్రకుమార్.

ఫిలిం జర్నలిజంకు నవరూపం

ఫిలిం జర్నలిజమ్ క్రమబద్ధం చేసి, వృత్తి గౌరవాన్ని ఇనుమడింపజేయడానికి ఆంధ్ర ఫిలిం జర్నలిస్టుల సంఘం (మద్రాను) కొత్తకార్యవర్గం ఏప్రిల్‌లో సంకల్పించింది. సినిమా రచనను ఒక కళగా, కాల్పనిక శక్తిగా, మిక్కిలి గొంప్రదమైనదిగా, మార్గదర్శకమైనదిగా రూపొందించడానికి ఉద్యమించిన సంఘ కార్యవర్గం వివరమిది :

అధ్యక్షుడు: బొమ్మకంటి సుబ్బారావు, ఉపాధ్యక్షుడు : శార్వరి, ప్రధాన కార్యదర్శి : మాగావు రామన్, సంయుక్త కార్యదర్శి : కె. కె. శర్మ; కార్యవర్గ సభ్యులు : వెంకట్, గిడుగు రామారావు, జి.వి.జి. కృష్ణ, వాశిరాజు ప్రకాశం, ధర్మారావు, ఎల్లోరా, శ్రీకృష్ణ, ప్రసన్న.



బాబూమూవీస్ "కన్నెమనసులు" చిత్రంలో రామమోహన్, సుకన్య

"రహస్యం" గుహలలో ఇంద్రలోక రహస్యం

లలిత శివజ్యోతి వారి 'రహస్యం' ఈస్టుమన్ కలర్ చిత్రంలో ఏప్రిల్ ఒకటవ తేదీనుంచి 10వ తేదీ మధ్యాహ్నం వరకు, హైదరాబాద్‌లో కొన్ని ముఖ్య ఘట్టాలు చిత్రీకరించారు. ఆ సంస్థ లీజుకు తీసుకొన్న సదరన్ మూవీటోన్ స్టుడియోన్‌లో ఒక పూర్తి ఫ్లోర్‌లో వేసిన గుహ ఇంటీరియర్ సెట్‌లోను, జలపాతంకల ఎక్స్‌టీరియర్ సెట్‌లోను షూటింగ్ జరిగింది. పాపనాశం జలపాతం, దానికి దగ్గరగా తిరుపతి కొండలు, గుహలు వంటివి ఈ రెండు సెట్లూను. కళా దర్శకుడు శ్రీ టి. వి. ఎస్. శర్మ ఆయా వాతావరణములను ఆయా సెట్‌లలో చక్కగా తీసుకొని రావడమేకాక గుహలను అజంతా ఫక్కీలో మెరుగు దిద్దారు.

ఒక అత్యద్భుత పరిస్థితిలో ఈ గుహలే ఇంద్రలోకంగా మారిపోతవి. ఇంద్రలోక దృశ్యాల చిత్రీకరణకు ఆ సెట్టును కూడా అపూర్వాకర్షణలతో అదే స్టుడియోలో వేశారు. షూటింగ్ షెడ్యూలు వ్యవధి అయిపోయినందున ఆ సెట్‌పై పని యింకా మిగిలి వుంది. తదుపరి షెడ్యూల్‌లో అది ముగించుతారు. గుహ ఇంద్రలోకంగా మారేటంతవరకు చిత్రీకరించారు.

గుహ, జలపాతం సెట్‌లలో ఓం ప్రథమంగా నాగేశ్వరరావుపై చిత్రీకరణ జరిపారు. గుహలో రక్తభూషణుడు (రంగారావు) అనే మాంత్రికుడు, మహాయోగి వున్నాడు. వ్యాధుల నివారణలో ఆయన దివ్యశక్తి ఆ మండలమంతా వ్యాపించగా పేదలనుంచి ధనాధికుల వరకు అనేకులు అచ్చటకు వచ్చారు. ధనికుల ముందు పేదలగోడు వినేవారు లేరు. దానికి తగ్గట్టు రక్తభూషణుడి శిష్యుడు (రమణారెడ్డి) ధనిక, నిర్ధనిక భేదంతో అర్తులపై సాగిస్తున్న అధికారం యింతా అంతాకాదు. ఒక పేద కుష్ఠురోగి నిస్సహాయురాలై విలపిస్తున్నది. ఆ వాతావరణం చూసి, ఆ భేదాలను ఛేదించాలనే ఉత్తమ నిర్ణయం చేసుకొన్న మాందకుడు (నాగేశ్వరరావు) ఆ కుష్ఠురోగికి సహాయపడి రక్తభూషణుని వద్దకు తీసుకొని వెడతాడు. అది నాగేశ్వరరావుపై గుహ సెట్ వద్ద తీసిన మొదటి ఘట్టం.

రక్తభూషణుడి సహాయానికై వచ్చిన పాత్రలలో బి. సరోజాదేవి, కృష్ణకుమారి, నాగయ్య వున్నారు. రక్తభూషణుని పరీక్షించే సంకల్పంతో వచ్చిన వారిలో కార్వేటి స్థానిక అధిపతి (గుమ్మడి), వారికీ వీరికీ వివాదం తెచ్చిపెట్టే భూమికలలో ముదిగొండ లింగమూర్తి, లంకసత్యం వున్నారు.

రెండు సెట్లపై జరిగిన షూటింగ్‌లో 140 మందితో జన సమూహ దృశ్యాలు చిత్రీకరించారు. ఇంకా కాంతారావు, రేలంగి, గిరిజ, రాజనాల, జి. వరలక్ష్మి కూడా చిత్రీకరణలో పాల్గొన్నారు.

కార్వేటి స్థానిక అధిపతికి, మాంత్రికునికి మధ్య జరిగిన ప్రజ్ఞ పోటీలోనే మాంత్రికుడు గుహను ఇంద్రలోకం చేసివేస్తాడు. కుష్ఠురోగిని కాపాడిన మాందకుడు (నాగేశ్వరరావు) ఆ నవలోకంలో ఇంద్రుడై పోతాడు.

అద్భుత రసప్రధానమైన ఈ వర్ణ చిత్రంలో అపూర్వ తారా సమ్మేళనంతోపాటు అపురూప సౌందర్యం కల సెట్ నిర్మాణాలు కూడా చూడబోతున్నాము. ఇప్పటికి సగం చిత్రం సిద్ధమైంది.

"రహస్యం" యూనిట్ సాంకేతిక వర్గం :

ఎన్. శంకరరెడ్డి, వేదాంతం రాఘవయ్య, కీ॥ శే॥ మల్లాది రామకృష్ణశాస్త్రి, సదాశివబ్రహ్మం, సి. నారాయణరెడ్డి, ఘంటసాల, పి. ఎల్. రాయ్, సుందరం, టి. వి. ఎస్. శర్మ.

కథలో పౌరాణిక, జానపద అంశాలు వున్నా దత్తమండలానికి అవి సంబంధించినవై వుండడం "రహస్యం" ప్రత్యేకతలలో ఒకటి.



శ్రీ శంభూ ఫిలిమ్సువారి "శ్రీకాకుళ ఆంధ్ర మహావిష్ణువు కథ"లో దుష్ట మంత్రిగా క్యారక్టర్ యాక్టర్ ముదిగొండ లింగమూర్తి

కొత్త నటుడు కృష్ణంరాజు

1966 లో ఓం ప్రథమంగా పరిచయం కానున్న హీరో 'చెడు చూడవద్దు', 'చెడు వినవద్దు', 'చెడు మాటాడవద్దు' మార్కు కృష్ణంరాజు. ఆత్మా ఆర్ట్స్ వారి 'చిలకా



గోరింకా'లో ఒక చిలక. ఆత్మా ఆర్ట్స్ బ్యానర్ గాంధీకి మూడు కోతుల చిహ్నం.

పొడగరి అయిన కృష్ణంరాజు హైదరాబాద్‌లో బి. కాం. చదివి సినిమారంగంలో ప్రవేశం విషయంలో కూడా 'బి కామ్ — ప్రశాంతంగానే జరగనీ—అనే పాలసీ అనుసరించారు.

కొంతకాలం వరకు నాటకాలు ఆడలేదు కాని ఆడించారు. 'అబ్బాయీ! అది అనుభవం గడించాలి, 'లోపలి శక్తిని పైకి తీయాలి' అని ఒక దర్శకుడు సూచించేసరికి ఓ జానపద నాటకంలో నటించి ఆ దర్శకుడికే 'చిత్ర చిలుక' కాగలనని సూచించారు.

'సినీమాలో చేరాలి అంటే సినిమా షూటింగ్‌లైనా చూడాలి' అని ఆ దర్శకుడే మళ్ళీ ఓ డైరక్షన్-మార్గం చూపారు. ఈ మంచిమనిషి ఆ మంచిమనిషి యొక్క 'మంచి మనిషి' సినిమా షూటింగ్‌లకు ప్రత్యక్ష సాక్షి అయి ప్రాక్టికల్ టెస్ట్‌కు నిలబడగలనని సూచించారు. సినిమా పాత్రలలో మంచి మనిషి వెయ్యగల 'ఆత్మ'బలం వచ్చిందని ఆ పి. ఆత్మకు చెప్పారు.

కృష్ణంరాజు ఒడ్డూ పొడుగులకు తగ్గ ఆరోగ్యం కలవాడు. ఆరోగ్యాన్ని నిష్ఠగా నిలుపుకొనే ఆత్మశక్తి కలవాడు. క్రీడాకారుడు. ప్రకృతి వైద్యాభిమాని.

ఆ డైరెక్టర్ చెప్పింది అక్షరాలా



బాబూమూవీస్ "కన్నె మనసులు"లో సుకన్య

ఆచరించి, ఆరోగ్య నియమాలను తు. చ తప్పకుండా పాటించి, మూడేళ్ళ సినిమా సత్యవ్రతం సాగించిన ఈ పశ్చిమ గోదావరి జిల్లా నాయకుడు కృష్ణంరాజు (జననం 1940 జనవరి 20)ను ప్రత్యగాత్మ ఓ యింటి (స్వంత కంపెనీ) వాడై 'చిలకా గోరింకా' ప్రారంభించగానే ఈ చిలుకను బుక్ చేశారు.

మూడు కోతులపై 'మమత'కల ఈ 'మనిషి' శ్రీ ఆత్మ (హిందీ రంగంలో ప్రత్యగాత్మ పేరు పి. ఆత్మ) మూడు చిలకా గోరింకల కథలను 'చిలకాగోరింకా' చిత్రంలో మనోజ్ఞంగా ప్రదర్శిస్తున్నారు.

కృష్ణంరాజు సినీ ఊహాపథంలో నాగేశ్వరరావు, బాలరాజ్ సహానీ, ఎస్. వి. రంగారావు ముగ్గురు గొప్ప రాజులు; సావిత్రి, మీనాకుమారి, జమున ముగ్గురు గొప్ప రాణులు.

• • •

డి. వి. ఎస్. జానపద చిత్రం తారాగణం

డి. వి. ఎస్. ప్రొడక్షన్స్ వారి జానపద చిత్రం స్క్రిప్టు సిద్ధమైనది. రామారావు, రాజశ్రీ, రాజనాల, ముక్కామల, రామలింగయ్య బుక్ అయినారు. జూనియర్ సముద్రాల, విఠలాచార్య, డి. వి. ఎస్. రాజు యూనిట్ ముఖ్యులు.

చలన చిత్ర వార్తలు

రంగారావుకు భానుమతి జోలపాట

నాగేశ్వరరావు, భానుమతి, సూర్యకాంతంలతో భరణీ వారికి శ్రీ పి. యస్. రామకృష్ణారావు తీయనున్న హాస్యచిత్రం ఏప్రిల్ ఆరంభంలో సంగీత ఘట్టంలో పడింది. సంగీత దర్శకుడు ఎస్. రాజేశ్వరరావు.

దాశరథి రచించిన ద్వంద్వార్థపు జోలపాటను భరణీలో రికార్డు చేశారు.

సినిమాలో రంగారావు మామగారు, కోడలుగారు భానుమతి. సమయం రాత్రి. భర్తగారు నాగేశ్వరరావు మేడపై వున్నారు. రేపు పరీక్షలు పెట్టుకొని భార్యగారిని పైకి రమ్మనమని సంజ్ఞలు చెయ్యలేక అవస్థలు పడుతున్నారు. ముందు మామ, వెనుక భర్త. రెండవస్థలలో చిక్కుకొన్న భార్యగారు (భానుమతి) ఇద్దరికీ వర్తించేట్టు పాడిన పాట అది.

ఏప్రిల్ మాసాంతంలో కాని, మే ఆరంభంలో కాని చిత్రీకరణ ప్రారంభం కాగల ఈ హాస్య చిత్రానికి డి. వి. నరసరాజు సంభాషణలు సమకూర్చారు. 'ఏక్ టుక్ బాషా' అనే బెంగాలీ చిత్రం ఆధారం.

పద్మశ్రీ చిత్రం

పద్మశ్రీ వారి సాంఘికానికి ముళ్ళపూడి వెంకట రమణ స్క్రిప్టు సిద్ధం చేశారు. దర్శకుడు పి. పుల్లయ్య, నిర్మాత వెంకటేశ్వర్లు ప్రథమ పరిశీలన గావించారు. నాగేశ్వరరావు ముఖ్య పాత్రధారి. జులైలో సెట్స్‌కు వెళ్ళవచ్చు.

మొసళ్ళతో రామారావు పోరాటం

శంభూ ఫిలిమ్స్ వారి 'శ్రీకాకుళ ఆంధ్ర మహావిష్ణువు కథ'లో వల్లభదేవుడు, చోరమయమైన ప్రాంతంలోని ఒక తటాకంలో దిగి మొసళ్ళతో పోరాడడాన్ని ఏప్రిల్‌లో చిత్రీకరించారు. ఆ పోరాటంతో చోరుల నిజస్వరూపం బైట పడుతుంది. కవి : పింగళి, నిర్మాణ సారథి డి. చౌదరి. నిర్మాత : దగ్గుపాటి లక్ష్మీ నారాయణ చౌదరి, దర్శకుడు : ఎ. కె. శేఖర్. విడుదల 'మే' మొదటివారం.

• • •

రిపబ్లిక్ ప్రొడక్షన్స్ వారి 'సత్యం, శివం, సుందరం' సగానికి పైగా సిద్ధమైనది. దర్శక – నిర్మాత సి. సీతారాం.



"భక్తపోతన"లో అంజలి, జయశ్రీ, బాలనటి

"చిన్నమ్మ - చిట్టెమ్మ"

గోకుల్ ఆర్ట్ పిక్చర్స్ వారు జి. వి. జి. కృష్ణ నవల "గంగా జమున" ఆధారంగా "చిన్నమ్మ – చిట్టెమ్మ" అనే చిత్రం తీయబోతున్నారు. ఏప్రిల్ ఆరంభంలో సంగీత దశ ప్రారంభమైంది. నారాయణరెడ్డి వ్రాసిన పాటను ఫిలిం సెంటర్‌లో రికార్డు చేశారు. 'మే' రెండవ వారంలో షూటింగ్ ప్రారంభ మౌతుంది. నాయిక ద్విపాత్రాభి

నయం ఈ చిత్రంలో విశేషం. ఈ సంచిక వెలువడే సరికి ఒక వర్ధమాన నటిని ఆ భూమికకు నిర్ణయిస్తారు. ఇంతవరకు కాంతారావు, చలం, సూర్యకాంతం బుక్ అయినారు. సంభాషణలు : బొల్లిముంత శివరామకృష్ణ, సంగీతం : టి వి. రాజు, దర్శకుడు : ఎస్. డి. లాల్, నిర్మాత : దోనేపూడి కృష్ణమూర్తి.

త్రాసులో రామారావు

సురేష్ ప్రొడక్షన్స్ వారి 'శ్రీకృష్ణ తులాభారం' లో వాహినీలో ఏప్రిల్ ఆరంభంలో మరికొన్ని ముఖ్య సన్నివేశాలు చిత్రీకరించారు. శ్రీకృష్ణుని (రామారావు) తులాభారము చేయుట ఒక ముఖ్య సన్నివేశము. నారదుడిపై, (కాంతారావు) భలేమంచి చౌక బేరము పాట చిత్రీకరించారు. అంజలి, జమున రుక్మిణి, సత్యభామలుగా నటిస్తున్న ఈ చిత్రానికి సంభాషణలు సముద్రాల రాఘవాచార్య సమకూర్చారు. కళా దర్శకుడు రాజేంద్ర కుమార్, ఛాయాగ్రహణ దర్శకుడు అన్నయ్య, చిత్రదర్శకుడు కమలాకర కామేశ్వరరావు, నిర్మాత డి. రామానాయుడు.

ఈస్ట్‌మన్ కలర్ ఫిల్ము లభించనందున తెలుపు - నలుపులోనే ఈ చిత్రం తీస్తున్నారు.

"ఆస్తిపరులు" : నాగేశ్వరరావు పాత్ర

జగపతీ వారి 'ఆస్తిపరులు'లో ఈ సంచిక వెలువడేసరికి ఉదకమండలం, కొడైకెనాల్‌లలో ఐదు యుగళ గీతాలపై చిత్రీకరణ ముగిసి వుంటుంది. నాగేశ్వరరావు, జయలలిత, జగ్గయ్య, ఒక నాట్యకత్తె పాటలకు ఆట ఇచ్చేవారు. 'మే'లో ఒక షూటింగ్ షెడ్యూలు పూర్తి కాగానే 'ఆస్తిపరులు' షూటింగ్ దశ దాటినట్లవుతుంది.

ఈ చిత్రంలో నాగేశ్వరరావు భూమిక విశిష్టమైనది. వేలు విడిచిన తమ్ముడు ప్రాణమే విడిపించే ఎత్తుగడలు వేస్తూ వుంటే చిట్టి చెల్లాయి కోసం సాహస త్యాగాలు ప్రదర్శించడం ఆ భూమిక లక్షణం. గుమ్మడి, రేలంగి, సూర్యకాంతం, జి వరలక్ష్మి, బేబీ పద్మిని మొదలైనవారు తారాగణంలో కలరు. రచన ఆత్రేయ, దర్శకుడు వి. మధుసూధనరావు, సహకార దర్శకులు వి. సి. రెడ్డి, గోపాలకృష్ణ. నిర్మాత రాజేంద్ర ప్రసాద్. హైదరాబాద్ శ్రీ సారథి స్టుడియోస్‌లో మార్చి మాసాంతంలో, ఏప్రిల్ ఆరంభంలోను షూటింగ్ జరిగింది. పై పాత్రధారులు పాల్గొన్నారు.



రేఖా అండ్ మురళీ ఆర్ట్సు వారి "పొట్టి ప్లీడరు"లో పద్మనాభం

విజయావారి హిందీచిత్రం

'రాముడు - భీముడు' ఆధారంగా విజయావారు 'రామ్-శామ్' హిందీలో (ఏప్రిల్ 7 నుంచి) తీస్తున్నారు. దర్శకుడు చాణక్య. బ్రహ్మాండమైన జమీందార్ సెట్ వాహినీలో వేశారు. నిర్మాత నాగిరెడ్డి గారు అంగుళం అంగుళం ప్రత్యక్షంగా చూచి నిర్మాణాధ్వర్యం వహించారు.

శాంతారామ్ తాజా చిత్రం

మహారాష్ట్ర జీవితంపై, మహారాష్ట్రలోని 'సహ్యాద్రి' (కొండల) 'పిల్ల'పై స్వచ్ఛమైన మహారాష్ట్ర కట్టుబొట్టులతో, సంప్రదాయాలతో మహారాష్ట్ర భాషలో తీసిన "లడ్కీ సహ్యాద్రికీ"ని అచ్చటచ్చుట హిందీలో 'డబ్' చేసి ఏప్రిల్‌లో మన ప్రాంతాలలో విడుదల చేశారు.

హిందీ చిత్రం అన్నాక సాధారణంగా ప్రేక్షకుల కళ్ళల్లో బొంబాయి గ్లామర్ మెరుస్తూ వుంటుంది. అటువంటిది పాత్రలు మహారాష్ట్ర సంప్రదాయాలలో తెరపై ప్రకాశిస్తూ పెదవులకు అతకని హిందీ మాట్లాడుతూ వున్నవి అంటే శాంతారామ్‌పై అభిమానం రవ్వంత సన్నగిల్లుతుంది.

అలానే ముఖ్యతార విషయంలోను. సంధ్య మంచి నర్తకి కావచ్చు. మంచి నటి కావచ్చు. కాని వయసును ఎవ్వరూ జయించలేరుకదా. 'దుష్యంతుడు' శాంతారామ్ పై విషయాన్ని ఈ కొత్త చిత్రంలో కూడా ఖాతరు చెయ్యలేదు. అందుచేత కూడా చిత్రం అసలు వెలుగుకు రవ్వంత 'నీడ' తగిలింది.

చిత్రంలో మొదటి మూడు రీళ్ళదీ మహా మందగమనం.

ఏమైనా శాంతారామ్ చిత్రం అన్నాక ఆయన నుంచి ఆశించిన దానిలో కొంతకు కొంత కనిపించక మానదు. "లడ్కీ సహ్యాద్రికీ" మరాఠీ చిత్రమే అని అనుకొని చూస్తే పై లోపాలు కూడా వుండవు.

నేటి నాటక రంగంపై ఒకవైపు దెబ్బతీస్తూ, 'ట్విస్ట్' వంటి పాశ్చాత్య నృత్యరీతులకు మనం ఎగబడ నవసరం లేదనీ, మన నృత్యశాస్త్రంలోనే అంతకంటె గొప్పది వున్నదని ఒక చెంప నిరూపిస్తూ, కాలేజీ చదువులేకపోయినా సంగీత నృత్యములతో జీవనోపాధి చూసుకోవచ్చునని సందేశమిస్తూ, పురాణ కాలక్షేపాల రోజులు పోయాయి, నేతాజీ సుభాష్ చంద్రబోస్, ఝాన్సీకి రాణీవంటి వీరుల, వీర వనితల గాథలను కీర్తనలుగా గానం చేసే రోజులు వచ్చాయని, ఉద్బోధిస్తూ శాంతారామ్ నాటక, నృత్య చలనచిత్ర, సంగీత కళలకే కాక దేశానికి జాతికి ఉపకరించే ఉత్తమ చిత్రం తీశారు.

ఈ చిత్రంలో అంతటి రమణీయమైన సెట్లు, వర్ణ ఛాయాగ్రహణం, (వసంత దేశాయ్) సంగీతం చాలా అరుదుగా చూస్తాము; వింటాము.

శాంతారామ్ తన దర్శకత్వాన్ని జెట్ విమానంగాను, తన ఎడిటింగ్‌ను ట్యాంక్‌గాను, టైటిల్స్‌లో సూచించారు. చిత్రం ముగింపు వాటిని సార్థకం చేసింది.

□□□

Edited and Published by V. V. Raghavaiah
and Printed by him at Jyothi Press
... Office Road, Governorpet, Vijayawada...

JYOTI '66 MAY Regd. No. H368

